
'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి.
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 301

సోమవారం 22-1-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**జొకోవిచ్ జోరుగా...**
ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లోకి వరల్డ్ నంబర్‌వన్ -12లో



**పెట్టుబడులకు దారేది..?**
ఈక్విటీలతోనే మెరుగైన రాబడి. బంగారానికి తప్పక చోటుండాలి -13లో



### అది భారత విమానం కాదు
థాయ్‌లాండ్ నుంచి మాస్కోకు వెళ్తూ అఫ్గానిస్తాన్‌లో కూలిన విమానం భారత్‌కు చెందినది కాదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.
వివరాలు 6లో ▸



### రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లో దాడి
రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగంలోని ఒక మార్కెట్‌పై జరిగిన దాడిలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸



### 4 రోజుల్లోనే ఆపేసేవాళ్లం
ప్రధాని పదవిలో కాంగ్రెస్ నేత ఉండి ఉంటే మణిపూర్‌లో హింసకు నాలుగు రోజుల్లోనే ఫుల్‌స్టాప్ పడి ఉండేదని రాహుల్ అన్నారు.
వివరాలు 6లో ▸



### సెలవుపై ఎయిమ్స్ వెనక్కి...
'అయోధ్య'లో ప్రాణప్రతిష్ట సందర్భంగా ఓపీ విభాగానికి సెలవు ఇస్తూ తీసుకున్న నిర్ణయంపై ఢిల్లీ ఎయిమ్స్ వెనక్కి తగ్గింది.
వివరాలు 6లో ▸



ఆదివారం తమిళనాడులోని రామేశ్వరం వద్ద బంగాళాఖాతంలో సముద్ర జలాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రార్థనలు చేస్తున్న ప్రధాని మోదీ



## అయోధ్యలో నేడే రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట

# అంతా రామమయం

చరిత్రాత్మక ఘట్టంలో భిన్న మతాలు, సంప్రదాయాలు, వర్గాలకు భాగస్వామ్యం

ఉత్సవానికి ప్రధాన యజమానిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ప్రాణప్రతిష్ట తర్వాత అతిథులు, ప్రముఖులకు రామ్‌లల్లా దర్శనం..

ఆధ్యాత్మిక శోభతో వైభవంగా వెలిగిపోతున్న అయోధ్యాపురి

ప్రారంభమైన అతిథులు, ప్రముఖుల రాక..

నగరమంతటా పటిష్ట బందోబస్తు

దేశమంతటా శ్రీరాముడి నామస్మరణ..

నేడు 60కిపైగా దేశాల్లో వేడుకలు

భవ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ట కోసం అయోధ్య నగరం అందంగా ముస్తాబైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు, ప్రముఖుల సాక్షిగా గర్భగుడిలో రామ్‌లల్లా కొలువుదీరబోతున్నాడు. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని తిలకించడానికి దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 12.20 గంటలకు ప్రధాన వేడుక ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 12:29:08 గంటల నుంచి 12:30:32 గంటల వరకు.. మొత్తం 84 సెకన్లలో గర్భగుడిలో ప్రాణప్రతిష్ట పూర్తవుతుంది. అపూర్వమైన ఈ వేడుకలో భిన్న మతాలు, సంప్రదాయాలు, వర్గాలకు భాగస్వామ్యం కల్పిస్తున్నారు. పర్వతాలు, అడవులు, తీర ప్రాంతాలు, ద్వీపాలు తదితర అన్ని ప్రాంతాలకు చెందిన వారు ఒకే చోట ఒక కార్యక్రమంలో పాల్గొంటుండడం భారతదేశ చరిత్రలో ఇదే తొలిసారి అని శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు తెలియజేసింది. రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా అయోధ్యలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రపంచవ్యాప్తంగా 60కిపైగా దేశాల్లో సోమవారం ఉత్సవాలు జరగబోతున్నాయి. 6లో

### నేడు గర్భాలయం లోపల..

ఉదయం 10:00
మంగళ ధ్వనితో శ్రీకారం

మధ్యాహ్నం 12.20
ప్రధాన వేడుక ప్రారంభం

12:29:08 - 12:30:32
84 సెకన్లలో గర్భగుడిలో బాలరాముడి ప్రాణప్రతిష్ట

7,000
హాజరుకానున్న అతిథులు

10,00,000
ఏకకాలంలో వెలిగించనున్న ప్రమిదలు

## ప్రపంచ నగరిగా అయోధ్య

**రూపురేఖలు మార్చుకోబోతున్న ఆధ్యాత్మిక నగరం**

- ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేలా మాస్టర్ ప్లాన్–2031
- రూ.85 వేల కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళిక
- సరయూ నదిలోకి చుక్క మురికి నీరు చేరకుండా ఎస్టీపీలు
- ప్లాస్టిక్ వ్యర్థాలను ఇంధనంగా మార్చే రీసైక్లింగ్ యూనిట్
- నిత్యం 3 లక్షల మంది భక్తులు వచ్చినా తట్టుకునేలా చర్యలు

**లక్ష వెంకన్న లడ్డూలు**

**రెండు గ్రాముల 'బంగారు' రామాలయం**

-వివరాలు 14లో

## నామినేటెడ్ పోస్టుల భర్తీ షురూ

**సీఎం సలహాదారుడిగా వేం నరేందర్‌రెడ్డి**

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్
- ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు రవి
- రేవంత్‌రెడ్డి దావోస్ నుంచి వచ్చే ముందు రోజే ఉత్తర్వులు
- ఒకట్రెండు రోజుల్లో కార్పొరేషన్ పదవులకు కూడా
- 9 లేదా 18 కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల ప్రకటన
- మార్కెట్ కమిటీ పదవులపైనా కసరత్తు..



నరేందర్‌రెడ్డి షబ్బీర్ అలీ వేణుగోపాల్ మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ పోస్టుల భర్తీకి అధికార కాంగ్రెస్ శ్రీకారం చుట్టింది. ఇటీవల ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేసిన ఆ పార్టీ, తాజాగా నలుగురు ముఖ్య కాంగ్రెస్ నేతలకు కేబినెట్ హోదా కల్పించింది. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన వేం నరేందర్‌రెడ్డిని సీఎం సలహాదారుడిగా (ప్రజా వ్యవహారాలు) నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. షబ్బీర్‌అలీ (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు), హర్కర వేణుగోపాల్ (ప్రొటోకాల్, ప్రజాసంబంధాలు)లను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా, మాజీ ఎంపీ మల్లు రవిని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమించారు. ఈ నలుగురికి కేబినెట్ హోదా కల్పిస్తూ విడివిడిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీఎం రేవంత్ దావోస్ నుంచి రాగానే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తారని కాంగ్రెస్ నేతల్లో చర్చ జరిగింది. అయితే సీఎం విదేశీ
మిగతా 2వ పేజీలో ▶

## ప్రపంచాన్ని ఆకర్షించేలా..



- మూసీ రివర్ ఫ్రంట్‌పై దుబాయ్‌లోని 70 సంస్థలతో సీఎం రేవంత్ సంప్రదింపులు
- 56 కి.మీ. పొడవునా గ్రీన్ అర్బన్ పార్క్‌లు, షాపింగ్ కాంప్లెక్సులు.. నిర్మాణాలకు అనువైన డిజైన్ల పరిశీలన

2లో



## పీజీపై తగ్గుతున్న క్రేజ్

- పోస్టు–గ్రాడ్యుయేషన్ చేసినా పెద్ద ఉద్యోగాలేవి?
- యువతలో పెరుగుతున్న నైరాశ్యం
- పరిశోధన శక్తి తగ్గుతోందని యూజీసీ ఆందోళన.. పరిశ్రమలతో కలిసి పీజీలో మార్పునకు యత్నాలు
- కసరత్తు మొదలు పెట్టిన యూజీసీ
- ఇంకా తగ్గని ఇంజనీరింగ్ మోజు

-వివరాలు 14లో

# బాబు కోసం బలి!

**చంద్రబాబు చివరి అస్త్రంగా షర్మిల: సజ్జల**



- వైఎస్సార్ బతికి ఉంటే కాంగ్రెస్‌పై ఉమ్మేసేవారని విమర్శించి ఆ పార్టీకి మీరే సారథ్యం వహించడం ఏమిటి?
- తెలంగాణలోనే నా బతుకు, చావు అని వ్యాఖ్యానించి హఠాత్తుగా ఏపీకి డిప్యూటేషన్‌పై ఎందుకొచ్చినట్లు?
- చంద్రబాబు ప్రయోజనాలను కాపాడటానికే రాష్ట్రానికి వచ్చారని ప్రజలందరికీ అర్థమవుతోంది
- అడ్డగోలు విభజన, హోదాను చట్టంలో చేర్చకుండా ఏపీకి కాంగ్రెస్ ద్రోహం
- అందుకే నోటాకు 1.28 శాతం ఓట్లు.. కాంగ్రెస్‌కు 1.17 శాతం ఓట్లు
- కనుమరుగైన కాంగ్రెస్‌ను బతికించడమంటే శవానికి జీవం పోయడం లాంటిదేనని వ్యాఖ్య

-వివరాలు 10లో









**ఇదండీ సంగతి**




నోటా ఎవర్సార్! అతన్ని కూడా పార్టీలో చేర్చుకుంటే పోలా!!



## ఎగిరిపోయిన లోహ విహంగాలు

అబ్బురపరిచిన వైమానిక విన్యాసాలు.. ముగిసిన వింగ్స్ ఇండియా-2024 2లో

## రామోజీ.. పేదల భూములు తిరిగివ్వాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశ్‌రావు హెచ్చరిక
- ఫిల్మ్‌సిటీ పేరిట ప్రభుత్వ భూములు, రహదారి కబ్జా..
- పత్రికను అడ్డం పెట్టుకొని అనేక దురాగతాలు
- వైఎస్సార్ హయాంలో భూములు పొందిన పేదలకు న్యాయం జరగాల్సిందే
- ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీకి ఫిర్యాదు చేస్తానని వెల్లడి..

-వివరాలు 3లో

## తెలంగాణ గొంతుకను ఖతం చేసే కుట్ర



**కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని ప్రజలు అర్థం చేసుకోవాలి: కేటీఆర్**

- ఎట్టిపనికైనా, మట్టిపనికైనా తెలంగాణ గొంతుక బీఆర్ఎస్ పార్టీయే: కేటీఆర్
- అసెంబ్లీ ఎన్నికల్లో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- మేం ఇంకో ఏడెనిమిది చోట్ల గెలిచి ఉంటే రాష్ట్రంలో హంగ్ వచ్చేది.. 14 చోట్ల స్వల్ప తేడాతో ఓడిపోయాం.. 'కారు' వెళ్లింది సర్వీసింగ్‌కే.. మళ్లీ రెట్టింపు వేగంతో పరుగెడుతుంది

-వివరాలు 3లో





వింగ్స్ ఇండియా-2024లో వైమానిక విన్యాసాలను తిలకిస్తున్న నగరవాసులు

# ఎగిరిపోయిన లోహ విహంగాలు

**అబ్బురపరిచిన వైమానిక విన్యాసాలు.. ముగిసిన వింగ్స్ ఇండియా-2024**

- ఆఖరి రోజు పోటెత్తిన సందర్శకుల తాకిడి.. చివరి వరకు కొలువుదీరిన విమానాలు
- సారంగ్ టీమ్, మార్క్‌జెఫర్స్ బృందాలకు సిటీజనం సెల్యూట్

**సనత్‌నగర్ (హైదరాబాద్):** బేగంపేట విమానాశ్రయం వేదికగా కనువిందు చేసిన వింగ్స్ ఇండియా- 2024 ముగిసింది. చివరి రోజు సెలవు దినం ఆదివారం కావడంతో సందర్శకులు భారీ సంఖ్యలో ఏవీయేషన్ షో తిలకించేందుకు తరలివచ్చారు. సందర్శకుల తాకిడితో ఎయిర్‌పోర్ట్ సందడిగా మారింది. రన్‌వేపై ప్రదర్శనకు ఉంచిన చిన్నా పెద్దా విమానాలు, హెలికాప్టర్లు, చాపర్లు వీక్షించి మురిసిపోయారు. వినువీధిలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సారంగ్ టీమ్, గ్లోబల్ స్టార్స్‌కు చెందిన మార్క్‌జెఫర్స్ బృందం లోహ విహంగాలతో చేసిన చిత్ర విన్యాసాలతో పులకించిపోయారు. ఏవియేషన్ ఎగ్జిబిషన్‌లో కొలువుదీరిన విశేషాలెన్నో వీక్షించి తరించారు. ఏవియే షన్ రంగానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. నగరం నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచీ సందర్శకులు పోటెత్తా రు. ఏవియేషన్ షోలో అడుగడుగునా తిరిగి అద్భుతాలను ఆస్వాదించారు. నింగిలో 'హృదయ'పూర్వకంగా రంగు రంగుల ముగ్గులను వే స్తూ కనురెప్పలను వాల్చనీయకుండా చేసిన ఏరో బొటిక్స్ అంతులేని అనుభూతులను మిగిల్చాయంటూ తమ మనోభావాలను వెల్లడించారు.

**చివరి రోజు వరకు ఉన్న విమానాలు...**
బిజినెస్ డేస్‌గా చెప్పే మొదటి రెండు రోజుల పాటు కనువిందు చేసిన అనంతరం సాధారణంగా 'షో' నుంచి చాలావరకు నిష్క్రమిస్తాయి. కానీ ఈ సారి ఆఖరి రోజు వరకు రెండు, మూడు చిన్న విమానాలు తప్ప మిగతావన్నీ రన్‌వే పై కొలువుదీరి ఉండి సందర్శకులను కనువిందు చేశాయి. షోకు హైలెట్‌గా నిలిచిన బోయింగ్ 777ఎక్స్, ఎ యిర్‌బస్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో కార్గో విమానాలు చివరి క్షణం వరకు ఉండి ఆనందాన్ని రెట్టింపు చేశాయి. ఆదివారం షో ముగియడంతో బై..బై అంటూ గాలిలో ఎగిరిపోయాయి.

**సారంగ్, మార్క్‌జెఫర్స్ బృందాలకు సెల్యూట్**
నాలుగు రోజుల పాటు గ'ఘన'విన్యాసాలతో సందర్శకులకు వినోదంతో పాటు మధురానుభూతులను పంచిన సారంగ్ టీమ్, మార్క్‌జెఫర్స్ బృందానికి భాగ్యనగరం సెల్యూట్ చేసింది. నింగిలో 'హృదయా'ంతరాలు మురిపించేలా ఏరోబొటిక్స్ చేసిన బృంద సభ్యులతో సందర్శకులు ఫొటోలు దిగారు. వారి ఆటోగ్రాఫ్‌ల కోసం పోటీపడ్డారు. హైదరాబాద్ సందర్శకులు తమపై చూపించిన ఆప్యాయతకు ఆ బృందాలు కూడా ఆనందాన్ని వ్యక్తపరిచాయి. ఈ సారి కి బై బై అంటూ..మళ్లీ రెండేళ్ళకు కలుసుకుందాం అంటూ హైదరాబాదీయులకు వీడ్కోలు పలికిన ఏరోబొటిక్స్ బృందాలు ఏవియేషన్ షో నుంచి వెనుదిరిగాయి.

## క్లుప్తంగా...

### ఫిబ్రవరి 5, 6 తేదీల్లో పార్లమెంట్ ముట్టడి: కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5, 6 తేదీల్లో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆదివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. కర్ణాటక, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, రాజస్తాన్, తమిళనాడు, మహారాష్ట్ర, అసోం, ఒడిశా తదితర రాష్ట్రాల్లో పర్యటించి బీసీ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈనెల 25న హైదరాబాద్‌లో బీసీ ఉద్యోగుల సమావేశం, 28న మహబూబ్‌నగర్‌లో బీసీ టీచర్ల సమావేశం, 29న కడపలో బీసీ ఉద్యోగుల బహిరంగ సభ జరుగుతుందని కృష్ణయ్య వెల్లడించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు సుందరయ్య, నీల వెంకటేశ్, పి.సుధాకర్, టి.రాజ్‌కుమార్, నందగోపాల్, జి.కృష్ణ యాదవ్, మోడీ రాందేవ్, అనంతయ్య, ఉదయ్ నేత, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

### నిర్బంధకాండను అడ్డుకునేందుకే దాడి

**ధర్మారం ఘటనపై మావోయిస్టు పార్టీ నేత సమత లేఖ**

చర్ల: బీజేపీ ప్రభుత్వ నిర్బంధకాండకు (ఆపరేషన్ కగార్) అడ్డుకట్ట వేసేందుకే ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ధర్మారం పోలీసు క్యాంపుపై దాడి చేశామని మావోయిస్టు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో నేత సమత పేర్కొన్నారు. ఈ ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి, రాష్ట్ర హోంమంత్రి విజయశర్మదే పూర్తి బాధ్యతని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె లేఖ విడుదల చేశారు. చదువుకుని, ఇతర ఉద్యోగాలు లేక సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ వంటి ప్రజావ్యతిరేక పోలీసు విభాగాల్లో చేరుతున్న యువత ఇలాంటి ఘటనల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, యువత ఇటువంటి ప్రజా వ్యతిరేక పోలీసు దళాల్లో చేరకుండా ఇతర ఉద్యోగాల కోసం ప్రభుత్వంపై పోరాడాలని కోరారు. ధర్మారం ఘటనపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయకుండా తేలుకుట్టిన దొంగలా మిన్నకుండిపోయిందని ఆరోపించారు. ఫాసిస్టు బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ వనరులు, సంపద, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ అదే అభివృద్ధి అంటూ అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు.

### బీసీలను విస్మరిస్తే కాంగ్రెస్‌కే నష్టం: జాజుల



కల్వకుర్తి రూరల్: బీసీలను విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీకే నష్టం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా విస్మరించడం వల్లే బీసీలంతా ఏకమై కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఓట్లు వేశారని చెప్పారు. ఈ సత్యాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రహిస్తే మంచిదన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీని ఇటీవల ఢిల్లీలో కలిసిన సందర్భంగా.. సామాజిక న్యాయం అనే నినాదంతో తాము ముందుకెళ్తామని చెప్పారని గుర్తుచేశారు. శాసనసభ ఎన్నికల ప్రచారంలో దొరల పాలనను దించి ప్రజాపాలన తీసుకొస్తామని చేసిన ప్రచారాన్ని మరచిపోవద్దని జాజుల హితవు పలికారు. మంత్రివర్గంలో ఇద్దరికి మాత్రమే అవకాశం కల్పించారని, ఇతర నియామకాల్లో, కీలక శాఖల అధికారులు పోస్టింగ్‌లో బీసీలకు ప్రాధాన్యం లేకుండా పోయిందన్నారు. కేబినెట్ హోదాతో నియమించిన ప్రభుత్వ సలహాదారుల్లో ఒక్కరు కూడా బీసీలు లేకపోవడం ఏంటని జాజుల ప్రశ్నించారు. త్వరలో చేపట్టే మంత్రివర్గ విస్తరణలో, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని, లేకపోతే బీసీలను ఏకం చేసి సామాజిక న్యాయ పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నాగేశ్‌గౌడ్, రాజేందర్, మహేశ్, దుర్గాప్రసాద్, రమేశ్‌చారి, నర్సింహ, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచాన్ని ఆకర్షించేలా 'మూసీ'

**మూసీ రివర్ ఫ్రంట్‌పై దుబాయ్‌లోని 70 సంస్థలతో సీఎం రేవంత్ సంప్రదింపులు**

- 56 కిలోమీటర్ల పొడవునా గ్రీన్ అర్బన్ పార్కులు, షాపింగ్ కాంప్లెక్సులు
- నిర్మాణాలకూ డిజైన్ల పరిశీలన.. అభివృద్ధి నమూనాలు కూడా
- ప్రపంచస్థాయి సిటీ ప్లానర్లు, డిజైనర్లు, డెవలపర్లు, ఆర్కిటెక్ట్‌లతో రాత్రి వరకు భేటీలు
- నేడు హైదరాబాద్‌కు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి


ఆదివారం దుబాయ్‌లో మూసీ రివర్ ఫ్రంట్ డిజైన్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్

**సాక్షి, హైదరాబాద్:** మూసీ నదీ తీర అభివృద్ధి ప్రణాళికలే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుబాయ్‌లో ఆదివారమంతా బిజీబిజీగా గడిపారు. మూసీ రివర్ ఫ్రంట్ డిజైన్లు, అభివృద్ధిపై ప్రపంచ స్థాయి సిటీ ప్లానర్లు, డిజైనర్లు, మెగా మాస్టర్‌ప్లాన్ డెవలపర్లు, ఆర్కిటెక్ట్‌లతో వరుసగా భేటీలు నిర్వహించారు. 56 కిలోమీటర్ల పొడవునా రివర్ ఫ్రంట్, గ్రీన్ అర్బన్ పార్కులు, షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణానికి సంబంధించిన డిజైన్లు, అభివృద్ధి నమూనాలను పరిశీలించడంతో పాటు వాటికి అవసరమైన పెట్టుబడుల గురించి దాదాపు 70 సంస్థలతో ఆయన సంప్రదింపులు జరిపారు. దుబాయ్ వేదికగా ప్రపంచంలో పేరొందిన కంపెనీలు, ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు, కన్సల్టెన్సీ నిపుణులతో సీఎం భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో భాగంగా దాదాపు అన్ని సంస్థలూ.. రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యానికి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును చేపట్టేందుకు ముందుకొచ్చాయనీ, సంప్రదింపుల కోసం త్వరలోనే రాష్ట్రానికి వచ్చేందుకు అంగీకరించాయని సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

**దుబాయ్‌లో సండే వర్కింగ్ డే**
ఆదివారం సెలవుదినాన్ని సీఎం రేవంత్ అండ్ టీం దుబాయ్‌లో వర్కింగ్ డే తరహాలో గడిపింది. ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం అర్ధరాత్రి వరకు వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. ఈ సమావేశాల్లో భాగంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ 'చరిత్రాత్మక నగరాలన్నీ నీటి వనరుల చుట్టే అభివృద్ధి చెందాయి. నదులు, సరస్సులు వాటికి సహజత్వాన్ని తెచ్చిపెట్టాయి. మూసీ పునరుద్ధరణతో హైదరాబాద్ సిటీ ప్రపంచంలోనే అద్భుతమైన నగరంగా మారుతుంది'అని అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు, నగరాలతో తాము పోటీ పడటం లేదని ప్రపంచంలోనే అత్యుత్తమమైన బెంచ్‌మార్క్ నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పిన రేవంత్ అందుకు అనుగుణంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మూసీ రివర్ ప్రాజెక్టుకు అపురూపమైన డిజైన్లు, నమూనాలు రూపొందించాలని కోరారు. సీఎంతో పాటు ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ అమ్రపాలితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

**వారం రోజుల తర్వాత రాష్ట్రానికి**
ఈనెల 15న ప్రారంభమైన సీఎం రేవంత్ దావోస్, లండన్, దుబాయ్ టూర్ ముగిసింది. ఈ మూడు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన బృందం సోమవారం ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుందని సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. దావోస్ పర్యటనలో భాగంగా ఈనెల 15 నుంచి జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) 54వ వార్షిక సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడితో సహా పలు దేశాల పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. తెలంగాణలో పెట్టుబడులకు అనువైన పరిస్థితులను వ్యాపార వర్గాలకు వివరించడం ద్వారా రూ.40వేల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన హామీలను రాబట్టగలిగారు. ఆ తర్వాత లండన్ వెళ్లిన సీఎం అక్కడ ఇండియా డయాస్పోరా అసోసియేషన్స్ సమావేశంలో పాల్గొని ప్రవాస తెలంగాణీయులనుద్దేశించి మాట్లాడారు. లండన్‌లోని ప్రముఖ ప్రాంతాలను అధికారుల బృందంతో కలిసి సందర్శించిన రేవంత్ థేమ్స్ నది స్ఫూర్తితో మూసీని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అక్కడి నుంచి దుబాయ్ చేరుకున్న రేవంత్ టీం మూసీ రివర్‌ఫ్రంట్‌పై ప్రత్యేక దృష్టితో రోజంతా సంప్రదింపులు జరిపారు. అనంతరం తన బృందంతో కలిసి హైదరాబాద్ బయలుదేరారు.

### దుబాయ్ వాటర్ ఫ్రంట్‌ను సందర్శించిన సీఎం

దుబాయ్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అధికారుల బృందంతో కలిసి దుబాయ్ వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టును సందర్శించారు. ఆదివారం మధ్యాహ్నం ఒక ఆకాశ హర్మ్యం మీదికి వెళ్లి ఏరియల్ వ్యూలో కనిపించే వాటర్ ఫ్రంట్ అందాలను తిలకించారు. చుట్టూ నీళ్లు.. పక్కనే ఆకాశాన్ని అంటుతున్నట్లు కనిపించే అందమైన భవంతులు, నీళ్ల చుట్టూ అందమైన రహదారులతో ఒకదానికొకటి అనుబంధంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు దుబాయ్‌లో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రాజెక్టు నిర్వహణ వ్యవహారాలు, దాంతో ముడిపడి ఉన్న సామాజిక ఆర్థిక ప్రభావాలను సీఎం అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత సమయం పట్టింది ? ఎంత ఖర్చయింది ? ఏమేం సవాళ్లు ఎదురయ్యాయి..? నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు.

# రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

**అందుకు అనువైన రాష్ట్రం తెలంగాణ**

- ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తాం
- జెడ్డాలో వివిధ సంస్థల ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు
- సౌదీ అరేబియా ప్రభుత్వ వర్గాలతోనూ సమావేశం



**సాక్షి, హైదరాబాద్:** పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అత్యంత అనుకూలమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పలు బహుళజాతి కంపెనీలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. పెట్టుబడుల సాధనలో భాగంగా సౌదీ అరేబియాలో పర్యటిస్తున్న ఆయన ఆదివారం జెడ్డాలోని పలు సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాల్లో పాల్గొన్నారు. సౌదీ యువరాజు ప్రత్యేక కార్యాలయ జనరల్ డైరెక్టర్ మహమ్మద్ బిన్ అబ్దుల్లా అల్ రాయెస్‌తో జరిగిన భేటీలో శ్రీధర్ బాబు తెలంగాణ విధానాలు, ఐటీ పరిశ్రమకు ప్రభుత్వ సహకారం తదితర అంశాలను వివరించారు. సౌదీ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రసాయనాలు, ఇంధన రంగాలకు సంబంధించి అంతర్జాతీయంగా దిగ్గజ సంస్థగా పేరుపొందిన ఆరాంకో సంస్థ ప్రతినిధులను కలిసి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశాలపై చర్చించారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా మద్దతిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అల్ షరీఫ్ గ్రూప్ హోల్డింగ్స్ సంస్థ సీఈవో అల్ షరీఫ్ నవాబ్ బిన్ ఫైజ్ బిన్ అబ్దుల్ హకీమ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రాజెక్ట్స్ ఇంజనీర్ సులైమన్ కేతో మంత్రి శ్రీధర్‌బాబు సమావేశమై పెట్టుబడులపై చర్చించారు. ఈ సంస్థ విద్యుత్, ఆతిథ్య, రియల్ ఎస్టేట్, టెక్నాలజీ, ఆవిష్కరణ రంగంలో అగ్రగామిగా ఉంది.

**సెడ్కో కేపిటల్స్ ప్రతినిధులతో సహా పలువురితో భేటీ**
ప్రముఖ ఇన్వెస్ట్ మెంట్ కంపెనీ సెడ్కో కేపిటల్స్ ప్రతినిధులతో, జెడ్డా చాంబర్స్‌తో, ఆహార ఉత్పత్తుల దిగ్గజ సంస్థ అయిన సవోలా గ్రూప్ సీఈవో వలీద్ ఫతానాతో, సౌదీ బ్రదర్స్ కమర్షియల్ కంపెనీ సీఈవో, బోర్డ్ సభ్యులతో పెట్రోమిన్ కార్పొరేషన్ ప్రతినిధులతో, బెటర్జీ హోల్డింగ్ కంపెనీ చైర్మన్ మాజెన్ బెటర్జీతోనూ మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో అనువైన పరిస్థితులను వివరించారు. పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు కల్పించే రాయితీలు, ప్రోత్సాహకాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో నిరంతర విద్యుత్ సరఫరా, పుష్కలమైన నీటి లభ్యత, నాణ్యమైన మానవ వనరులు, మంచి మౌలిక సదుపాయాలు, మెరుగైన కనెక్టివిటీ ఉన్నాయని మంత్రి వారికి వివరించారు. కాగా, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి కనబర్చినట్టు మంత్రి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. పర్యటనలో మంత్రి శ్రీధర్ బాబు వెంట రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

# జేఈఈ మెయిన్స్‌కు సర్వం సిద్ధం

**ఈ నెల 24 నుంచి పరీక్ష**

- దేశవ్యాప్తంగా 12 లక్షల విద్యార్థులు హాజరు!
- తెలంగాణలో 11 పరీక్ష కేంద్రాలు.. ఈసారి ఫేషియల్ రికగ్నిషన్ అమలు
- ఆర్కిటెక్చర్‌కు అడ్మిట్ కార్డుల జారీ.. 25 నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులకు..

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్-1 పరీక్ష ఈ నెల 24 నుంచి ప్రారంభంకానుంది. ఫిబ్రవరి 1వ తేదీ వరకూ ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. జేఈఈ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసినట్టు ప్రకటించింది. మొదటి మూడు రోజులు ఆర్కిటెక్చర్ (పేపర్-1) ఉంటుంది. ఈ పరీక్ష రాసే విద్యార్థులకు అడ్మిట్ కార్డులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఉంచినట్టు ఎన్‌టీఏ తెలిపింది. జేఈఈ ఇంజనీరింగ్ విభాగానికి ఈ నెల 27 నుంచి పరీక్ష ఉంటుంది. ఈ విద్యార్థుల అడ్మిట్ కార్డులు 25 లోగా ఆన్‌లైన్‌లో ఉంచే అవకాశముంది. రెండు విభాగాలకు కలిపి దేశవ్యాప్తంగా ఈ ఏడాది 12 లక్షల మందికిపైగా విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి 2.4 లక్షల మంది పరీక్ష రాస్తారని సమాచారం. జేఈఈ మెయిన్స్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని, భద్రత కల్పిస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. మొదటి షిఫ్టు ఉదయం 9 నుంచి, రెండో షిఫ్టు మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉంటుంది. ప్రతీ సెషన్ మూడు గంటల వ్యవధితో ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించబోమని ఎన్‌టీఏ ప్రకటించింది. ఈసారి భద్రత వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నారు.

**11 కేంద్రాల్లో మెయిన్స్**
తెలంగాణలో 11 కేంద్రాల్లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎన్‌టీఏ తెలిపింది. హైదరాబా ద్, సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబా ద్, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్‌తోపాటు ఏపీలోని 30 కేంద్రాల్లో పరీక్షలు ఉన్నట్టు అధికారులు వివరించారు. పరీక్షలు తెలుగు, ఇంగ్లిష్ సహా మొత్తం 10 భాషల్లో నిర్వహిస్తారు. రెండో దశ పరీక్షలు ఏప్రిల్‌లో చేపడతారు. ఈసారి పరీక్ష కోసం సిలబస్ తగ్గించారు. కోవిడ్ సమయంలో కేంద్ర విద్యా సంస్థల్లో టెన్త్ రాసినవారు ప్రస్తుతం జేఈఈ మెయిన్స్ కు హాజరవుతున్నారు. ఆ సమయంలో వీళ్లకు సిలబస్ కుదించారు. ఆ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని 25% సిలబస్‌ను మెయిన్స్ నుంచి తొలగించారు. గణితంలో సుదీర్ఘ ప్రశ్నలను తొలగించారు. ఈ కారణంగా మెయిన్స్ రాసే వారి సంఖ్య పెరుగుతోంది.



### నెగెటివ్ మార్కులతో జాగ్రత్త

జేఈఈ మెయిన్స్‌లో నెగెటివ్ మార్కుల పట్ల జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. సమాధానం కచ్చితంగా రాస్తే 4 మార్కులు ఉంటాయి. తప్పుగా టిక్ పెడితే మైనస్-1 అవుతుంది. కాబట్టి తెలియని ప్రశ్నలకు ఊహించి రాసేకన్నా, వదిలేయడమే మంచిదని గణిత శాస్త్ర నిపుణులు ఎంఎన్ రావు తెలిపారు. కన్ఫ్యూజ్ చేసే ప్రశ్నల కోసం ముందే సమయం వృథా చేయకూడదని, వాటి గురించి ఆఖరులో ఆలోచించాలని ఆయన సూచించారు. అనవసర ప్రశ్నలకు తలబాదుకుంటూ కూర్చుంటే ఆ ప్రభావం తెలిసిన ప్రశ్నలపై పడే అవకాశం ఉంటుందని భౌతిక శాస్త్ర నిపుణుడు విక్రమ్ సింగ్ చెప్పారు. ముందుగానే జేఈఈ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుని, అవసరమైన పత్రాలన్నీ (సెల్ఫ్ డిక్లరేషన్, అండర్ టేకింగ్ ఫాం) దగ్గర ఉంచుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. వాటర్ బాటిల్స్, హ్యాండ్ శానిటైజర్లు, మాస్కులు, బాల్ పాయింట్ పెన్నులను అనుమతిస్తామని తెలిపింది.

# మహిళాభ్యున్నతికి కేంద్రం విప్లవాత్మక చర్యలు

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించిన మంత్రి


భవనం ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**అంబర్‌పేట్ (హైదరాబాద్):** యువత వృత్తి నైపుణ్యాలు పెంచుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలోని అన్ని రంగాల్లో యువకులతో పాటు యువతులకు కూడా సమాన అవకాశాలు ఉన్నాయని, వాటిని అంది పుచ్చుకోవాలని ఆయన కోరారు. శివంరోడ్‌లో ఉన్న అడ్వాన్స్‌డ్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఏటీఐ) ప్రాంగణంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళల కోసం వృత్తి నైపుణ్య శిక్షణ భవనాన్ని నిర్మించారు. ఆదివారం ఈ భవనాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. నైపుణ్య మంత్రిత్వశాఖ డైరెక్టర్ జనరల్ త్రిశల్‌జిత్ సేథీ, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, సామాజిక కార్యకర్త డాక్టర్ సునీత కృష్ణన్, విరించి ఆసుపత్రి అధిపతి కె.మాధవిలతతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో మహిళల అభ్యున్నతి, సంక్షేమం, సాధికారత కోసం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఏటీఐలో కొత్తగా నిర్మించిన నేషనల్ స్కిల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ మహిళలు స్వశక్తితో ఎదగడానికి దోహదపడుతుందని అన్నారు.

# నామినేటెడ్ పోస్టుల భర్తీ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

పర్యటన ముగించుకొని వస్తున్న ముందు రోజే ఈ ఉత్తర్వులు వెలువడడం గమనార్హం.

**త్వరలోనే మాకు కూడా...!**
మిగిలిన నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే ఉంటుదన్న ఉత్సాహం కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోంది. సీఎం దావోస్ నుంచి వచ్చిన తర్వాత ఒకట్రెండు రోజుల్లోనే పలు కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను ప్రకటిస్తారని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో కీలకంగా ఉండే ముఖ్యమైన కార్పొరేషన్లతో పాటు మొత్తం 9 లేదా 18 కార్పొరేషన్ పదవులను ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'రాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చాం. చాలాకాలంగా అధికారిక పదవుల కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వ సలహాదారుల నియామకంతో మాకు కూడా పదవులు వస్తాయనే ఆశ చిగురించింది. నామినేటెడ్ జాబితా ఎప్పుడొస్తుందా అని వేయికళ్లతో ఎదురు చూస్తున్నాం.'అని కార్పొరేషన్ పదవుల ఆశావహుల లిస్టులో ముందువరుసలో ఉన్న ఓ మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం గమనార్హం. రాష్ట్రస్థాయి పదవులతో పాటు నియోజకవర్గాల్లో ఎక్కువగా ప్రభావం ఉండే మార్కెట్ కమిటీల పదవులపై కూడా కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో కసరత్తు ప్రారంభించింది. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతకు జిల్లాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నియమించిన మార్కెట్ కమిటీలను రద్దు చేస్తానని, కొత్త పాలకవర్గాల నియామకంపై ఎమ్మెల్యేలు, మంత్రులు కసరత్తు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలోని కీలక పదవులైన మార్కెట్ కమిటీ నియామకాలు కూడా త్వరలోనే జరుగుతాయనే చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో జరుగుతోంది.

**పలువురి అభినందనలు**
రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, హర్కర వేణుగోపాల్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన మల్లురవిలకు పలువురు అభినందనలు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచే వారి నివాసాలకు కాంగ్రెస్ నేతలు క్యూ కట్టారు. పలువురు మంత్రులు వేర్వేరు ప్రకటనల్లో వీరికి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ అధిష్టానం, రేవంత్‌రెడ్డిలకు వేం, షబ్బీర్, హర్కర, మల్లురవిలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ప్రజలకు మేలు కలిగేలా ప్రయత్నిస్తామని వారు వెల్లడించారు.

### నలుగురూ ఆప్తులే..

రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినప్పటి నుంచీ ఈ నలుగురు నేతలూ ఆయనకు అండగా ఉంటూ వచ్చారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ రేవంత్‌కు పార్టీ వ్యవహారాల్లో మొదటి నుంచి ముఖ్య సలహాదారుడిగా ఉంటున్నారు. ఆయనకు రేవంత్ కేబినెట్‌లో కచ్చితంగా మంత్రి పదవి వస్తుందని భావించినా, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం, ఎమ్మెల్సీ కోటాలో సమీకరణలు కుదరలేదు. దీంతో షబ్బీర్‌అలీకి కేబినెట్ హోదా కల్పించి పలు సంక్షేమ శాఖల సలహాదారుడిగా నియమించారు. వేంనరేందర్‌రెడ్డి చాలా కాలంగా రేవంత్ ప్రధాన అనుచరుడిగా వ్యవహరిస్తూ ఆయనతో పాటే రాజకీయ ప్రయాణం సాగిస్తున్నారు. రేవంత్ ఆత్మగా చెప్పుకునే వేం నరేందర్‌రెడ్డికి తొలి పదవి వస్తుందని కాంగ్రెస్ నేతల్లో చర్చ జరిగింది. ఆవిధంగానే తన సలహాదారుడిగా సీఎం రేవంత్ నియమించుకున్నారు. ప్రొటోకాల్ చైర్మన్ హోదాలో ఉన్న హర్కర వేణుగోపాల్ కూడా రేవంత్ టీంలో కీలక సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. జాతీయ నేతలతో సమన్వయం, మీడియాతో సాన్నిహిత్యం ఉన్న కారణంగా ఆయనకు ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్స్ సలహాదారుడిగా నియమించి కేబినెట్ హోదా కల్పించారు.

**అనుభవం, అవసరాలే ప్రాతిపదికగా**
ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు రవి 2004- 08 మధ్య కాలంలో పనిచేశారు. ఇప్పుడు మళ్లీ ఆయన్ను అదే పదవిలో నియమించడం గమనార్హం. పార్టీలో రేవంత్‌కు రక్షణ గోడగా నిలబడ్డ మల్లు రవికి ఉన్న అనుభవంతో గత పదేళ్లుగా ఢిల్లీలో పేరుకుపోయిన రాష్ట్ర సమస్యలను ఓ కొలిక్కి తెచ్చే బాధ్యత పెట్టారు. దీనికి తోడు లోక్‌సభ ఎన్నికల్లో మల్లు రవి ఈసారి నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆయన ఎంపీగా పోటీ చేసి గెలిస్తే ప్రభుత్వ ప్రతినిధి హోదాలో రాష్ట్ర సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలరనే ఉద్దేశంతోనే అటు అధిష్టానం, ఇటు సీఎం రేవంత్‌లు ఆయనకు ఢిల్లీ స్థాయి పోస్టు కట్టబెట్టారనే చర్చ కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

# కొత్తగా మరిన్ని బీసీ గురుకులాలు

- మండలానికో పాఠశాల హామీలో భాగంగా సర్కారు కసరత్తు
- మంత్రి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టిన బీసీ గురుకుల సొసైటీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మరిన్ని బీసీ గురుకులాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగా ప్రతి మండలానికో బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కసరత్తు వేగవంతం చేసింది. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖను, 'మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్)'కార్యదర్శిని ఆదేశించారు. ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో.. పరిశీలన జరిపేందుకు ప్రతిపాదనలను సూచించారు.

**గురుకులాల కోసం డిమాండ్:** ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 292 బీసీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున ఉండగా, డిమాండ్ మేరకు పలుచోట్ల అదనంగా ఏర్పాటు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో ఇంకా పెద్ద సంఖ్యలో బీసీ గురుకులాల కోసం డిమాండ్ ఉంది. ఏటా అడ్మిషన్ల సమయంలో వేల మంది బీసీ గురుకుల సొసైటీ కార్యాలయం వద్ద పడిగాపులు పడటం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో మండలానికో బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

**ప్రాధాన్యత క్రమంలో..:** కొత్తగా బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కార్యాచరణ ప్రణాళిక చేపట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీ గురుకుల పాఠశాలలెన్ని? ఎక్కడెక్కడ ఉన్నాయి? మండలాల వారీగా విభజిస్తే ఏయే ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేయాలి? తదితర అంశాలను తేల్చి.. ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని బీసీ గురుకుల సొసైటీని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

క్లుప్తంగా...

## రేవంత్ మాట్లాడిన దాంట్లో తప్పేముంది?

- ప్రాంతం వాడు ద్రోహం చేస్తే ఏం చేయాలో కాళోజీనే చెప్పారు
- దావోస్ పెట్టుబడులను బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు
- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌ను పాతిపెడతామని సీఎం రేవంత్‌రెడ్డి లండన్‌లో మాట్లాడిన మాటల్లో తప్పేముందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రాంతం వాడు ద్రోహం చేస్తే ఏం చేయాలో కాళోజీ నారాయణరావు ఎప్పుడో చెప్పారని, ఆ మాటలు బీఆర్ఎస్ నేతలకూ వర్తిస్తాయని, ఆ మాటలనే సీఎం రేవంత్ మాట్లాడారని ఆయన వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ దావోస్ పర్యటనలో రూ.40వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడాన్ని జీర్ణించుకోలేకనే బీఆర్ఎస్ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారని జీవన్‌రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీలో మీడియా పాయింట్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ...కమీషన్లకు కక్కుర్తిపడి పదేళ్లలో రాష్ట్రాన్ని మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. బీఆర్ఎస్ ధనదాహానికి కాళేశ్వరం ప్రాజెక్టే ప్రత్యక్ష ఉదాహరణ అని, ఆ ప్రాజెక్టు కుంగుబాటుకు కేసీఆర్ నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 40 రోజులు కూడా కాలేదని, అప్పుడే కరెంటు బిల్లులు కట్టొద్దని చెప్పే హక్కు కేటీ రామారావుకు ఎక్కడిదని ప్రశ్నించారు. తాము ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్‌ను ఆ దేవుడు కూడా రక్షించలేడు

- ఏ పార్టీలో చేరేది త్వరలో నిర్ణయించుకుంటా: పీఎల్ శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ నేతలు ఆత్మపరిశీలనకు ముందుకు రావడం లేదని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పీఎల్ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఓటమిపై పరిశీలన చేసుకోకపోగా తమను ఓడించడం రాష్ట్ర ప్రజలు చేసిన తప్పు అన్నట్లుగా మాట్లాడుతున్నారని, ఆ పార్టీని దేవుడు కూడా రక్షించలేడని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాను రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కొందరు పార్టీ నేతలు చేసిన అక్రమాలతోనే ఓడిపోయాం. ఈ ఓటమికి కేసీఆర్ ఒక్కడే బాధ్యుడు కాదు. పార్టీ పేరు మార్చిన రోజే తెలంగాణతో పార్టీకి ఉన్న పేగుబంధం తెగిపోయింది. రాష్ట్ర సాధన ఉద్యమస్ఫూర్తిని తుంగలో తొక్కారు. అర్హత లేని వారికి పదవులిచ్చారు. కేసీఆర్ ఆలోచనా స్థాయిని కింది నేతలు అర్థం చేసుకోలేదు. పార్టీని ప్రజలకు దూరం చేశారు. కేసీఆర్ నమ్మిన వ్యక్తులే చివరకు పార్టీకి ద్రోహం చేశారు' అని పేర్కొన్నారు. తాను ఏ పార్టీలో చేరేదీ శ్రేయోభిలాషులతో చర్చించి త్వరలోనే వెల్లడిస్తానని శ్రీనివాస్ చెప్పారు.

## రేవంత్ చెప్పేదొకటి, చేసేదొకటి..

- మీడియాతో బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యవహారశైలి చెప్పేదొకటి, చేసేదొకటి అన్నట్లు ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలోని ప్రభుత్వ సలహాదారులపై తీవ్ర విమర్శలు చేస్తూ కాంగ్రెస్ వస్తే సలహాదారుల వ్యవస్థ ఉండదని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాట తప్పి సలహాదారులను నియమించారని ధ్వజమెత్తారు. రాష్ట్ర అవసరాల కోసం, పాలనలో పనితీరు మెరుగుపర్చుకోవడం కోసం రిటైర్డ్ అధికారులను అప్పటి సీఎం కేసీఆర్ సలహాదారులుగా నియమించుకున్నారని, కానీ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఫక్తు రాజకీయ నాయకులకే ఆ అవకాశం ఇచ్చారని అన్నారు. ఓటుకు నోటు కేసులో సహకరించినవారికి పదవులు కట్టబెట్టారని విమర్శించారు. ప్రజాపాలనంటూ చెప్పి 50 రోజులపాటు ఢిల్లీ, విదేశీ పర్యటనలకే రేవంత్ పరిమితమయ్యారని పేర్కొన్నారు. తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే కాంగ్రెస్ పార్టీని ప్రజలు వెయ్యి మీటర్ల లోతులో బొందపెడతారని హెచ్చరించారు.

## నేటి టీపీసీసీ సమావేశాలు వాయిదా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోమవారం నుంచి నిర్వహించాలనుకున్న టీపీసీసీ సమావేశాలు వాయిదా పడ్డాయి. ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) భేటీతో పాటు టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ భేటీలను వాయిదా వేస్తున్నట్లు గాంధీభవన్ వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. ఈ నెల 23న మేనిఫెస్టో కమిటీ సమావేశం జరగనుండగా, పీఈసీ భేటీ ఎప్పుడన్నది త్వరలో తెలియజేస్తామని అందులో పేర్కొన్నాయి.

# పేదల భూములు తిరిగివ్వాల్సిందే

## రామోజీకి మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు హెచ్చరిక

- ఫిల్మ్‌సిటీ పేరిట ప్రభుత్వ భూములు, రహదారి కబ్జా
- పత్రికను అడ్డం పెట్టుకొని అనేక దురాగతాలు
- వైఎస్సార్ హయాంలో భూములు పొందిన పేదలకు న్యాయం జరగాల్సిందే
- ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీకి ఫిర్యాదు చేస్తానని వెల్లడి
- మార్చి 31 నాటికి స్పందించకుంటే ఫిల్మ్‌సిటీ గేట్లు బద్దలుకొడతామని వ్యాఖ్య



సమావేశంలో మాట్లాడుతున్న గోనె ప్రకాశ్‌రావు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ఫిల్మ్‌సిటీ పేరుతో ఈనాడు అధినేత రామోజీరావు ఎన్నో దురాగతాలకు పాల్పడ్డారని.. నాలుగు గ్రామాల ప్రజలకు తీరని ద్రోహం చేశారని మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు మండిపడ్డారు. పేదలకు చెందిన 14.3 ఎకరాల భూమిని 15 ఏళ్లుగా రామోజీ ఫిల్మ్‌సిటీ అధీనంలో ఉంచుకొని.. 606 పేద కుటుంబాలకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. తన పత్రికను అడ్డం పెట్టుకొని అనేక దురాగతాలకు పాల్పడ్డారని విమర్శించారు. రామోజీ వల్ల నష్టపోయిన బాధితుల కోసం ఎంత వరకైనా పోరాటం చేస్తానని ప్రకటించారు. ఇప్పటికైనా కళ్లు తెరవకుంటే రామోజీకి నరకం తప్పదని వ్యాఖ్యానించారు. మార్చి 31వ తేదీలోపు పేదలకు న్యాయం జరగకపోతే రామోజీ ఫిల్మ్‌సిటీ గేట్లు బద్దలుకొడతామని హెచ్చరించారు. ఈ మేరకు రామోజీరావుకు బహిరంగ లేఖ రాశారు. ఈ వివరాలు గోనె ప్రకాశరావు మాటల్లోనే..

''బలహీనవర్గాలకు చెందాల్సిన 14 ఎకరాల 30గుంటల భూమి గత 15 ఏళ్లుగా రామోజీరావు అధీనంలో ఉంది. ఆ భూమి ప్రభుత్వానిదని ఎప్పుడో తేల్చారు. నాగన్‌పల్లి గ్రామం రెవెన్యూ విలేజీలో సర్వే నంబర్లు 189, 203లలో ఉన్న ఈ భూమిలో వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు 606 పేద కుటుంబాలకు 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. కానీ రామోజీ తన పలుకుబడితో ఆ భూమి పేదలకు చెందకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై చాలాసార్లు లబ్ధిదారులు, వివిధ రాజకీయపార్టీలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేదు.

### నీతులు చెప్పడం కాదు.. పాటించాలి..

ప్రపంచంలోని ప్రతి సమస్యను, ప్రభుత్వాల తప్పిదాలు అంటూ ఎత్తిచూపి, నీతులు వల్లించే రామోజీ.. పేదలకు భూమి అందకుండా అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం? నీతులు, ఆదర్శాలు ఇతరులకు చెప్పడం మాత్రమేకాదు వీటిని పాటించాలి. తన నిత్య జీవితంలో, తాను నడుపుతున్న వ్యాపార సంస్థల్లో ఆ విలువలను పాటించాలి. లేకుంటే ప్రజలెవరూ మిమ్మల్ని క్షమించరు. భూకబ్జాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ.. వ్యక్తులపై, సంస్థలపై మీ మీడియా సంస్థ ద్వారా పుంఖానుపుంఖాలుగా వార్తలు ప్రచురిస్తుంటారు. మీ ఆధీనంలో ఉన్న టీవీ చానళ్లలో ప్రసారం చేస్తుంటారు. అదే రామోజీ తన వ్యాపార సంస్థల కోసం ఎన్నో అనైతిక పనులకు పాల్పడుతున్నారు. ఆక్రమించిన రహదారిని ఖాళీ చేయాలి..

అనాజ్‌పూర్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు (13 కిలోమీటర్లు) ప్రజా రహదారి వందల ఏళ్ల నుంచి ఉంది. రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లే మార్గంలోని ఈ రహదారిని ఆక్రమించారు. దీనివల్ల 16 గ్రామాల్లోని 90వేల మంది ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ప్రభుత్వ రహదారిని ఆక్రమించిన రామోజీపై క్రిమినల్, సివిల్ కేసులు పెట్టాలి. కానీ మీ పలుకుబడితో అధికారులు, ప్రభుత్వ నేతలు పట్టించుకోకుండా చేస్తున్నారు. ప్రజా రహదారిపై గేట్లు నిర్మించడం చట్టవ్యతిరేకం. ఆ రహదారిని ప్రజలకు వదిలేయాలి. విద్యార్థులు, సాధారణ ప్రజలను స్వేచ్ఛగా తిరగనివ్వాలి.

### గేట్లు బద్దలుకొడతాం

మార్చి 31వ తేదీలోపు రామోజీ ఆక్రమించిన ప్రభుత్వ రహదారిని వదిలేయాలి. బలహీనవర్గాలకు చెందాల్సిన భూములు వారికి అందడంలో ఎటువంటి అడ్డంకులు పెట్టకూడదు. లేనిపక్షంలో ఈ ప్రాంత ప్రజలు, ప్రజాసంఘాలతో కలసి ఉద్యమిస్తాం. రామోజీ ఫిల్మ్‌సిటీ గేట్లు బద్దలుకొడతాం. భవిష్యత్తు పరిణామాలకు రామోజీయే బాధ్యత వహించాల్సి ఉంటుంది..''అని గోనె ప్రకాశరావు హెచ్చరించారు. బహిరంగ లేఖతోపాటు రహదారికి సంబంధించిన మ్యాప్, గతంలో ప్రభుత్వం ఇచ్చిన నివేదికలను, తాను రాసిన బహిరంగలేఖలను కూడా విడుదల చేశారు.

## స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపణ



మఠంపల్లి మండలం కాల్వపల్లితండాలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి(సూర్యాపేట): గ్రామాలకు పట్టుగొమ్మలైన స్థానిక సంస్థలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రాష్ట్ర పౌరసరఫరాలు, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని కాల్వపల్లితండాలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌ల కష్టాలు తీర్చాలని మాజీమంత్రి కేటీ రామారావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తుందని వెల్లడించారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రజల ఛీత్కారానికి గురైందని, రాష్ట్రంలో నిరంకుశ, నియంతృత్వ పరిపాలన పోయిందని ఆయన తెలిపారు.

## హామీల అమలుపై సీఎం దృష్టి పెట్టాలి

### వ్యక్తిగత ఆరోపణలు మానుకోవాలి

- బీఆర్ఎస్‌ను ఖతం చేయడం రేవంత్ తాత ముత్తాతల వల్ల కూడా కాదు
- రేవంత్ తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు
- కాంగ్రెస్ ఇటుకతో కొడితే మేం రాయితో కొడతాం
- మల్కాజ్‌గిరి సమీక్ష అనంతరం బీఆర్ఎస్ నేతల వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: అలవి కాని హామీలనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా రాష్ట్ర మంత్రులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఇతరులపై వ్యక్తిగత ఆరోపణలు మాని హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన మల్కాజ్‌గిరి పార్లమెంటు సమీక్ష సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి, సి.మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడారు.

**ఆ ఏడు సీట్ల గెలుపులో కేటీఆర్ ముద్ర**

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ నగరంలో కేటీఆర్ చేసిన అభివృద్ధిని చూసిన ప్రజలు మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలోని ఏడుకి ఏడు అసెంబ్లీ సీట్లలో గెలుపు పట్టం కట్టారని చెప్పారు. ఈ విజయంలో కేటీఆర్ ముద్ర ఉందన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ సీటును ఈసారి కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సీఎంగా రేవంత్ తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని, దావోస్‌లో ఆయన ముఖ్యమంత్రిలా వ్యవహరించలేదని నిందించారు. తాము ప్రజల హామీల గురించి అడుగుతుంటేనే మంత్రులు స్థాయి మరచి ఆరోపణలు చేస్తున్నారని, తామింకా రోడ్డెక్కలేదని, అప్పుడే కాంగ్రెస్ నేతలకు అంత ఉలికిపాటు ఎందుకని వివేకానంద ప్రశ్నించారు.

**రేవంత్ వీధి రౌడీలా మాట్లాడుతున్నారు**

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ తెలంగాణ తెచ్చిన గులాబీ జెండాను వంద మీటర్ల లోతున పాతిపెడతా అని రేవంత్ వీధి రౌడీలా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌ను ఖతం చేయడం రేవంత్ తాత ముత్తాతల వల్ల కూడా కాదని, రేవంత్ గురువుకు కూడా తాము భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ ఇటుకతో కొడితే తాము రాయితో కొడతామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

**కేసీఆర్ సొంత ఇల్లు కూడా లేని మహాత్ముడు: మల్లారెడ్డి**

మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సి.మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎంగా కేసీఆర్ లేకపోవడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఓ మహాత్ముడని, తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన కేసీఆర్ సొంత ఇల్లు కూడా కట్టుకోలేదన్నారు. కేసీఆర్ పాలనా చాతుర్యం కాంగ్రెస్ నాయకులకు లేదని, ఆయన పాలన చేసినట్టు ఎవరూ చేయలేరన్నారు.

## విషమంగానే విశ్వనాథ్‌రాజు ఆరోగ్య పరిస్థితి

### రామోజీ ఫిల్మ్‌సిటీ ఘటనలో సంస్థ నిర్లక్ష్యాన్ని తెలుసుకునే పనిలో ప్రభుత్వ అధికారులు



విశ్వనాథరాజు (ఫైల్‌ఫొటో)

అబ్దుల్లాపూర్‌మెట్: రామోజీ ఫిల్మ్‌సిటీలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయాలకు గురైన విస్టెక్స్ ఏషియా పసిఫిక్ లిమిటెడ్ ప్రెసిడెంట్ దాట్ల విశ్వనాథరాజు అలియాస్ రాజు దాట్ల ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. రామోజీ ఫిలింసిటీ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఈ దుర్ఘటనలో సంస్థ సీఈఓ సంజయ్ షా ప్రాణాలు కోల్పోగా, తీవ్ర గాయాలతో విశ్వనాథ రాజు మలక్‌పేటలోని యశోదా ఆస్పత్రిలో ఐసీయూ చికిత్స పొందుతున్నారు. ఆదివారం విశ్వనాథరాజు చికిత్సకు స్వల్పంగా స్పందిస్తున్నట్లు అధికారులు పేర్కొంటుండగా, అతని ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యవర్గాలు వెల్లడిస్తున్నట్లు సంస్థ ఉద్యోగి ఒకరు తెలిపారు. కాగా దుర్ఘటనలో చోటుచేసుకున్న లోపాలను, రామోజీ సంస్థ నిర్లక్ష్యాన్ని తెలుసుకునేందుకు ఇప్పటికే ఆర్అండ్‌బీ, పరిశ్రమలు, కార్మిక శాఖలకు లేఖ రాయగా, ఆయా శాఖల అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి పలు ఆధారాలను సేకరించడంతో పాటు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నట్లు అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ తెలిపారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం ఏర్పాటు చేయండి

### స్పీకర్‌ను కోరిన ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహాన్ని తెలంగాణ శాసన సభా ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని భారత జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఆమె హైదర్‌గూడలోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో స్పీకర్‌ను కలసి వినతి పత్రం అందించారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. గతంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోరాటం చేసి అసెంబ్లీ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించామని, ఇప్పుడు అదే స్ఫూర్తితో పూలే విగ్రహం కోసం కూడా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై ఢిల్లీ స్థాయిలో ఉద్యమించి మహిళా బిల్లుపై దేశ వ్యాప్తంగా చర్చ తీసుకొచ్చామని, తద్వారా మహిళా రిజర్వేషన్లను సాధించుకోవడంలో భారత జాగృతి కీలక పాత్ర పోషించిందని కవిత పేర్కొన్నారు. ఏప్రిల్ 11న పూలే జయంతి లోపు స్పీకర్, ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయాన్ని తీసుకుంటారని భావిస్తున్నామని అన్నారు. కాగా, పూలే విగ్రహం ఏర్పాటు విషయంలో ఈ నెల 26న రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా, అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందలేదని ఎమ్మెల్సీ కవిత వెల్లడించారు.

## బరాబర్ బొంద పెడతాం..

- బీఆర్ఎస్‌ను 14 ముక్కలు చేస్తాం: కోమటిరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి. చిత్రంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

సాక్షి, యాదాద్రి: 'ప్రభుత్వం ఆరు నెలల్లో పడిపోతుందని కేటీఆర్ కలలు కంటున్నాడు. కానీ బీఆర్ఎస్‌కు చెందిన 39 మంది ఎమ్మెల్యేలను 39 ముక్కలుగా విభజిస్తాం.. మీ పార్టీని 14 ముక్కలు చేస్తాం.. మా ముఖ్యమంత్రి చెప్పినట్టుగా బీఆర్ఎస్ పార్టీని మేము బరాబర్ బొంద పెడతాం' అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తొలిసారి యాదాద్రి జిల్లా భువనగిరికి వచ్చిన కోమటిరెడ్డి, ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ అధికారం పోయిన షాక్‌లో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకున్న అవినీతి సొమ్ముతో 20 సంవత్సరాలు సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఆరు లక్షల కోట్లు అప్పులు చేసిందని, పేదల భూములు లాక్కుందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం తెలంగాణను గాడిలో పెడుతోందన్నారు. ట్రిపుల్‌ఆర్ తెలంగాణకు మణిహారమని, రైతులు కోరుతున్నట్లు దీని అలైన్‌మెంట్ మార్చడానికి ప్రయత్నం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో 10 వేల కోట్ల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి ఉన్నారు.

## ఏప్రిల్ మొదటివారంలో లోక్‌సభ ఎన్నికలు

- బీజేపీ శ్రేణులు సంసిద్ధం కావాలన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్టేనని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్ మొదటి వారంలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున పార్టీ శ్రేణులు సంసిద్ధం కావాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కాబోతున్నారని, భారీమెజార్టీతో బీజేపీ గెలుస్తుందని ధీమావ్యక్తం చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో సుమారు రూ.12 లక్షల కోట్ల మేర అవినీతి జరిగిందని కాగ్ రిపోర్టు తేల్చగా, తొమ్మిదిన్నరేళ్లుగా ఒక్క రూపాయి కూడా అవినీతికి ఆస్కారం లేకుండా మోదీ నీతివంతమైన పాలన అందిస్తున్నారని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే మూసీ నదిలో పడేసినట్లేనని, ఆ పార్టీ ఎంపీలతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదన్నారు. తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం బందీ చేసుకుని అప్పులపాలు చేసిందని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితి దాపురించిందన్నారు. ఆరు గ్యారంటీల అమలు, సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేకపోతోందని ఎద్దేవా చేశారు. అయోధ్యలో రామమందిర పునర్నిర్మాణం కోసం వేలాదిమంది సాధుసంతులు, హిందువులు, ప్రజలు ఉద్యమించారని తెలిపారు. కోట్లాదిమంది భారతీయులు ఎదురుచూస్తున్న అయోధ్యలో రామమందిర నిర్మాణం ఐదు వందల ఏళ్ల తర్వాత మోదీ నేతృత్వంలో సాకారమవుతోందన్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, హిందువుల ఆత్మగౌరవానికి అయోధ్య రామమందిరం ప్రతీక అని కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం అయోధ్యలోని భవ్య రామమందిరంలో జరిగే బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని 150 దేశాల్లోని హిందువులందరూ వర్చువల్‌గా వీక్షించనున్నారని తెలిపారు. ఇది భారతీయులందరికీ గర్వకారణమని అన్నారు.

# తెలంగాణ గొంతుకను ఖతం చేసే కుట్ర

### కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని ప్రజలు అర్థం చేసుకోవాలి

### ఎట్టిపనికైనా, మట్టిపనికైనా తెలంగాణ గొంతుక బీఆర్ఎస్ పార్టీయే: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎట్టిపనికైనా, మట్టిపనికైనా తెలంగాణ ప్రజల ఏకైక గొంతుక బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని.. ఆ గొంతుకను కాంగ్రెస్, బీజేపీ కలసి ఖతం చేయాలని చూస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారకరామారావు ఆరోపించారు. బీఆర్ఎస్ 'కారు' వెళ్లింది సర్వీసింగ్‌కేనని, మళ్లీ రెట్టింపు వేగంతో పరుగెడుతుందని చెప్పారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజలకు ఆన్‌లైన్‌లో రేషన్‌కార్డులు మంజూరు చేశామని, ఈ విషయం కార్యకర్తలకు కూడా తెలియదని చెప్పారు. పార్టీ కమిటీలను పూర్తిస్థాయిలో వేయకపోవడం వల్ల నష్టం జరిగిందన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు ఇక ముందు జరగబోవని.. మూడు నెలలకోసారి పార్టీ కమిటీల సమావేశాలు నిర్వహించుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ లోక్‌సభ నియోజకవర్గాల వారీ సమీక్షల్లో భాగంగా ఆదివారం తెలంగాణభవన్‌లో మల్కాజ్‌గిరి స్థానంపై సమావేశం జరిగింది. దాదాపు ఏడుగంటలకుపైగా జరిగిన ఈ భేటీలో భాగంగా.. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..



ఆదివారం తెలంగాణభవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

''అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ కన్నా అదనంగా వచ్చింది నాలుగు లక్షల ఓట్లు మాత్రమే. 14 అసెంబ్లీ స్థానాలను స్వల్ప తేడాతో కోల్పోయాం. బీఆర్ఎస్ మరో ఏడెనిమిది చోట్ల గెలిచి ఉంటే హంగ్ వచ్చేది. కాంగ్రెస్ ఎన్నికల్లో దొంగమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆ పార్టీ తప్పించుకుంటున్న తీరును ప్రజాకోర్టులోనే ఎండగట్టాలి. ఇందుకోసం సమాచార హక్కు చట్టాన్ని కూడా కార్యకర్తలు సమర్థంగా వినియోగించుకోవాలి. హామీల అమలు కోసం కాంగ్రెస్ సర్కారుపై ఇప్పటినుంచే ఒత్తిడి తేవాలి.

**ఇప్పటికైనా ప్రజలు అర్థం చేసుకోవాలి**

తెలంగాణ ప్రజల ఏకైక గొంతుక అయిన బీఆర్ఎస్‌ను కాంగ్రెస్, బీజేపీ కలసి ఖతం చేయాలని కుట్ర చేస్తున్నాయి. ఇటీవల సీఎం రేవంత్ కలసిన సందర్భంగా బీఆర్ఎస్‌ను ఖతం చేసేందుకు సహకరిస్తానని ప్రధాని మోదీ చెప్పారనే వార్తలు వస్తున్నాయి. బీజేపీకి బీఆర్ఎస్ బీటీం కాదు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని ప్రజలు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి. ఢిల్లీలో తెలంగాణ గొంతుక వినబడాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి.

**నిజాలు మాట్లాడితే తప్పుపడతారా?**

నిరుద్యోగ భృతిపై ఇప్పటికే అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీ మాట తప్పింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాపై మాట మార్చింది. 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లులను జనవరి నెల నుంచి కట్టవద్దని గతంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా చెప్పారు. వారి మాటలనే నేను గుర్తుచేశా. నేను నిజాలు మాట్లాడితే విధ్వంసకర మనస్తత్వం అంటారా? సోనియాగాంధీనే కరెంటు బిల్లు కడతారని కాంగ్రెస్ నేతలు చెప్పి నందున.. ఆ బిల్లులను సోనియాగాంధీకి పంపేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు ప్రజలను సమాయత్తం చేయాలి. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల పై తప్పుడు కేసులు పెడుతున్నారు. వారికి పార్టీ లీగల్‌సెల్ అండగా ఉంటుంది. మోదీకి, రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ భయపడదు..'' అని కేటీఆర్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాల సందర్భంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు విప్ జారీ చేస్తామని.. ఆ విప్‌ను ఉల్లంఘించిన వారి సభ్యత్వాలను రద్దు చేయిస్తామని హెచ్చరించారు. గతంలో మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని అతి తక్కువ ఓట్ల తేడాతో కోల్పోయామని, ఈసారి కష్టపడి విజయం చేజిక్కించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**మళ్లీ వచ్చేది మన సర్కారే: హరీశ్‌రావు**

బీఆర్ఎస్‌కు విజయాలతోపాటు అపజయాలు కూడా ఉన్నాయని, వాటికి కేసీఆర్ కుంగిపోయి ఉంటే తెలంగాణ వచ్చేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని, కార్యకర్తలు ఆందోళన చెందవద్దని చెప్పారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు ఇచ్చి అభాసుపాలైన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలోనూ అదే పరిస్థితి వస్తుందని విమర్శించారు. ఎన్నికల కోడ్ బూచిని చూపి హామీల అమలును వాయిదా వేయాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చేలోపే కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీలను అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### విద్యుత్ బిల్లులను సోనియాకు పంపిస్తాం: కేటీఆర్ ట్వీట్

''మంత్రి భట్టి విక్రమార్క గారూ.. ఎన్నికల సమయంలో మీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన ప్రకటనలను మాత్రమే మీకు గుర్తు చేస్తున్నాను. 2023 నవంబర్, డిసెంబర్ నెల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించవద్దని ఆ ఇద్దరు నేతలు తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు బిల్లుల చెల్లింపు బాధ్యతను సోనియాగాంధీ తీసుకుంటారని కూడా సీఎం రేవంత్ స్పష్టంగా చెప్పారు. కాబట్టి సంబంధిత శాఖ మంత్రిగా ప్రజల నుంచి బిల్లులు వసూలు చేయవద్దని మీ శాఖను ఆదేశించండి. లేదంటే ఆ విద్యుత్ బిల్లులను ఢిల్లీలోని సోనియాగాంధీ నివాసం 10 జనపథ్‌కు పంపిస్తాం'' – ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్

### బీఆర్ఎస్‌ను బొందపెట్టే మొనగాడు పుట్టలేదు

సీఎం రేవంత్ విదేశాల్లో తెలంగాణ పరువు తీశారని, రేవంత్ గుంపు మేస్త్రీ పనితనం ఏంటో తేలిపోయిందని మాజీ మంత్రి కడియం శ్రీహరి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్‌ను బొందపెట్టే మొనగాడు ఈ భూమి మీద ఇంకా పుట్టలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మంత్రులు కోతుల గుంపుగా ప్రవర్తిస్తున్నారని.. అభివృద్ధి చేయనందుకు బీఆర్ఎస్ ఓడిపోలేదని, కొందరు పిచ్చివాళ్లు ఏవేవో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌కు ప్రజల్లో ఆదరణ చెక్కుచెదరలేదని స్పష్టం చేశారు. ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని, రాష్ట్రానికి మళ్లీ కేసీఆర్ పాలనే దిక్కు అని వ్యాఖ్యానించారు.

– మాజీ మంత్రులు కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి



> ఎలాగైతే ఈ సమస్త బ్రహ్మాండంలో వ్యాపించివున్న ఒకే అగ్ని నానారూపాలుగా ఉంటుందో, అదే విధంగా సకల ప్రాణుల అంతరంగాల్లోనూ నెలకొనివుండే ఆ పరబ్రహ్మ ఒక్కటే అయినా నానారూపాలు గల ప్రాణులు, పదార్థాల్లో ఇమిడి వుంటుంది.
> – కఠోపనిషత్తు



సాక్షి

సోమవారం, 22 జనవరి 2024

# సాహిత్య ఒడంబడికలు

59 ఏళ్ల ఆ వ్యాపారవేత్తకు నయంకాని చర్మవ్యాధి వస్తుంది. కాళ్లకు ఎప్పుడూ పట్టీలు కట్టాల్సిన పరిస్థితి. భార్య ఇష్టపడదు. అతణ్ణి తాకనివ్వదు. అసహనం కమ్ముకున్న వ్యాపారవేత్త విసిగిపోయి తన గోడౌన్‌లో నివసించడం ప్రారంభిస్తాడు. ఒక్కగానొక్క కొడుక్కి తండ్రి గురించి బెంగ. అతను తండ్రి బాగోగుల కోసం ఒక మహిళను తెచ్చి పెడతాడు. ఆ మహిళ ఆ వ్యాపారవేత్త పట్ల కారుణ్యమూర్తి అవుతుందా? మానవ స్వభావాలు ఎట్టి పరిస్థితుల్లో ఏమేమిగా మారుతుంటాయి? తమిళ సాహిత్యంలో నిన్న మొన్న పూచిన కలం ముతురాస కుమార్ రాసిన ఇలాంటి కథలున్న సంకలనాన్ని 'మీ భాషలోకి అనువదిస్తారా... మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయు) సైన్ చేస్తారా' అని కన్నడ, మలయాళ పబ్లిషర్లతో సూటూ బూటూ వేసుకుని చర్చిస్తున్న లిటరరీ ఏజెంట్ అక్కడ కనిపించింది.

'ఇమయం' కలం పేరుతో పాతికేళ్లుగా రాస్తున్న స్కూల్ టీచర్ వి.అన్నామలై కిడ్నీ బాధితుల జీవితాన్ని నవలగా రాయడానికి ఏకంగా సైంటిస్ట్ అంతటి పరిశోధన చేశాడు. కిడ్నీ ఎలా పని చేస్తుంది, ఎందుకు పాడవుతుంది, పాడయ్యాక ఎలా ఎదుర్కొనాలి, ఇందులో మందుల, ఆస్పత్రుల గూడుపుఠానీ ఏమిటనేవి వివరిస్తూ 'ఇప్పోదు ఉయిరోడు ఇరిక్కిరేన్' పేరుతో నవల రాస్తే వెంటనే 'ఐయామ్ ఎలైవ్.. ఫర్ నౌ' పేరుతో ఇంగ్లిష్‌లోకి అనువాదమైంది. అది సరిపోతుందా? స్పానిష్, టర్కిష్, నేపాలీ, లేదంటే తెలుగు భాషల్లోకి అనువాదమైతేనే కదా తమిళ నవల గొప్పదనం తెలిసేది! 'అనువాదం చేయించి పబ్లిష్ చేస్తారా మరి' అని మరో లిటరరీ ఏజెంట్ అక్కడ విదేశీ పబ్లిషర్ల డెస్కుల దగ్గర తిరుగాడుతూ కనిపించాడు.

'చెన్నై ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్ 2024' పేరుతో చెన్నపట్టణంలో జనవరి 16–18 తేదీల్లో మూడురోజులు సాగిన పుస్తక ప్రదర్శన నిజానికి 'రైట్స్ హబ్'. ఇది తమిళనాడు ప్రభుత్వ పూనికతో, తమిళ సాహిత్యాన్ని ప్రపంచానికి అనువాదం చేసి అందించడానికి హక్కుల క్రయవిక్రయాలకు నియోగించిన వేదిక. మిగిలిన భారతీయ భాషల్లో రచయితలు తాము రాసిన పుస్తకాలను ఇతర భాషల్లో అనువదించుకోవడానికి పాట్లు పడాలి. కాని తమిళనాడు ప్రభుత్వం తన భాషా సాహిత్యాన్ని అనువాదం చేయించడానికి గత రెండేళ్లుగా ఈ రైట్స్ హబ్ నిర్వహించడమే కాదు అందుకు 'తమిళనాడు ట్రాన్స్‌లేషన్ గ్రాంట్' పేరుతో ఆర్థిక అండ కూడా అందిస్తోంది. అంటే మీరొక పబ్లిషరై ఒక తమిళ పుస్తకాన్ని తెలుగులోకి అనువాదం చేయించి ప్రచురిస్తానంటే ఒక్కో పుస్తకానికి పేజీల సంఖ్యను బట్టి గరిష్ఠంగా రెండున్నర లక్షలు మంజూరు చేస్తుంది! రెండున్నర లక్షలు!! దానికి బదులుగా మీరు 500 కాపీలు ప్రచురిస్తే 50 కాపీలు, 1000 కాపీలు ప్రచురిస్తే 100 కాపీలు ప్రభుత్వానికి దఖలు పరచాలి. గ్రాంటు డబ్బుల్లో అనువాద ఖర్చులు, బుక్‌మేకింగ్ ఖర్చులు, ప్రింటింగ్ ఖర్చులు బాగానే సరిపోతాయి. కాపీలు అమ్ముకోగా వచ్చిన డబ్బులు పబ్లిషర్లవే!

'తమిళంలో గత వందేళ్లలో గొప్ప సాహిత్యం వచ్చింది. ప్రపంచ సాహిత్యానికి ఇది ఏ మాత్రం తక్కువ కాదు. మేము ఇప్పటి వరకు రష్యన్, ఫ్రెంచ్, బెంగాలీ, హిందీ నుంచి అనువాదాలు బోలెడు చేసుకున్నాం. బయట దేశాల, భారతీయ భాషల సాహిత్యం తమిళ అనువాదాల ద్వారా చదివాం. ఇప్పుడు మీ వంతు. మా సాహిత్యాన్ని చదవండి. అనువాదం చేసుకోండి. మా సాహిత్యాన్ని మీకు చేరువ కానీయండి' అని బుక్ ఫెయిర్ అనుసంధానకర్త, రచయిత మనుష్యపుత్రన్ ప్రారంభ కార్యక్రమంలో అన్నారు. గత సంవత్సరం నుంచి మొదలైన ఈ గొప్ప సంకల్పం సత్ఫలితాలను ఇస్తోంది. 2023లో జరిగిన చెన్నై ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్‌లో దేశీయంగా, విదేశీయంగా 100కు పైగా తమిళ పుస్తకాల అనువాదాలకు ఎంఓయులు జరిగితే ఇప్పటికి 52 పుస్తకాలు వెలువడ్డాయి. వీటిలో చైనీస్, అరబిక్, మలయా, కొరియన్, కన్నడ, మలయాళ భాషల్లో వెలువడ్డ తమిళ పుస్తకాలు ఉన్నాయి. ఉదాహరణకు తమిళ కథారచయిత సుజాత కథలు తమిళం ద్వారా పాఠకులకు తెలుసు. ఇప్పుడు చైనీస్ ద్వారా మొత్తం చైనాకు తెలుసు.

చెన్నై ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్ 2024లో పాల్గొన్న 40 దేశాల పబ్లిషర్లు, భారతీయ భాషల పబ్లిషర్లు ఫెయిర్ ముగిసే సమయానికి 750 ఎంఓయులు చేసుకున్నారు. ఇవన్నీ తమిళం నుంచి ఇతర భాషలకు మాత్రమే కాదు... ఇతర భాషల నుంచి తమిళ లేదా ఏ భాషలోకైనా గానీ! అయితే తమిళనాడు ప్రభుత్వ ట్రాన్స్‌లేషన్ గ్రాంట్ మాత్రం తమిళం నుంచి ఇతర భాషల్లోకి అనువాదమయ్యే పుస్తకాలకే! తమిళ ప్రభుత్వం ఈ ఒడంబడికల కోసం ఎంత శ్రద్ధ పెట్టిందంటే ఇంగ్లిష్ రాని రచయితల, పబ్లిషర్ల తరఫున చర్చలు చేయడానికి 20 మంది లిటరరీ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చి మరీ రంగంలో దింపింది. ఎంత బాగుంది ఇది! ఏ ప్రభుత్వానికైనా తన సాహిత్య సంపద పట్ల ఉండవలసిన కనీస అనురక్తి ఇది!!

మరి మన సంగతి? తెలుగు సాహిత్యం నుంచి ఇలాంటి ప్రయత్నం చేయడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు అనాసక్తి లేకపోవచ్చు. తమ సాహిత్యాన్ని కాపాడుకోవాలనుకునే తపన ఆ రెండు ప్రభుత్వాలకు తప్పక ఉండి ఉండొచ్చు. కాకుంటే సాహిత్య ప్రపంచం నుంచి, శాసనాధీశుల నుంచి, పాలనా వ్యవస్థలోని చదువరులైన ఐ.ఏ.ఎస్ అధికారుల నుంచి తగిన చొరవ, ఒత్తిడి కావాలంతే!

'చలం రాసిన 'మైదానం'ను కొరియన్‌లోకి అనువదిస్తారా?' అని ఒక లిటరరీ ఏజెంట్, 'గుఱ్ఱం జాషువా 'గబ్బిలం'ను ఫ్రెంచ్‌లోకి అనువదిస్తారా?' అని మరో లిటరరీ ఏజెంట్ ఎంఓయులు సైన్ చేసే సన్నివేశం కోసం ఎదురుచూద్దాం.

**గ్రహం అనుగ్రహం** శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు. ద్వాదశి రా.8.48 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** మృగశిర తె.5.51 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ.11.10 నుండి 12.46 వరకు, **దుర్ముహూర్తం:** 12.35 నుండి 1.23 వరకు, తదుపరి ప.2.50 నుండి 3.38 వరకు,**అమృతఘడియలు:** రా.9.03 నుండి 10.45 వరకు. **సూర్యోదయం:** 6.39 ; **సూర్యాస్తమయం:** 5.45 ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు ; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు

# సుగుణ సంపన్నుడు

సద్గుణాభిరామునికై అయోధ్యలో వెలుస్తున్న బాల రాముని ఆలయం ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. మన ఇతిహాసాల్లో ఒకటయిన 'రామాయణం' మనకు అత్యంత పవిత్రమైనది. కథానాయకుడు రాముని జీవితాన్ని పరికించి చూస్తే ఒక పూర్ణ పురుషుడికి ఉండవలసిన సుగుణాలన్నీ మనకు ఆయనలో కనిపిస్తాయి.

చిన్నతనంలోనే తండ్రి మాట జవదాటకుండా విశ్వామిత్రునితో అడవులకి వెళ్లి తనలోని విద్యా కౌశలాన్ని ప్రదర్శించి యాగశాలను రక్షించాడు రాముడు. విశ్వామిత్రుల దగ్గర శిష్యరికం చేస్తూ చేసిన పరిచర్యల ద్వారా రాముణ్ణి ఒక మంచి శిష్యుడుగా గుర్తించగలం. అదేవిధంగా జనకుడు కొలువులో శివధనుస్సును విరిచినప్పుడు సీతమ్మ వారిని చేపట్టాలని జనకుడు కోరగా తమ పెద్దల అనుమతితోనే వివాహమాడుతానని చెప్పటం ద్వారా పెద్దలను గౌరవించే శ్రీరామచంద్రుని చూస్తాం. పట్టాభిషేకం చేసుకోవలసిన తరుణంలో కైకేయికి తండ్రి ఇచ్చిన వరాల కోరికను అనుసరించి అడవులకు వెళ్లిన రామునిలో పితృ వాక్య పాలకుడిని గమనించగలం.

వనవాసంలో మాయా జింక అని లక్ష్మణుడు వారిస్తున్నప్పటికీ సీతమ్మ కోరికను తీర్చడానికి జింకను వేటాడటంలో శ్రీరామచంద్రునిలో భార్య అభిప్రాయాన్ని గౌరవించే ఒక మంచి భర్తను చూడగలం. వనవాసంలో గుహుడు, శబరి, వానరులతో రాముని స్నేహం చూస్తే ఒక సామాజిక వేత్తగాను, సాంఘిక సంస్కర్తగాను కన్పిస్తాడు. సుగ్రీవునితో స్నేహం ద్వారా రాముడిలో ఒక మంచి మిత్రుడిని చూడగలం. హనుమంతునితో ఆయన బంధం భగవంతుడికి – భక్తునికి మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీక.

యుద్ధ కాండలో ఇంద్రజిత్తు వేసిన బాణంతో అచేతనావస్థలోకి జారుకున్న లక్ష్మణుడిని చూచి తల్లడిల్లిన రాముని హృదయవేదన అన్నదమ్ముల ప్రేమానుబంధాలకు నిలయమని గమనించగలం. శ్రీరాముని చేతిలో రావణాసురుడు ఓటమి అంచులలో ఉన్నప్పుడు చంపే అవకాశం ఉన్నప్పటికీ రావణుడి చేతిలో అస్త్రాలు ఏమీ లేనందువలన 'నేడు వెళ్లి రేపు రా' అని అభయం ఇవ్వటంలో ఒక దయార్ద్ర హృదయుని చూడగలం. ఒక రాజ్యాధినేతగా సొంత భార్యపై అపనిందలు తొలగించడానికి సీతమ్మ వారిని అడవులకు పంపి జీవితాంతం ఒంటరి జీవితాన్ని గడిపిన శ్రీరామచంద్రునిలో ఒక నిష్పక్షపాతి, రాగ ద్వేషాలకు అతీతుడైన పరిపాలనా దక్షుణ్ణి మనం గమనించగలం. శ్రీరాముడు చరమాంకంలో తన బిడ్డలు ఇద్దరితో పాటు లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుని బిడ్డలకు కూడా సరిసమానంగా రాజ్యాలను పంచి ఇవ్వటంలో ఒక ఉన్నతమైన న్యాయమూర్తిని చూడగలం.

చివరి దశలో సరయూ నదిలో అవతారం చాలించేటప్పుడు భువి నుంచి దివికి తనతో పాటు వచ్చిన వారందరూ కూడా తిరిగి వస్తున్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారణ చేసుకోవడం ద్వారా నమ్ముకున్న వాళ్లకు న్యాయం చేసే ఒక ఆదర్శమూర్తినీ, మంచి నాయకుడినీ చూడగలం. ఇలా రామునిలో ఎన్నో ఆదర్శాలు కనిపిస్తాయి. అందుకే ఆయన భారతీయులకు ఆదర్శప్రాయుడయ్యాడు.

– ఆచార్య వై.వి. రామిరెడ్డి
ఎస్వీ యూనివర్సిటీలో ఆచార్యులు | 94404 50108

# అన్ని దారులూ అయోధ్యకే!

అయోధ్య అంటే 'యుద్ధం లేనిది', 'సంఘర్షణ లేని స్థానం' అని అర్థం. సమాజంలోని ప్రతి ఒక్కరి మనస్సులలో అటువంటి అయోధ్య నిర్మాణం కావాలి. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం జాతి గౌరవ పునర్ జాగరణకు గుర్తు. ఇది శ్రీరాముని జీవితం ఇచ్చే సందేశాన్ని ఆధునిక సమాజం కూడా స్వీకరించిందనడానికి గుర్తు. క్షమ, వినయం, అందరినీ సమాదరించే ధోరణి, కర్తవ్య పాలనలో పట్టుదల, న్యాయబుద్ధి, సద్భావం వంటి శ్రీరామచంద్రుని గుణాలను తిరిగి ఈ సమాజంలో పాదుకొల్పాలి. అలాంటి సమాజాన్ని నిర్మించడమే శ్రీరాముని నిజమైన పూజ అవుతుంది. శ్రీరామ జన్మభూమి ఆలయ స్థాపన ఒక లోతైన ఆధ్యాత్మిక వేడుకగా నిలుస్తుంది. ఇది భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి సూచిక. నేడు జరిగే ప్రాణప్రతిష్ఠ ఉత్సవంలో పాల్గొని భారత్, తద్వారా ప్రపంచపు పునర్నిర్మాణ సంకల్పం చేపడదాం.

## రాముని మార్గంలో నడుద్దాం!

సందర్భం



డా॥ మోహన్ భాగవత్

మన భారతదేశపు శతాబ్దిన్నర చరిత్ర విదేశీ దురాక్రమణదారులతో సాగించిన నిరంతర సంఘర్షణలతో నిండి ఉంది. ప్రారంభంలో కొద్దిమంది అప్పుడప్పుడు ఇక్కడి సంపదను దోచుకోవడం కోసం (సికందర్ దాడి) ఈ దేశంపై దాడి చేసేవారు. కానీ ఆ తరువాత ఇస్లాం పేరున పశ్చిమం నుండి సాగిన దాడులు ఇక్కడి సమాజాన్ని తీవ్రంగా నష్టపరచడమేకాక వేర్పాటువాద ధోరణిని కూడా తీసుకువచ్చాయి. సమాజంలో నిరాశ, నిస్పృహ, పరాజయ భావాలను నింపడానికి విదేశీ దురాక్రమణదారులు ఇక్కడి ధార్మిక స్థలాలు, మందిరాలపై దాడి చేసి, వాటిని ధ్వంసం చేశారు. ఇలా ఒక్కసారి కాదు, అనేకసార్లు జరిగింది. ఈ విధంగా భారతీయ సమాజాన్ని బలహీనపరచి దీర్ఘకాలం ఇక్కడ రాజ్యం చేయాలన్నది వారి ప్రయత్నం.

అయోధ్యలో శ్రీరామ మందిరాన్ని కూడా ఇదే ఉద్దేశ్యంతో, లక్ష్యంతో ధ్వంసం చేశారు. దురాక్రమణకారుల ఈ లక్ష్యం కేవలం ఒక మందిరానికే పరిమితం కాలేదు. మొత్తం ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలన్నది వారి అసలు ఉద్దేశ్యం.

ఈ దేశానికి చెందిన రాజులు ఎప్పుడూ, ఏ దేశంపైనా దురాక్రమణ చేయలేదు. కానీ ప్రపంచంలోని మిగిలిన దేశాలకు చెందిన రాజులు మాత్రం అటువంటి దాడులు, దురాక్రమణలకు పాల్పడ్డారు. అయినా ఏ పాలకుడూ భారత్‌పై పూర్తి ఆధిపత్యాన్ని సాధించలేకపోయాడు. భారతీయ సమాజం ఎప్పుడూ ఈ దురాక్రమణదారుల ముందు తలవంచలేదు. వీరిని ఎదుర్కొనేందుకు నిరంతరం పోరాటం చేస్తూనే ఉంది. అయోధ్య జన్మస్థానాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని అక్కడ భవ్యమైన రామమందిరాన్ని పునర్నిర్మించడానికి నిరంతర ప్రయత్నం సాగుతూనే వచ్చింది. అనేక యుద్ధాలు, సంఘర్షణ, బలిదానాలు జరిగాయి. రామజన్మభూమిలో మందిర నిర్మాణ సంకల్పం హిందువుల మనస్సుల నుండి ఎప్పుడూ తొలగిపోలేదు.



నేడు అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ

1857లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యుద్ధానికి ప్రణాళిక వేసుకున్నప్పుడు హిందువులు, ముస్లింలు కలిసే ఆ పని చేశారు. అప్పటివరకూ ఇద్దరూ ఆలోచనలు పంచుకునేవారు. అప్పుడు గోవధ నిషేధం, రామజన్మభూమి గురించి రెండు వర్గాల మధ్య ఒక అంగీకారం కుదిరే పరిస్థితి ఏర్పడి ఉంది. తన ప్రమాణపత్రంలో గోవధ నిషేధం అమలు గురించి కూడా బహదూర్ షా జాఫర్ పేర్కొన్నారు. అందువల్లనే సమాజం మొత్తం ఒకటిగా నిలచి పోరాడింది. భారతీయులందరూ వీరోచితంగా పోరాడినా దురదృష్టవశాత్తూ ఆ యుద్ధం విఫలమైంది. దానితో బ్రిటిష్ పాలన కొనసాగింది. అయితే రామ జన్మభూమి ముక్తి పోరాటం మాత్రం ఆగలేదు. బ్రిటిష్ వాళ్ళు మొదటి నుండి అనుసరిస్తూ వచ్చిన 'విభజించి పాలించు' అనే విధానాన్ని ఆ తరువాత మరింతగా అమలుచేశారు. సమాజంలోని ఐకమత్యాన్ని నాశనం చేయడం కోసం బ్రిటిష్ వాళ్ళు స్వతంత్ర వీరులను అయోధ్యలో ఉరితీశారు. అయినా అయోధ్య ముక్తి పోరాటం ఆగలేదు.

1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సోమనాథ మందిర జీర్ణోద్ధరణ జరగడంతో ఇటువంటి దేవాలయాల గురించి చర్చ మళ్ళీ ప్రారంభమయింది. రామజన్మభూమి ముక్తి గురించి అందరి ఆమోదం, అంగీకారం సాధించే అవకాశం అప్పుడు వచ్చినా రాజకీయాలు మరోదారి పట్టాయి. విచ్ఛిన్నవాదం, ప్రాంతీయవాదం వంటివి రాజకీయాల ముసుగులో పెచ్చరిల్లాయి. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఈ విషయమై హిందువుల మనోభావాలను పట్టించుకోకపోగా వివాదాన్ని పరిష్కరించుకోవడం కోసం ప్రజలు చేసిన ప్రయత్నాలను కూడా ముందుకు సాగనివ్వలేదు. ఈ విషయమై స్వాతంత్ర్యానికి ముందు నుండి సాగుతూ వచ్చిన న్యాయపోరాటాన్ని కొనసాగించారు. రామజన్మభూమి విముక్తి కోసం ప్రజా ఉద్యమం 1980 తరువాత ఊపందుకుంది. అప్పటి నుండి మూడు దశాబ్దాల పాటు సాగింది.

1949లో జన్మభూమిలో భగవాన్ శ్రీరామచంద్రుని విగ్రహం వెలిసింది. 1986లో కోర్టు ఆదేశం మేరకు ఆలయ తాళాలు తెరిచారు. ఆ తరువాత అనేక ఉద్యమాలు, రెండుసార్లు కరసేవ వంటి కార్యక్రమాల ద్వారా హిందూ సమాజపు నిరంతర సంఘర్షణ కొనసాగింది. 2010లో అలహాబాద్ హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. ఆ తరువాత ఈ విషయంలో అంతిమ తీర్పు సాధ్యమైనంత త్వరగా వెలువరించాలంటూ కోర్టుకు పదేపదే అభ్యర్థనలు వెళ్ళాయి. చివరికి హిందూ సమాజపు 30 సంవత్సరాల సుదీర్ఘమైన న్యాయ పోరాటం తరువాత 2019 నవంబర్ 9న అన్ని సాక్ష్యాధారాలు క్షుణ్ణంగా పరిశీలించిన సుప్రీంకోర్టు సముచితమైన, సంతులితమైన తీర్పును ప్రకటించింది. రెండు పక్షాల మనోభావాలు, సాక్ష్యాధారాలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అలాగే ఈ కేసుకు సంబంధించి అన్ని పక్షాల వాదనలను కూడా పూర్తిగా విన్న తరువాత తీర్పునిచ్చింది. ఈ తీర్పును అనుసరించి మందిర నిర్మాణం కోసం ఒక ట్రస్టును ఏర్పాటు చేశారు. 2020 ఆగస్ట్ 5న మందిర భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఇప్పుడు పుష్య మాస శుక్లపక్ష ద్వాదశి, యుగాబ్ది 5125... 2024 జనవరి 22న శ్రీ రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ధార్మిక దృష్టితో చూస్తే శ్రీరాముడు ఈ దేశంలో అధిక సంఖ్యాకులకు ఆరాధ్య దేవుడు. ఆయన జీవితం ఆదర్శప్రాయమనీ, అనుసరణీయమనీ నేటికీ సమాజంలో అందరూ భావిస్తున్నారు. అందువల్ల ఈ కార్యక్రమానికి సంబంధించి వస్తున్న చిన్నపాటి అభ్యంతరాలు, అనుమానాలను పూర్తిగా పక్కన పెట్టాలి. వివాదాలు, వాదనలు పూర్తిగా సమసిపోయేట్లు మేధావులు చూడాలి. అయోధ్య అంటే 'యుద్ధం లేనిది', 'సంఘర్షణ లేని స్థానం' అని అర్థం. సమాజంలోని ప్రతి ఒక్కరి మనస్సులలో అటువంటి అయోధ్య నిర్మాణం కావాలి. అది మనందరి కర్తవ్యం.

అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం జాతి గౌరవ పునర్ జాగరణకు గుర్తు. ఇది శ్రీరాముని జీవితం ఇచ్చే సందేశాన్ని ఆధునిక సమాజం కూడా స్వీకరించిందనడానికి గుర్తు. శ్రీరామ మందిరంలో పత్రం, ఫలం, పుష్పంతో పూజతోపాటు రామదర్శనంతో మనస్సులో ఆయనను ఉంచుకుని ఆదర్శవంతమైన ఆచరణను అలవరచుకుని శ్రీరాముని పూజ చేయాలి. ఎందుకంటే 'శివో భూత్వా శివం భజేత్, రామో భూత్వా రామం భజేత్' (శివుడే తానై శివుని పూజించు, రాముడే తానై రాముడిని పూజించు) అనేదే నిజమైన పూజ అవుతుంది.

భారతీయ సాంస్కృతిక దృష్టి ప్రకారం...
**మాతృవత్ పర దారేషు పర ద్రవ్యేషు లోష్టవత్**
**ఆత్మవత్ సర్వభూతేషు యః పశ్యతి సః పండితః**
(పర స్త్రీని మాతృభావనతో చూడాలి. పరుల సొమ్మును మట్టిగా ఎంచాలి. సర్వ జీవులలో ఆత్మను చూడాలి అని పండితులు చెబుతారు.) ఈ విధంగా మనం శ్రీరాముని మార్గంలో నడవాలి.

సత్యనిష్ఠ, బలపరాక్రమాలతోపాటు క్షమ, వినయం, అందరినీ సమాదరించే ధోరణి, కారుణ్యం, కర్తవ్య పాలనలో పట్టుదల వంటి శ్రీరామచంద్రుని గుణాలను వ్యక్తిగతంగా, కుటుంబపరంగా అలవరచుకునే ప్రయత్నం చేయాలి. వ్యక్తిగత జీవితంలో క్రమశిక్షణ తెచ్చుకోవాలి. ఇటువంటి క్రమశిక్షణ ద్వారానే రామలక్ష్మణులు 14 ఏళ్ల అరణ్యవాసాన్ని పూర్తిచేయడమేకాక శక్తిశాలి రావణునితో పోరాడి విజయం సాధించారు. శ్రీరాముని జీవితంలో కనిపించే న్యాయబుద్ధి, కరుణ, సద్భావం, నిష్పక్షపాత ధోరణి వంటి సామాజిక గుణాలను తిరిగి ఈ సమాజంలో పాదుకొల్పాలి. శోషణ లేని, సమాన న్యాయం లభించే సమాజాన్ని, శక్తితోపాటు కరుణ నిండిన ఒక సమాజాన్ని నిర్మించడమే శ్రీరాముని నిజమైన పూజ అవుతుంది.

అహంకారం, స్వార్థం, భేదభావాల మూలంగా ప్రపంచం వినాశం వైపు పరుగులు తీస్తోంది. ఎన్నో ఆపదలను కొనితెచ్చుకుంటోంది. సద్భావన, ఏకత, ప్రగతి, శాంతి వంటి మార్గాన్ని చూపిన జగదభిరాముని ఆదర్శం సర్వకల్యాణకారి, 'సర్వేషాం అవిరోధి' (ఎవరితోనూ విరోధం లేని) అయిన సమాజ నిర్మాణపు ప్రారంభానికి దారి చూపాలి. ఆ మహా ప్రయత్నానికి శ్రీ రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ నాంది కావాలి. మనమంతా ఆ ప్రయత్నంలో, ఆ ఉద్యమంలో పాలుపంచుకోవాలి. జనవరి 22న జరిగే ఉత్సవంలో పాల్గొని మందిర పునర్నిర్మాణ కార్యంతో భారత్, తద్వారా ప్రపంచపు పునర్నిర్మాణ సంకల్పం చేపడదాం. ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకుని ముందుకు నడుద్దాం!

వ్యాసకర్త ఆర్.ఎస్.ఎస్. సర్ సంఘచాలక్

## అయోధ్యలో నూతనోదయం

సందర్భం



యోగి ఆదిత్యనాథ్

జాసు బిరహ సోచహు దిన రాతీ! రటహు నిరంతర గున్ గన్ పాంతీ!!
రఘుకుల తిలక సుజన్ సుఖదాతా! ఆయో కుసల్ దేవ ముని త్రాతా!!

శతాబ్దాల నిరీక్షణకు, తరాల పోరాటానికి, మన పూర్వీకులు చేసిన ప్రతిజ్ఞకు ముగింపు పలికే రోజు ఎట్టకేలకు వచ్చింది. సనాతన సంస్కృతికి ఆత్మ అయిన 'రఘునందన్ రాఘవ్ రామ్‌లల్లా' తన జన్మస్థలమైన అవధ్‌పురిలోని గొప్ప దైవిక ఆలయంలో ప్రతిష్ఠితమవుతున్నారు. 500 సంవత్సరాల విరామం తర్వాత జరుగుతున్న ఈ చరిత్రాత్మకమైన, పవిత్రమైన సందర్భం... భారతదేశాన్ని మాత్రమే కాకుండా యావత్ ప్రపంచాన్ని 'మోక్షదాయని' అయోధ్యపై చూపు నిలిపేలా చేసింది. నేడు ప్రతి రహదారీ శ్రీరామ జన్మభూమికి దారి తీస్తుంది. ప్రతి కన్ను ఆనందబాష్పాలతో తడిసిపోతుంది. అందరూ 'రామ్–రామ్' అని జపిస్తారు.

తరతరాలుగా విశ్వాసులు, లోకాన్ని విడిచిపెట్టిన రామభక్తులు ఈ రోజు కోసం ఎంతగానో ఎదురు చూశారు. 2024 జనవరి 22 ప్రాముఖ్యత బాలరూప రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు మించినది. ఇది ప్రజల విశ్వాస పునఃస్థాపనను సూచిస్తుంది. అయోధ్య ఇప్పుడు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. సత్య న్యాయాల ఉమ్మడి విజయం చేదు జ్ఞాపకాలను చెరిపివేస్తుంది. కొత్త కథలను సృష్టిస్తుంది. సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తుంది.

'శ్రీరామ జన్మభూమి ముక్తి మహాయజ్ఞం' అనేది కేవలం సనాతన విశ్వాసానికి పరీక్ష కాదు; ఇది విజయవంతంగా దేశ సామూహిక చైతన్యాన్ని మేల్కొల్పింది. భారత దేశాన్ని ఐక్యతా సూత్రంతో కలిపింది. రాముడి జన్మస్థలంలో ఆలయ నిర్మాణం కోసం జరిగిన పోరాటంలో ప్రదర్శించిన ప్రత్యేక ఐక్యత అసమానమైనది. సాధువులు, సన్యాసులు, మేధావులు, రాజకీయ నాయకులు మరియు అన్ని వర్గాల ప్రజలు విభేదాలకు అతీతంగా ఒక ఉమ్మడి లక్ష్యం కోసం ఏకమయ్యారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వ హిందూ పరిషత్ వంటి సామాజిక సాంస్కృతిక సంస్థలు రోడ్‌మ్యాప్‌ను రూపొందించి ప్రజలను ఏకం చేశాయి. ఆ తీర్మానం ఎట్టకేలకు నెరవేరింది. భారతదేశంలో కొత్త ఉషస్సు వెల్లివిరుస్తోంది.

ఒకప్పుడు 'అవని అమరావతి' అనీ, 'భూలోక వైకుంఠం' అనీ పిలిచిన అయోధ్య శతాబ్దాల పాటు శాపగ్రస్తంగా ఉండిపోయింది. 'రామ రాజ్యం' ఒక ఆదర్శ భావనగా ఉన్న దేశంలోనే రాముడు తన ఉనికిని నిరూపించుకోవాల్సిన అగత్యం వచ్చింది. అతని జన్మస్థలానికి ఆధారాలు కావాల్సి వచ్చింది. కానీ శ్రీరాముని జీవితం మర్యాదగా ప్రవర్తించడం, స్వీయ నిగ్రహాన్ని పాటించడం నేర్పుతుంది. రాముని భక్తులు ఓర్పు, పట్టుదలను ప్రదర్శించారు. నేడు అయోధ్య తాను కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందడంతో యావత్ జాతి సంతోషిస్తోంది. ఈ సంకల్పాన్ని నెరవేర్చడానికి మార్గనిర్దేశం చేసినందుకు గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీజీకి హృదయపూర్వక అభినందనలు!

2024 జనవరి 22 వ్యక్తిగతంగా నాకు చాలా సంతోషకరమైన సందర్భం. నేను ఈ ప్రయాణం గురించి తలపోస్తున్నప్పుడు, రామ జన్మభూమిని విముక్తం చేయాలన్న అచంచలమైన సంకల్ప క్షణాలు నా మనస్సును ముంచెత్తుతున్నాయి. ఈ సంకల్పమే నన్ను గౌరవనీయులైన గురుదేవ్ మహంత్ వైద్యనాథ్ జీ మహారాజ్ సద్గుణ సాంగత్యంలోకి నడిపించింది. విగ్రహ ప్రతిష్ఠాపన శుభ సందర్భంలో మా తాత బ్రహ్మలీన్ మహంత్ శ్రీ దిగ్విజయ్‌నాథ్ జీ మహారాజ్, గౌరవనీయులైన గురుదేవ్ బ్రహ్మలీన్ మహంత్ శ్రీ వైద్యనాథ్ జీ మహారాజ్‌తో పాటు ఇతర గౌరవనీయులైన సాధువులు భౌతికంగా లేరని నాకు తెలుసు. కానీ వారి ఆత్మలు కచ్చితంగా అపారమైన సంతృప్తిని అనుభవిస్తాయి. గౌరవనీయులైన నా గురువులు జీవితాంతం అంకితభావంతో చేసిన తీర్మానం నెరవేరడానికి సాక్షిగా నిలవడం నా అదృష్టం.

శ్రీ రామ జన్మభూమి ఆలయంలో శ్రీరామ్‌లల్లా ప్రతిష్ఠాపన గురించి ప్రకటించినప్పటి నుండి, ప్రతి సనాతన విశ్వాసిలో నిరీక్షణ స్పష్టంగా కనిపించింది. ఇటీవలి శతాబ్దాలలోనే అసమానమైన సామూహిక ఆనంద వాతావరణం దేశమంతటా వ్యాపించింది.

శైవ, వైష్ణవ, శాక్తేయ, గాణాపత్య, సిక్కు, బౌద్ధ, జైన, దశనామీ శంకర్, రామానంద, రామానుజ, నింబార్క, మధ్వ, విష్ణునామి, రామసనేహి, ఘీసాపంథ్, గరీబ్దాసి, అకాలీ, నిరంకారీ, గౌడీయ, కబీర్ పంథ్ వంటి విభిన్న ఆధ్యాత్మిక సంప్రదాయాలకు చెందిన వారు... అనేక సంఖ్యలో ఉన్న శాఖలు, ఆరాధన పద్ధతుల వారు... 150కి పైగా సంప్రదాయాలకు చెందిన సాధువులు... అటవీ – గిరి నివాసులు, గిరిజన సమూహాలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు... రాజకీయాలు, సైన్స్, పరిశ్రమలు, క్రీడలు, కళలు, సంస్కృతి, సాహిత్య రంగాలవారు అందరూ ఒకే గొడుగు కిందకు చేరడం నిజంగా అపూర్వమైనది, అరుదైనది. ఈ మహత్తరమైన సందర్భం ఎంతో గర్వకారణం. ఉత్తరప్రదేశ్‌లోని 25 కోట్ల మంది ప్రజల తరఫున పవిత్ర అయోధ్యధామంలో ఉన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమం తరువాత, అయోధ్యధామం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు, పర్యాటకులకు, పరిశోధకులకు, జిజ్ఞాసువులకు సాదర స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉంది. ప్రధాన మంత్రి దూరదృష్టితో కూడిన ప్రణాళికలకు అనుగుణంగా అయోధ్యాపురి కచ్చితమైన సన్నాహాలు చేస్తోంది. నగరం ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయం, విస్తరించిన రైల్వే స్టేషన్, అన్ని దిశల నుండి కలుస్తున్న 4–6 లేన్ రోడ్లతో బాగా అనుసంధానించబడిన నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. అదనంగా హెలిపోర్ట్ సేవ, సందర్శకుల విభిన్న అవసరాలను తీర్చడానికి అనుకూలమైన హోటళ్లు, అతిథి గృహాల శ్రేణి ఏర్పాటైనాయి.

కొత్త అయోధ్యలో, పురాతన సంస్కృతి, నాగరికత పరిరక్షణ జరుగుతూనే అత్యాధునిక నగర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తు అవసరాలను తీర్చడానికి తగినట్టుగా నిర్మాణం జరుగుతోంది. ఈ చొరవలో భాగంగా అయోధ్యలోని పంచకోసి, 14 కోసి, 84 కోసి పరిక్రమ పరిధిలోని మతపరమైన, పౌరాణిక. చారిత్రక ప్రదేశాలకు వేగవంతమైన పునరుజ్జీవనం కలిగించడం జరిగింది. ఈ సమష్టి ప్రయత్నాలు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు దోహదపడటమే కాకుండా పర్యాటకాన్ని పెంచడానికీ, ఈ ప్రాంతంలో కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడానికీ ఉపయోగపడతాయి.

శ్రీరామ జన్మభూమి ఆలయ స్థాపన ఒక లోతైన ఆధ్యాత్మిక వేడుకగా నిలుస్తుంది. ఇది భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి సూచిక. ఇది కేవలం ఒక దేవాలయం కాదు, ఇది జాతీయ దేవాలయం. శ్రీరామ్‌లలా పవిత్రోత్సవం యావత్ జాతి జనుల హృదయాన్ని గర్వంతో ఉప్పొంగించే ఒక ముఖ్యమైన సందర్భం. రాముడి దయతో, అయోధ్య సంప్రదాయ పరిక్రమ పవిత్రత ఇప్పుడు సురక్షితంగా ఉంటుంది. ఎటువంటి ఆటంకాలూ దాని పవిత్ర మార్గాన్ని నాశనం చేయలేవు. అయోధ్య వీధులలో ఇక బుల్లెట్లు ప్రతిధ్వనించవు, సరయూ నది రక్తపు మరకను భరించదు, కర్ఫ్యూ విధ్వంసం జరగదు. బదులుగా ఆనందోత్సవ వేడుకలు జరుపుకొంటూ, రామనామ సంకీర్తనలతో ప్రతిధ్వనిస్తుంది.

అవధ్‌పురిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ భారతదేశంలో రామరాజ్య స్థాపన తాలూకు ప్రకటనను తెలియజేస్తుంది. ఇది ఆదర్శానికి స్వరూపం. ఇక్కడ 'సబ్ నర్ కరహి పరస్పర ప్రీతి చలహి స్వధర్మం నిరత శ్రుతి నీతి' అవుతుంది. శ్రీ రామ జన్మభూమి ఆలయంలో ప్రతిష్ఠించనున్న బాలరూప రాముని విగ్రహం మార్గదర్శక కాంతిగా పనిచేస్తుంది. ప్రతి సనాతన విశ్వాసి తన మతపరమైన సూత్రాలను అనుసరించడానికి మార్గం సుగమం చేస్తుంది. ఈ శుభ సందర్భంగా 140 కోట్ల మంది తోటి పౌరులకు అభినందనలు! మన పూర్వీకులు నెలకొల్పుతామని గంభీరంగా ప్రమాణం చేసిన ఆలయాన్ని నిర్మించాలనే నిబద్ధత నెరవేరడం చూసి మనం ఎనలేని సంతృప్తిని పొందుదాం. భగవంతుడు శ్రీరాముని ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ చల్లగా ఉండాలి.

**శ్రీ రామః శరణం మమ**
**జయ–జయ శ్రీసీతారామ్!**

వ్యాసకర్త ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి

## సోషల్ మీడియా



ఒక వేయి సంవత్సరాల తర్వాత, నా భవిష్యత్ తరాలు నేను చేసిందేమిటో గుర్తుంచుకోకపోవచ్చు, నేను రాసిందేమిటో చదవకపోవచ్చు, కానీ (అయోధ్య) ఆలయ పునర్నిర్మాణ సమయంలో నేను జీవించి ఉన్నానని మాత్రం వాళ్లు తప్పక గుర్తుంచుకుంటారు. అలా నాగరికత శాశ్వతత్వాన్ని ప్రసాదిస్తుంది.
– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త



మందిర ప్రారంభం ఎట్టకేలకు జరుగుతోంది. ఇది గొప్ప ఉత్సవ సందర్భం. అయితే... దయగా, ప్రేమగా వ్యవహరిస్తూ, కష్టపడి పనిచేస్తూ, పన్నులు చెల్లిస్తూ, అవినీతి మీద పోరాడుతూ, ద్వేషం, చెడులతో తలపడుతూ... రామ రాజ్య స్థాపన దిశగా ప్రతి భారతీయుడూ అడుగులు వేయాలని నేను కోరుతున్నాను.
– రాకీ సింగ్, షెఫ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

## కొమురవెల్లి.. భక్తజనం తరలివెళ్లి



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి (సిద్దిపేట): రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రమైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో ప్రారంభమయ్యే ఈ జాతర మూడు నెలలపాటు కొనసాగుతుంది. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందంగా అలంకరించిన బోనాలతో ఊరేగింపుగా వచ్చి స్వామికి నైవేద్యం సమర్పించారు. గుట్టపై వెలసిన రేణుక ఎల్లమ్మకు కూడా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు రావడంతో స్వామి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పట్టింది. సోమవారం హైదరాబాద్ వాసులు ఆలయ తోటబావి ప్రాంగణంలో నిర్వహించే అగ్నిగుండాలు, పెద్దపట్నం కార్యక్రమాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



## చిత్తారమ్మా.. పోటెత్తారమ్మా

మేడ్చల్ జిల్లా గాజులరామారంలో ఆదివారం జరిగిన చిత్తారమ్మ దేవి ప్రధాన జాతరకు భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి 3 లక్షల మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు.
– సుభాష్‌నగర్

## క్లుప్తంగా...

### ఫిబ్రవరి 19 నుంచి పాత గుట్ట బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిధిలోని పాతగుట్ట ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 19 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఫిబ్రవరి 19న స్వస్తివాచనం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణం, 20న ధ్వజారోహణ, హోమం, భేరీ పూజ, దేవతాహ్వానం, 21న సింహవాహన అలంకారసేవ, అశ్వవాహనసేవ, ఎదుర్కోలు మహోత్సవం, 22న తిరుమంజనం, హనుమంతవాహన సేవ, తిరుకల్యాణ మహోత్సవం, 23న గరుడవాహన సేవ, దివ్యవిమాన రథోత్సవం, 24న చక్రతీర్థం, 25న అష్టోత్తర శతఘటాభిషేకం తదితర సేవలు జరుగుతాయని వివరించారు. ఫిబ్రవరి 15 నుంచి 18వ తేదీ వరకు స్వామివారికి అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### యాదాద్రి ఆలయంలో భక్తుల రద్దీ



ప్రధానాలయంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు.. స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయ పరిసరాలు, మాడ వీధులు, క్యూలైన్లు, ప్రసాదం విక్రయశాల, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాల సమయంలో, మధ్యాహ్నం ఆరగింపు సమయంలో భక్తులు క్యూలైన్లల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్వామి వారిని 30 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారి ధర్మ దర్శనానికి 2 గంటల సమయం పట్టగా ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు వెల్లడించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.46,63,688 ఆదాయం వచ్చినట్లుగా అధికారులు తెలిపారు.

### ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మండిపాటు



హుజూరాబాద్: ఆరు గ్యారంటీలు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. హైకోర్టు నిర్మాణానికి యూనివర్సిటీ భూములను లాక్కుని సమీప భూముల ధరలను పెంచడం రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహించినట్లే అవుతుందని విమర్శించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని అంబేడ్కర్ చౌక్ వద్ద ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీ హామీలలో ఒక్క గ్యారంటీ కూడా పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని, కేవలం గత ప్రభుత్వాన్ని విమర్శించడమే తప్ప.. రాబోయే ఐదేళ్లలో ఏం చేస్తామో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చెప్పడం లేదన్నారు. గర్భగుడి నిర్మాణం పూర్తికాకున్నా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజల్లో సెంటిమెంటు రగిలించి గెలుపు కోసమే బీజేపీ రామ జపం చేస్తోందని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు.

### ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా చక్రవర్తుల శ్రీనివాస్



చక్రవర్తుల శ్రీనివాస్



గౌరీశంకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, తెలంగాణ రాష్ట్రం (ఎస్‌ఎల్‌టీఏ, టీఎస్) ఆదివారం హైదరాబాద్‌లో సమావేశమై కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కర్రెం గౌరీశంకర్‌రావు ఎన్నికయ్యారు. సహాధ్యక్షుడిగా షేక్ హాజీ నూరానీ, సత్యనారాయణ కాంబ్లీ, కోశాధికారిగా జగదీశ్వర్, సంయుక్త కార్యదర్శిగా మరిపల్లి రమేశ్, గౌరవాధ్యక్షుడిగా చౌడవరం చంద్రమోహన్, పెండ్యాల బ్రహ్మయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో 33 జిల్లాల సంఘ బాధ్యులు హాజరయ్యారు.

### గట్టుకిందిపల్లి గుట్టలపై డోల్మన్ సమాధులు

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గట్టుకిందిపల్లి గుట్టలపై డోల్మన్ సమాధులను గుర్తించినట్లు ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, ఎకో ట్రావెలర్ ప్రతాప్ తెలిపారు. క్షేత్ర పర్యటనలో వెలుగు చూసిన ఆనవాళ్ల గురించి ఆయన ఆదివారం వెల్లడించారు. గట్టుకిందిపల్లి రెండు గుట్టల్లో రెండు డోల్మన్ సమాధులు, గుట్ట దిగువ భాగంలో రాక్షస గూళ్లు ఉన్నట్లు చెప్పారు. హనుమకొండకు చెందిన జిల్లా పురావస్తు చరిత్ర వ్యాసకర్త, పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి డోల్మన్ సమాధులు 3వేల ఏళ్ల క్రితం నాటివని చెప్పినట్లు పేర్కొన్నారు. బృహత్ శిలాయుగానికి చెందిన మరణించిన ఆదిమ మానవులకు గుర్తుగా ఇలాంటి నిర్మాణాలు చేశారని తెలిపారు.

# ఒకే ఆధార్, పాన్‌కార్డు.. పాస్‌పోర్టులెన్నో

- ఈ కోణంలో దర్యాప్తుతో చిక్కిన ముఠా
- కోరుట్ల చిరునామాలతో రోహింగ్యాలకు పాస్‌పోర్టులు
- గుట్టుచప్పుడు కాకుండా దుబాయ్, కెనడా, యూరోప్‌లకు తరలింపు
- సీఐడీ విచారణలో వెలుగుచూస్తున్న వాస్తవాలు



కోరుట్లలో తనిఖీల కోసం వచ్చిన సీఐడీ అధికారుల వాహనాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కోరుట్ల: తీగ లాగితే పాస్‌పోర్టుల డొంకంతా కదులుతోంది. జగిత్యాల జిల్లా కోరుట్లతోపాటు కరీంనగర్, వేములవాడ, సిరిసిల్లలోనే ఈ రాకెట్‌కు ప్రధాన ఏజెంట్లు ఉన్నారు. ఇక్కడి చిరునామాలతో పలువురు రోహింగ్యాలు విదేశాలకు వెళ్లారన్న విషయాన్ని గుర్తించిన సీఐడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో వారికి పలు నిర్ఘాంతపోయే విషయాలు తెలుస్తున్నాయి. స్థానికులు, విదేశీయులు అన్న తేడా లేకుండా.. ఎవరికి పాస్‌పోర్టులు కావాలన్నా.. కేవలం కొన్నిరోజుల్లోనే వచ్చేలా చేయడంలో వీరిది అందెవేసిన చేయి. ఇప్పటివరకూ 92 మందిని దేశం దాటించగలిగారు. ఇలా వెళ్లిన వారిలో విదేశీయులు ఉండటంతో విషయాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. పైగా ఈ దందాకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సహకరించారన్న విషయాన్నీ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు.

**నాంపల్లి టు జగిత్యాల**

ఈ రాకెట్‌కు నాంపల్లికి చెందిన అబ్దుల్ సత్తార్ ఒస్మాన్ అల్ జవహరీ ప్రధాన సూత్రధారి. ఇతను నాంపల్లిలోని బడే మజీదు వద్ద నివసించే ఇతను డీటీపీ గ్రాఫిక్స్‌లో సిద్ధహస్తుడు. ఈ పనితోపాటు పాస్‌పోర్టు బ్రోకర్‌గాను పనిచేసేవాడు. నకిలీ విద్యార్హతలు, ఆధార్, పాన్‌కార్డు ఇలా కీలక నకిలీ డాక్యుమెంట్లు తయారు చేస్తూ గల్ఫ్ ఏజెంట్ల సర్కిల్‌లో బాగా పాపులర్ అయ్యాడు. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల్లోని బ్రోకర్లకు పాస్‌పోర్ట్‌లకు కావాల్సిన సర్టిఫికెట్లు సమకూర్చేవాడు. ఈ గ్యాంగ్ వద్ద దగ్గర దొరకని పత్రం అంటూ ఏదీ ఉండదు. విద్యార్హత, ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్ ఏది కావాలన్నా నిమిషాల్లో రెడీ చేస్తాడు. కొందరు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు కూడా వీరికి సహకరించడంతో వీరి పని మరింత సులువై, పాస్‌పోర్టులు ఇప్పించి విదేశీయులను భారతీయులుగా దేశం దాటించగలిగారు. వీరు ఇప్పించిన పాస్‌పోర్టుల్లో అత్యధిక పాస్‌పోర్టులకు ఒకే ఆధార్, ఒకే ఫోన్ నంబరు ఉండటంతో విషయం వెలుగుచూసింది.

**ఈసీఎన్ఆర్ కేటగిరీలోనే..**

ఇమిగ్రేషన్‌లో దొరికిపోకుండా తనిఖీలు అవసరం లేని ఈసీఎన్ఆర్ (ఇమిగ్రేషన్ చెక్ నాట్ రిక్వైర్డ్) కేటగిరీలోనే పాస్‌పోర్టులు ఇప్పించారు. ఇందుకు వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. చాలా పాస్‌పోర్టులకు ఒకే ఆధార్ కార్డు ఉండటం, కష్టమర్లందరికీ ఏజెంట్లు తమ ఫోన్ నంబరునే అటాచ్ చేసి ఉంచడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా సోదాలు చేసిన సీఐడీ అధికారులు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న 12 మంది నిందితులను అరెస్టు చేసి, ఫారినర్స్ యాక్ట్ 1946, పాస్‌పోర్ట్ యాక్ట్‌తోపాటు పలు సెక్షన్ల కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లా నుంచి ఏజెంట్లు**

రాకెట్ సూత్రధారి అబ్దుల్ సత్తార్ తన నెట్‌వర్క్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాడు. అబ్దుల్ సత్తార్ ఉస్మాన్ అల్ జవహరీ నాంపల్లి (హైదరాబాద్)కి చెందినవాడు కాగా.. మిగిలిన మహ్మద్ ఖమ్రుద్దీన్, చాంద్‌ఖాన్, దేశోపంతుల అశోక్ రావు (కోరుట్ల), పెద్దూరి శ్రీనివాస్ (తిమ్మాపూర్, కరీంనగర్), గుండేటి ప్రభాకర్ (జగిత్యాల), పోచంపల్లి దేవరాజ్ (వేములవాడ, సిరిసిల్ల), అబ్దుల్ షుకూర్ (రాయికల్, జగిత్యాల). వీరంతా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం. వీరంతా కలిసి ఎంతమందికి నకిలీ సర్టిఫికెట్లు ఇప్పించారు..? ఎంతమంది విదేశీయులకు పాస్‌పోర్టులు ఇప్పించారు..? అన్న విషయంపై సీఐడీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇక్కడి చిరునామాలతో పలువురు కెనడా, మలేసియా, దుబాయ్, గల్ఫ్ దేశాలు, స్పెయిన్, ఫ్రాన్స్, థాయ్‌లాండ్, ఇరాక్ తదితర దేశాలకు వెళ్లినట్టు గుర్తించారు. వారంతా అక్కడ ఏం చేస్తున్నారు..? ఏ కంపెనీలో పనిచేస్తున్నారు..? అన్న విషయాన్ని కనిపెట్టే పనిలో నిమగ్నమయ్యారు.

**పదేళ్ల తర్వాత మళ్లీ...**

2014లోనే డబుల్ పాస్‌పోర్ట్‌లు, వాటికి అవసరమైన నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారు చేస్తున్నారన్న ఆరోపణలతో కోరుట్లకు చెందిన ఖమరోద్దీన్, అశోక్‌రావు, చాంద్‌పాషాపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత కొంతకాలం ఇక్కడ ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. శుక్రవారం సీఐడీ అధికారుల దాడులతో వీరంతా పాస్‌పోర్ట్ దందా ఆపలేదని రుజువైంది.

## మేడారానికి పోటెత్తిన భక్తులు



సమ్మక్క గద్దె వద్ద కిక్కిరిసిన భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధి మేడారం శ్రీసమ్మక్క– సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవురోజు కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జనం తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో క్యూలైన్ల ద్వారానే గద్దెల వద్దకు పంపించారు. గ్రిల్స్ బయట నుంచే భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు లక్ష మందికిపైగా జనం వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.

## ఆ చైర్మన్లను ఉంచుతారా..దింపుతారా ?

- 'మార్క్‌ఫెడ్, టెస్కాబ్'లలో అవిశ్వాసానికి పావులు కదుపుతున్న సభ్యులు
- ఇద్దరూ బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్లు కావడంతో సభ్యుల్లో సంతృప్తి

సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్, టెస్కాబ్ చైర్మన్లను అవిశ్వాసం ద్వారా పదవిలో నుంచి దింపేందుకు కొందరు సభ్యులు రెడీ అవుతున్నారు. గత ప్రభుత్వంలో నామినేట్ అయిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లను కాంగ్రెస్ సర్కారు తొలగించిన సంగతి విదితమే. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా మార గంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్‌గా కొండూరు రవీందర్‌రావులు కొనసాగుతున్నారు. వీరు ఎన్నిక ద్వారా చైర్మన్లు కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో అవిశ్వాసం ద్వారా వీరిని తొలగించాలని కొందరు సభ్యులు ఆ మేరకు పావులు కదుపుతున్నట్టు సమాచారం. పైగా కొత్త ప్రభుత్వం తోనూ వీరు అంత సఖ్యతగా ఉండటం లేదన్న చర్చ జరుగుతోంది. పైగా ఈ ఇద్దరు చైర్మన్లు కూడా బీఆర్ఎస్ పార్టీలో చురుగ్గా పనిచేశారు. పైగా వీరిని కొన్ని సమావేశాలకు కూడా పిలవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్‌కు మధ్య యూరియా విషయంలో సమన్వయం కొరవడిందన్న విమర్శలు వచ్చాయి. ఇలా వివిధ విషయాల్లో ప్రభుత్వానికి, చైర్మన్లకు మధ్య కొంత దూరం పెరిగిందన్న చర్చ జరుగుతోంది.

**నాడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ తొలగింపు:** మార్క్‌ఫెడ్‌లో ఏడుగురు డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో ఒకరిని చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. డైరెక్టర్లు కూడా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) నుంచి ఎన్నికైనవారే. ఎన్నికైన మార్క్‌ఫెడ్ పాలకమండలి కాలపరిమితి మరో ఏడాదికి అటుఇటుగా ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పరిస్థితి మారింది. పైగా గతంలో మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్‌గా ఉన్న బి.రాజశేఖర్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారన్న కారణంతో అవిశ్వాసం పెట్టి మరీ ఆయన్ను ఆ పదవిలోంచి తొలగించారు. దీంతో ఆయన ఇప్పుడు సాధారణ డైరెక్టర్‌గానే కొనసాగుతున్నారు. పైగా రాజశేఖర్ కాంగ్రెస్‌లోనే ఉండటం, ఆ పార్టీ అధికారంలో కొనసాగుతుండటంతో ఇప్పుడు పరిస్థితి మారే అవకాశాలున్నాయి. మెజారిటీ డైరెక్టర్లు ఇప్పుడు మారితే ప్రస్తుత చైర్మన్‌ను అవిశ్వాసం ద్వారా దింపాచ్చన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆ మేరకు మార్క్‌ఫెడ్ పాలకమండలిలో ముసలం పుట్టిందన్న వార్తలు వినవస్తున్నాయి. ఇక టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు కూడా డీసీసీబీ అధ్యక్షుల ద్వారా ఎన్నికయ్యారు. 9 డీసీసీబీ అధ్యక్షులే టెస్కాబ్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. అలా రవీందర్‌రావు ఎన్నికయ్యారు. ఆయన పదవీ కాలం కూడా ఏడాది వరకు ఉంది. అంతేగాక రవీందర్‌రావు బీఆర్ఎస్‌లో కీలకమైన నేతగా పనిచేశారు. ఈ నేపథ్యంలో డీసీసీబీ అధ్యక్షుల్లో కొందరు కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టు సమాచారం. తద్వారా అవిశ్వాసం పెట్టే పరిస్థితులు కూడా ఉన్నాయంటున్నారు. అవిశ్వాసం పెట్టాలంటే ముందస్తుగా సభ్యులు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందని, ఆ తర్వాత నిబంధనల ప్రకారం అవిశ్వాసానికి అనుమతి ఇస్తామని సంబంధితవర్గాలు వెల్లడించాయి.

## ఇజ్రాయెల్ వీసాల పేరుతో దందా

- భారీగా వసూళ్లకు పాల్పడుతున్న ఏజెంట్లు
- ఇజ్రాయెల్ ఉచితంగా ఇచ్చే వీసాలకు రూ.8 లక్షల దాకా వసూళ్లు
- మోసపోతున్న అమాయక యువత

మోర్తాడ్ (బాల్కొండ): పాలస్తీనా ఉగ్రవాదుల దాడులతో భవనాలు ధ్వంసం కావడం, నిర్మాణ రంగంలో కార్మికుల కొరతను అధిగమించేందుకు ఇజ్రాయెల్ దేశం భారత కార్మికులకు స్వాగతం పలుకుతోంది. అయితే దీనిని అవకాశంగా తీసుకున్న కొందరు దళారులు, ఏజెంట్లు ఇజ్రాయెల్ వీసాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను నిండా ముంచుతున్నారు. ఒక్కో వలస కార్మికుని నుంచి రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు వీసాల కోసం వసూళ్లకు పాల్పడుతున్నారు. భారత విదేశాంగ శాఖతో ఇజ్రాయెల్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు ఆ దేశం ఉచితంగానే భారత వలస కార్మికులకు వీసాలను జారీ చేస్తోంది. 12 కన్సల్టెన్సీల ద్వారా వలస కార్మికులను నియమించుకోవడానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు 1.60 లక్షల మంది భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పిస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. భవన నిర్మాణ రంగంలో ఫ్రేమ్ వర్క్, షట్టరింగ్ కార్పెంటర్, ఐరన్ బెండింగ్, సెరామిక్ టైల్, ప్లాస్టరింగ్ పనులు చేయడానికి వలస కార్మికులు అవసరం అని ఇజ్రాయిల్ వెల్లడించింది. కాగా, తెలంగాణనుంచి కార్మికులను ఆ దేశానికి పంపించడానికి టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్), న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) సంస్థల ద్వారా రిక్రూట్‌మెంట్ కోసం అవగాహన, శిక్షణ కల్పిస్తున్నారు. ఈ రెండు సంస్థలు గుర్తింపు పొందినప్పటికీ వలస కార్మికుల టామ్‌కామ్, న్యాక్ నిర్వహించే అవగాహన సమావేశాలకు నామమాత్రంగానే హాజరు అవుతున్నారు.

**నమ్మించి దోపిడీ..**

ఇదిలా ఉండగా ప్రభుత్వరంగ సంస్థల ద్వారా రిక్రూట్‌మెంట్ జరిగితే తమ ఆదాయం దెబ్బతింటుందని కొందరు దళారులు పరిచయస్తుల ద్వారా గ్రామాల్లో తిరుగుతున్నారు. గల్ఫ్ దేశాల కంటే ఇజ్రాయెల్‌లో పనిచేస్తే ఎక్కువ వేతనం పొందవచ్చని వలస కార్మికులను నమ్మిస్తూ.. ఏజెంట్లు ఒరిజినల్ పాస్‌పోర్టులు తీసుకుని, డబ్బులను ముందుగానే వసూలు చేసుకుంటున్నారు. ముంబై, ఢిల్లీ, చెన్నైలలో మెడికల్ టెస్టులు చేయించడంతో పాటు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామని కార్మికులను నమ్మించి ఆయా ప్రాంతాలకు తరలిస్తున్నారు. వైద్య పరీక్షల కోసం అదనంగా రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇజ్రాయెల్ ఇప్పటికే నేపాల్, శ్రీలంక వలస కార్మికులకు ఉచిత వీసాలను జారీ చేసి రిక్రూట్‌మెంట్ నిర్వహించింది. భారత్‌లోనే ప్రక్రియ కొంత ఆలస్యంగా మొదలైంది. ఇప్పటి వరకు వలస కార్మికులను ఇజ్రాయెల్ పంపించకున్నా వారి నుంచి పాస్‌పోర్టులు, డబ్బులు తీసుకుని దళారులు దర్జాగా తిరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇలాంటి దళారుల ఆటకట్టించాలని పలువురు కోరుతున్నారు.

## మెస్రం వంశీయుల మహాపాదయాత్ర

- వచ్చే నెల 9న నాగోబా జాతర

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా గంగాజలం సేకరణ కోసం మెస్రం వంశీయుల మహా పాదయాత్ర ప్రారంభమైంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన మెస్రం వంశీయులు ఆదివారం నాగోబా ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. అనంతరం యాత్ర ప్రారంభించారు. తొలిరోజు ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాగూడకు చేరుకొని అక్కడే బస చేశారు. యాత్రలో భాగంగా ఈ నెల 28న మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరి నది హస్తిన మడుగుకు చేరుకుంటారు. అక్కడ పవిత్ర గంగాజలం సేకరించనున్నట్లు మెస్రం వంశ పటేల్ వెంకట్‌రావ్ తెలిపారు. అదే రోజు తిరుగు ప్రయాణమై ఫిబ్రవరి 5న ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుంటారు. అదేరోజు సాయంత్రం కేస్లాపూర్ సమీపంలో మర్రిచెట్టు (వడమర) వద్ద బస చేసి మూడు రోజులపాటు అక్కడే పూజలు చేస్తారు. 9న రాత్రి 10:30 గంటలకు గంగా జలంతో మహాపూజ నిర్వహించి నాగోబా జాతర ప్రారంభించనున్నట్లు పటేల్ తెలిపారు.



పవిత్ర గంగా జలం సేకరణకు కాలినడకన వెళ్తున్న మెస్రం వంశీయులు

## కంటైనర్ ఢీకొని తల్లీ, కొడుకు మృతి

- మోటార్‌బైక్‌పై నుంచి దూసుకెళ్లిన కంటైనర్ లారీ
- ప్రమాదంలో తండ్రికి తీవ్ర గాయాలు
- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన



సహెరాభాను



ఆసిఫ్

ఆసిఫాబాద్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ రహదారి నెత్తురోడింది. జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాగజ్‌నగర్ మండలం బట్టుపెల్లికి చెందిన తల్లి, కొడుకు సహెరాభాను(35), షేక్ ఆసిఫ్(16) దుర్మరణం చెందారు. తండ్రి సర్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. సర్వర్ తన భార్య, కుమారుడితో కలసి శనివారం ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం మోటార్‌సైకిల్‌పై తిరిగి బట్టుపెల్లికి బయల్దేరారు. జాతీయ రహదారి ఎగ్జిట్ రోడ్డు వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఓ కంటైనర్ లారీ.. సర్వర్ మోటార్‌సైకిల్‌పై నుంచి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో కంటైనర్ వెనక టైర్ కిందికి వచ్చిన తల్లి, కొడుకులు అక్కడికక్కడే మృతిచెందారు. సర్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, బైక్‌పై నుంచి దూసుకెళ్లిన కంటయినర్ లారీ ఎదురుగా వస్తున్న మరో లారీని కూడా ఢీకొట్టింది. దీంతో ఆ లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నేషనల్ హైవేకు చెందిన 1033 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృత దేహాలను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సైలు మహేందర్, ప్రవీణ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

**ఎగ్జిట్ దారి మూసివేయాలని ధర్నా..**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రాజంపేట చెక్‌పోస్టు మీదుగా జాతీయ రహదారికి వెళ్లే మార్గాన్ని మూసివేయాలని స్థానికులు ప్రమాదస్థలం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని గుండి రహదారి.. ఆపై సర్వీస్ రోడ్డు మీదుగా జాతీయ రహదారిపైకి వాహనాలు వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానము**
**బల్కంపేట, హైదరాబాద్-500038**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డు టెండర్ల వేలం ప్రకటన**

టెండర్ నోటీస్ నెం.05/ఎస్.వై.పి.డి/2024 తేది: 20-01-2024

దేవాలయములో దిగువ కనబరచిన లైసెన్సు మరియు సరఫరా హక్కుల నిమిత్తం 2024-2025 ఆర్థిక సంవత్సరము కొరకు అనుభవము గల ఫర్మ్‌ల నుండి విభాగం-ఎ ఎక్కువ మొత్తం మరియు విభాగం-బి తక్కువ మొత్తంలో కోట్ చేయు టెండరుదారుల నుండి టెండర్లను కోరడమైనది.

విభాగం-ఎ

1. భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు సేకరించుకొను హక్కు, 2. భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యం & కుడుకలు సేకరించుకొను హక్కు, 3. కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు, 4. బోనాల కాంప్లెక్స్ నందు టెంట్‌హౌస్ సామాగ్రి సప్లయి చేయు హక్కు, 5. భక్తులు అమ్మవారికి సమర్పించిన తల నీలాలు సేకరించుకొను హక్కు, 6. శ్రీ ఎల్లమ్మ అమ్మవారి క్యాలెండర్లు మరియు డైరీలు అమ్ముకొను హక్కు.

విభాగం-బి

1. ప్రొవిజన్స్ మరియు పూజా సామాగ్రి సప్లయి చేయు హక్కు, 2. బోనాల కాంప్లెక్స్, కళ్యాణ మండపము మరియు బాత్‌రూముల నందు నిరంతర పారిశుధ్య పనుల నిర్వాహణ, 3. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కొరకు, 4. సెక్యూరిటీ సర్వీసెస్ ఏర్పాటు లైసెన్స్ హక్కు, 5. అర్జిత సేవ పుస్తకములు క్యాలెండర్ వాల్‌పోస్టర్, కరపత్రములు & ఆహ్వాన పత్రికలు ముద్రణ & సప్లయి, 6. పర్వదినములలో (సంవత్సర పండుగలకు) ఫ్లవర్ డెకరేషన్ చేయు హక్కు, 7. శ్రీదేవి దసరా శరన్నవరాత్రులలో పూల అలంకరణ చేయు హక్కు, 8. శ్రీ ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణము స్టేజీ ఏర్పాటుచేయు హక్కు, 9. శ్రీ ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణం సందర్భముగా పూల అలంకరణ చేయు హక్కు, 10. శ్రీ ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణం సందర్భముగా విద్యుత్తు అలంకరణ చేయు హక్కు, 11. నిత్యపూజలకు పూలదండల సప్లయి, 12. విద్యుత్ అలంకరణలు చేయు హక్కు, 13. కూరగాయలు సప్లయి, 14. పాలు, పెరుగు సప్లయి, 15. అరటి కొమ్మలు, మామిడాకులు, కొబ్బరి మట్టలు, విస్తర్లు మరియు కొబ్బరి మట్టలు, విస్తర్లు మరియు దొప్పలు సప్లయి చేయు హక్కు, 16. దేవస్థానము, బోనాల కాంప్లెక్స్ నందు సి.సి. కెమెరాలు, కియోస్క్‌మిషన్ & హెడ్ కౌంటింగ్ నిర్వహణ హక్కు, 17. దేవాలయము పేరుతో కండువాలు సప్లయి చేయు హక్కు, 18. దేవాలయమునకు అవసరమగు పట్టు వస్త్రములు, పట్టు చీరలు దోతులు, శాలువాలు, సిబ్బంది యూనిఫారమ్ సప్లయి చేయు హక్కు, 19. రక్షాకంకణములు సప్లయి చేయు హక్కు, 20. దేవస్థానమునకు అవసరమగు రాగి ప్రతిమలు మరియు వెండి ప్రతిమలు సప్లయి చేయు హక్కు, 21. బతుకమ్మ పండుగ రోజున బతుకమ్మలు సప్లయి మరియు స్టేజి ఏర్పాటు చేయు హక్కు, 22. వి.ఐ.పి కాంప్లెక్స్ నందు నిరంతర పారిశుధ్య పనుల నిర్వాహణ చేయు హక్కు.

పైన తెలిపిన అన్ని టెండర్లు ప్రారంభ తేది: 22-01-2024 ఉదయం 11:00 గంటల నుండి తేది: 05-02-2024 ఉదయం గం॥ 11:00 ల వరకు టెండర్లలో పాల్గొనవచ్చును. తదుపరి సాంకేతిక టెండర్లు విప్పు తేది: 05-02-2024 మ॥ 12:00 గంటలకు మరియు ప్రైస్ బిడ్ విప్పు తేది: 05-02-2024 మ॥ 02:00 గంటలకు నిర్వహించబడును.

నోట్ : సరైన కారణములు తెలుపకనే టెండర్లు రద్దు చేయుటకు గాని వాయిదా వేయుటకు గాని కార్యనిర్వహణాధికారి గారికి పూర్తి అధికారం కలదు. ఇతర వివరముల కొరకు దేవస్థానము కార్యాలయము నందు కాని ఫోన్ 9491000696, 9676889028 కు ఫోన్ చేసి సమాచారము తెలుసుకొనగలరు.

సదా శ్రీ అమ్మవారి సేవలో...

ఫౌండర్ ఫ్యామిలీ మెంబరు & చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

సం/- సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

DIPR RO No.9605-PP/CL/ADVT/1/2023-24, Dt: 20-01-2024

# శ్రీరామ రామ రామేతి!

## అయోధ్యలో నేడు కొలువుదీరనున్న బాలరాముడు


ఆదివారం పుష్పాలంకరణతో మెరిసిపోతున్న అయోధ్య రామాలయం

### వేదమంత్రాల నడుమ రామ్‌లల్లాకు ప్రాణప్రతిష్ట

- మధ్యాహ్నం అభిజిత్ ముహూర్తంలో కార్యక్రమం
- ఉత్సవానికి ప్రధాన యజమానిగా ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రాణప్రతిష్ట అనంతరం ప్రముఖులకు బాలరాముని దర్శనం

శుభ ఘడియలు సమీపించాయి. అయోధ్య రామయ్య ప్రాణప్రతిష్ట వైభవోజ్వల చరిత్రాత్మక ఘట్టానికి సమయం ఆసన్నమైంది. ఐదు శతాబ్దాల వనవాసం వీడి, భవ్య మందిరానికి చేరుకున్న రాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమం మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. ఈ కమనీయ వేడుకను కనులారా తిలకించడానికి ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. దేశ విదేశాల్లో రామనామ స్మరణతో భక్తులు ఆనంద డోలికల్లో ఊగిపోతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా 7 వేల మందికిపైగా అతిథులు, ప్రముఖులు హాజరుకాబోతున్నారు. 150 మందికిపైగా ప్రముఖులు ఇప్పటికే అయోధ్యలో అడుగుపెట్టారు. సామాన్య భక్తజనం అయోధ్య బాటపట్టారు. కాషాయ పతాకాల రెపరెపలు, రాముడి గీతాలు, భజనలు, స్తోత్రాలు, జైశ్రీరామ్ నినాదాలతో, అందంగా తీర్చిదిద్దిన ప్రధాన భవ్య మందిరంతోపాటు ఇతర ఆలయాలతో అయోధ్య అంతటా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. నగరం ఇప్పటికే జనసంద్రంగా మారింది. భక్తుల పూజలు, వేదమంత్రాల ఘోషతో సరయూ నదీ తీరం కనువిందు చేస్తోంది. నగరంలోని చరిత్రాత్మక కట్టడాలను సైతం సుందరంగా అలంకరించారు. దేశమంతా అయోధ్య నామస్మరణతో సర్వం రామమయంగా మారిపోయింది. – సాక్షి, న్యూఢిల్లీ

### అద్భుత వాయిద్యాలతో మంగళ ధ్వని

ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి సోమవారం ఉదయం 10 గంటలకు 'మంగళ ధ్వని'తో శ్రీకారం చుడతారు. ఇందుకు దాదాపు 20 రాష్ట్రాల నుంచి 50కి పైగా అద్భుతమైన వాయిద్యాలను తీసుకొచ్చారు. అయోధ్యకు చెందిన యతీంద్ర మిశ్రా సారథ్యంలో నిర్వహించే ఈ సంగీత ప్రదర్శనకు ఢిల్లీకి చెందిన సంగీత నాటక అకాడమీ సహకారం అందించనుంది.

### టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం

రామమందిర ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం ఏడింటి నుంచే ప్రసారాలు మొదలవు తాయి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రధాన వేడుక జరుగుతుంది. వీటిని డీడీ న్యూస్, డీడీ జాతీయ చానళ్లతోపాటు ప్రైవేట్ చానళ్లలోనూ తిలకించవచ్చు.

### 84 సెకన్ల శుభ ముహూర్తం

గర్భగుడిలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్టకు శుభ ముహూర్తం నిర్ణయించారు. సోమవారం మధ్యాహ్నం సరిగ్గా 12.20 గంటలకు వేడుక ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12:29:08 గంటల నుంచి 12:30:32 గంటల వరకు మొత్తం 84 సెకన్లలో ప్రాణప్రతిష్ట పూర్తవుతుంది. గణేశ్వర్ శాస్త్రి ద్రవిడ్ నేతృత్వంలో కాశీకి చెందిన లక్ష్మీకాంత్ దీక్షిత్ ప్రధాన ఆచార్యులుగా 121 మంది రుత్విక్కులు వేడుక నిర్వహిస్తారు. ప్రాణ ప్రతిష్టలో శైవ, వైష్ణవ, శాక్త, గాణాపత్య, సిక్కు, బౌద్ధ, జైన, దశనామీ శంకర్, రామానంద, రామానుజ, నింబార్క, మధ్వ, విష్ణు నామి, వాల్మీకి, వీర శైవ మొదలైన సంప్రదాయాలు భాగం కానున్నాయి. 150 మందికిపైగా సంప్రదాయాల సాధువులు, మహామండలేశ్వర్, మహంత్, నాగాలతో సహా 50 మందికి పైగా గిరిజన, గిరివాస, ద్వీపవాస సంప్రదాయాల ప్రముఖులు పాల్గొంటారు. ఇలా పర్వతాలు, అడవులు, తీర, ద్వీప వంటి అన్ని ప్రాంతాలకు వారు ఒకే కార్యక్రమంలో పాల్గొంటుండడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు తెలియజేసింది.

### నగర వీధుల్లో తోరణాలు కాషాయ జెండాలు

అయోధ్య వీధులు కాషాయ రంగు పులుముకున్నాయి. నగరంలో అన్ని వీధులను కాషాయ జెండా, తోరణాలతోపాటు విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. నివాస భవనాలు, వ్యాపార సంస్థలు, హోటళ్లు, దుకాణాలపైనా పెద్ద సంఖ్యలో జెండాలు దర్శనమిస్తున్నాయి. దుకాణాల్లో వీటి అమ్మకాలు విరివిగా సాగుతున్నాయి. శ్రీరాముడు, హనుమంతుడు, నూతన రామాలయ చిత్రాలు, జైశ్రీరామ్ నినాదంతో కూడిన ఈ జెండాలు, తోరణాలు చూపరులకు ఆధ్యాత్మిక భావనలు పంచుతున్నాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలతోపాటు దాతలు శ్రీరాముడి జెండాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. అయోధ్యలోని రామ్‌పథ్, ధర్మపథ్‌ను జెండాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



అయోధ్యలో రామ చరిత మానస్, రామాయణం పుస్తకాల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. వీధుల్లో శ్రీరాముడి పాటలు మార్మోగుతున్నాయి.

### ప్రపంచవ్యాప్తంగా రామయ్య పండుగ

శ్రీరాముడి ప్రాణప్రతిష్ట వేడుక కేవలం అయోధ్యకే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఈ ఉత్సవంలో పాలుపంచుకోబోతున్నారు. సోమవారం ర్యాలీలు, ప్రదర్శనలు, పాదయాత్రలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. అమెరికాలో దాదాపు 300 ప్రాంతాల్లో ప్రాణప్రతిష్టను ప్రత్యక్ష ప్రసారం చేయబోతున్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్ వద్ద కూడా స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. పారిస్‌లో హిందూ సమాజం ఆధ్వర్యంలో భారీ రథయాత్ర నిర్వహించనున్నారు. అలాగే విశ్వ కల్యాణ యజ్ఞం నిర్వహిస్తారు. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, మారిషస్ సహా 60కిపైగా దేశాల్లో వేడుకలు జరుగుతాయి. ఆయా దేశాల్లోని హిందూ ఆలయాల్లో సాయంత్రం దీపాలు వెలిగించబోతున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇప్పటికే విద్యుత్ దీపాలు, పూలతో ఆలయాలను అందంగా అలకరించారు. అలాగే రామాయణ పారాయణం కోసం ఏర్పాట్లు చేశారు.

### నేటితో ముగియనున్న ప్రత్యేక క్రతువులు

ప్రత్యేక క్రతువుల్లో భాగంగా ఆదివారం ఔషధ జలంతోపాటు దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాల తెచ్చిన పవిత్ర జలాలతో రామ్‌లల్లాను శుద్ధి చేశారు. రాత్రి జాగరణ అధివస్ జరిపారు. 16న మొదలైన క్రతువులు సోమవారం ముగుస్తాయి.

### మూడు నిత్య హారతులు

ప్రాణప్రతిష్ట అనంతరం భక్తులకు రామ్‌లల్లా దర్శనం కల్పించడానికి ఆలయాన్ని ఉదయం 7 గంటల నుండి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంచనున్నారు. నిత్యం మూడుసార్లు ప్రత్యేక హారతి నిర్వహిస్తారు. ఉదయం 6.30 గంటలకు జాగరణ్ హారతి, మధ్యాహ్నం 12.00 గంటలకు భోగ్ హారతి, రాత్రి 7.30 గంటలకు సంధ్యా హారతి ఇవ్వనున్నారు.


ఆదివారం రాత్రి సరయూ నదీ తీరాన హారతి ఇస్తున్న పూజారులు

### 10 లక్షల ప్రమిదల కాంతులు

అయోధ్య నగరం సోమవారం సాయంత్రం దేదీప్యమానంగా వెలిగిపోనుంది. రామ్‌లల్లా ప్రాణప్రతిష్టను పురస్కరించుకొని 10 లక్షలు ప్రమిదలను ఏకకాలంలో వెలిగించబోతున్నారు. నగరంలోని 100 ఆలయాలు, ప్రధాన ప్రాంతాల్లో ఈ దీపాలు వెలుగులు పంచబోతున్నాయి. ఈ దృశ్యాలు కనులకు పండుగే అనడంలో సందేహం లేదు. భవ్య రామమందిరంతోపాటు రామ్ కీ పైడీ, కనక్ భవన్, గుప్తార్ ఘాట్, సరయూ ఘాట్, లతా మంగేష్కర్ చౌక్, మణిరామ్ దాస్ చౌనీ తదితర ప్రాంతాల్లో ప్రమిదలు వెలిగిస్తారు. అంతేకాకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు అయోధ్య వాసులు తమ ఇళ్లల్లోనూ దీపాలు వెలిగించబోతున్నారు. దాంతో అయోధ్యాపురం కాంతిమయం కాబోతోంది.

### రామాలయ ఉపగ్రహ చిత్రాలు విడుదల

అయోధ్యలో నూతన రామాలయ ఉపగ్రహ చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆదివారం విడుదల చేసింది. ఇండియన్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ అంతరిక్షం నుంచి గత ఏడాది డిసెంబర్ 16న ఈ దృశ్యాన్ని చిత్రీకరించింది. ప్రధాన ఆలయంతోపాటు దశరథ మహల్, అయోధ్య రైల్వే స్టేషన్, సరయూ నది వంటివి ఈ చిత్రాల్లో చక్కగా కనిపిస్తున్నాయి.


ఈనెల 16న తీసిన అయోధ్య రామాలయం ఉపగ్రహ ఛాయాచిత్రం (సర్కిల్లో)


అద్భుతంగా రామాలయం లోపలి భాగం

### గర్భాలయంలో ఇలా...

- ఉదయం 10 గంటలు: మంగళ ధ్వని
- మధ్యాహ్నం 12.05 నుంచి 12.55: ప్రాణప్రతిష్ట జరుగుతుంది. రామ్‌లల్లా నేత్రాలు తెరిచిన తర్వాత ప్రధాని మోదీ కాటుక దిద్దుతారు. బాలరాముడికి అద్దంలో ప్రతిబింబం చూపిస్తారు.
- మధ్యాహ్నం 12.55: ప్రధాన ఆలయంపై హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపిస్తారు.

### గర్భగుడిలోకి ఆ ఐదుగురు

గర్భగుడిలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో తీర్థ క్షేత్ర ట్రస్టు మహంత్ నృత్యగోపాల్ దాస్ మహరాజ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొంటారు. వేడుక పూర్తయిన తర్వాత అతిథులకు రామ్‌లల్లా దర్శనం కల్పిస్తారు.

### మోదీ పర్యటన ఇలా..

- ఉదయం 10.25: అయోధ్య విమానాశ్రయం నుంచి ఆలయానికి
- మధ్యాహ్నం 12: గర్భగృహం ఎదుట అతిథులకు పలకరింపు
- మధ్యాహ్నం 1 నుంచి 2 గంటలు: బహిరంగ సభలో మోదీ ప్రసంగం. ఆరెస్సెస్ చీఫ్ భాగవత్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు కూడా ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం 2 గంటలు: శివ మందిరం, కుబేర తిల సందర్శన
- మధ్యాహ్నం 3.30: మోదీ ఢిల్లీకి పయనమవుతారు.


ఆలయ ప్రాంగణంలో సీఎం యోగి సెల్ఫీ

## అయోధ్యలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

అయోధ్య: బాలరాముని ప్రాణప్రతిష్ట మహోత్సవం కోసం అయోధ్యకు ప్రపంచం నలుమూలల నుంచి ప్రముఖులు, భక్తులు విచ్చేస్తున్నారు. రాజకీయ నాయకులు, క్రీడాకారులు, సినిమా రంగం, వ్యాపార రంగానికి చెందిన ప్రముఖులకు ఆహ్వానం పంపించారు. ఈ నేపథ్యంలో నగరమంతటా పటిష్టమైన పోలీసు పహారా ఏర్పాటు చేశారు. ప్రాణప్రతిష్ట వేదిక వద్ద, మందిరం చుట్టూ, మందిరానికి వంద మీటర్ల దూరంలో నలువైపులా పోలీసు అధికారులు, సిబ్బంది మఫ్టీలో మోహరించారు. ఆలయం చుట్టూ కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సీసీ కెమెరాలు బిగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అయోధ్యకు వచ్చే అన్ని ప్రధాన రహదారులను గ్రీన్ కారిడర్‌లుగా మార్చారు. రామమందిర ప్రాణప్రతిష్ట కోసం విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఉత్తరప్రదేశ్ లా అండ్ ఆర్డర్ స్పెషల్ డీజీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. కార్యక్రమం జరిగే ప్రదేశంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని వెల్లడించారు. ఫైజాబాద్ జిల్లావ్యాప్తంగా దాదాపు 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా యాంటీ డ్రోన్ టెక్నాలజీని సైతం వినియోగిస్తున్నామని చెప్పారు.

## ఆ 3 రాష్ట్రాలకు ప్రధాని శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: రాష్ట్ర అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని ఈశాన్య రాష్ట్రాలైన మణిపూర్, త్రిపుర, మేఘాలయా రాష్ట్రాల ప్రజలకు ఆదివారం ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మూడు రాష్ట్రాల రాష్ట్ర అవతరణ దినోత్సవం ఒకే రోజు (జనవరి 21) ఉండటం విశేషం. ''రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మణిపూర్, త్రిపుర, మేఘాలయ ప్రజలకు నా శుభాకాంక్షలు. దేశాభివృద్ధికి రాష్ట్రం బలమైన సహకారాన్ని అందించింది. ఈ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు మనందరికీ గర్వకారణం. మణిపూర్ నిరంతర అభివృద్ధి చెందాలని ప్రార్థిస్తున్నా'' అంటూ మరో ట్వీట్ చేశారు.

## ఉక్రెయిన్‌లో దాడులు.. 25 మంది దుర్మరణం

కీవ్: రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగంలో ఆదివారం ఒక మార్కెట్‌పై జరిగిన దాడిలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ సేనలే ఈ దాడులకు తెగబడినట్లు రష్యా ఆరోపిస్తోంది. దీనిపై ఉక్రెయిన్ ఇంకా స్పందించలేదు. డోనెట్స్క్ నగరం సమీపంలోని టెక్స్‌టిల్‌చిక్ ప్రాంత మార్కెట్‌పై జరిగిన ఈ దాడిలో 20 మందికిపైగా గాయపడ్డారు. మరోవైపు ఆదివారమే రష్యాలోని కింగ్‌సెప్ జిల్లాలోని ఉస్ట్–లూగా పోర్ట్ రసాయన రవాణా టెర్మినల్ వద్ద రెండు భారీ పేలుళ్లు, తర్వాత భారీ అగ్నిప్రమాదం జరిగిన నేపథ్యంలో ఈ సంఘటనలను రష్యా, ఉక్రెయిన్‌ల పరస్పర దాడులుగా అంతర్జాతీయ మీడియా అభివర్ణిస్తోంది. నాలుగు ఉక్రెయిన్ డ్రోన్లు దాడి చేయడం వల్లే రసాయన రవాణా టెర్మినల్ వద్ద గ్యాస్ ట్యాంక్ పేలిందని రష్యా స్థానిక మీడియా ఆరోపిస్తోంది.

## అఫ్గాన్‌లో కూలింది భారత విమానం కాదు

న్యూఢిల్లీ: థాయ్‌లాండ్ నుంచి మాస్కోకు వెళ్తూ అఫ్గానిస్తాన్‌లో కూలిన విమానం భారత్‌కు చెందినది కాదని కేంద్రం పేర్కొంది. ఆ విమానం గయ విమానాశ్రయంలో ఇంధనం మాత్రమే నింపుకుందని వివరించింది. 1978లో తయారై, మొరాకోలో రిజిస్టరయిన దసో ఫాల్కన్ విమానం ప్రైవేట్ ఎయిర్ అంబులెన్సుగా పనిచేస్తోందని, అది ఆరుగురితో థాయ్‌ల్యాండ్‌లోని ఉటపావో ఎయిర్‌పోర్టులో బయలుదేరి మాస్కోకు వెళ్తున్నట్లు కేంద్ర పౌరవిమాన యాన శాఖ తెలిపింది. శనివారం సాయంత్రం ఉజ్బెకిస్తాన్ రాజధాని తాష్కెంట్ మీదుగా మాస్కో వెళుతూ అఫ్గానిస్తాన్‌లో ప్రమాదానికి గురైందని తెలిపింది. ఇంజిన్ లోపమే ఇందుకు కారణమని, పైలట్ సహా నలుగురు సజీవంగా ఉన్నట్లు సమాచారం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది.


# భారత్‌లోనే పెళ్లాడండి: మోదీ

అహ్మదాబాద్: సంపన్న కుటుంబాలు విదేశాల్లో పెళ్లాడుతున్న ఉదంతాలను ఉటంకిస్తూ భారత్‌లోనే పెళ్లాడండి (వెడ్ ఇన్ ఇండియా) అని ప్రధాని మోదీ మరోమారు పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని అమ్రేలీ సిటీలో నిర్మించనున్న ఖోడల్‌ధామ్ ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ శంకుస్థాపన కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నాక ఆ హాస్పిటల్‌ను నిర్వహించే ట్రస్ట్‌కు చెందిన లేవా పటిదార్ సభ్యులనుద్దేశించి మోదీ ప్రసంగించారు. '' భారతీయులు విదేశాల్లో పెళ్లి చేసుకోవడం సబబేనా?. సొంత దేశంలో వివాహ కార్యక్రమాలు చేసుకోలేమా? విదేశాల్లో కోట్లు ఖర్చు పెట్టి ఆడంబరంగా చేసే పెళ్లితో కోట్లాది రూపాయల భారతీయ సంపద విదేశాలకు తరలిపోతోంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. '' ఇక్కడి నుంచి విదేశాలకు పెళ్లి కోసమే ప్రత్యేకంగా వెళ్లి వచ్చే పెడధోరణి రోగం మీ పటిదార్ వర్గానికి అంటకుండా జాగ్రత్తపడండి. ఇక్కడి దేవత 'మా ఖోదల్' అమ్మవారి ఆశీస్సులతో ఇక్కడే పెళ్లి చేసుకోవచ్చుకదా. 'మేడ్ ఇన్ ఇండియా' తరహాలో 'వెడ్ ఇన్ ఇండియా'ను పాటిద్దాం'' అని కోరారు. '' పర్యాటనకు వెళ్లాలనుకుంటే ముందుగా స్వదేశంలోనే పర్యటించండి. దేశవ్యాప్తంగా సుందర, రమణీయ, దర్శనీయ స్థలాలను పర్యటించండి. పర్యాటక రంగాన్నీ ప్రోత్సహించండి'' అని అన్నారు.

### దక్షిణాది ఆధ్యాత్మిక పర్యటన పూర్తి

#### ధనుష్కోటి కోదండరామాలయ సందర్శన

రామేశ్వరం(తమిళనాడు): గత మూడు రోజులుగా తమిళనాడులో పర్యటిస్తున్న ప్రధాని మోదీ ఆదివారం అక్కడి శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రీలంకకు కూతవేటు దూరంలో ఉండే ధనుష్కోటి, అరిచల్ మునాయ్‌ల సమీపంలోనే ఈ ఆలయం ఉంది. ఆలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత సమీపంలోని అరిచల్ మునాయ్‌కు వెళ్లి అక్కడి జాతీయ చిహ్నం ఉన్న స్తంభం వద్ద నమస్కరించారు. అక్కడి సముద్రతీరంలో మోదీ కొద్దిసేపు ప్రాణాయామం చేశారు. సముద్ర జలాన్ని చేతులోకి తీసుకుని ప్రార్థనలు చేశారు. రామసేతుకు ప్రారంభ స్థానంగా పేర్కొనే అరిచల్‌మునాయ్ ప్రాంతం వద్దే మోదీ కొద్దిసేపు గడిపారు. బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలోని గల్ఫ్ ఆఫ్ మన్నార్ సముద్రజలాలు కలిసే చోటునే తమిళంలో అరిచల్ మునాయ్ అంటారు. ఇక్కడి రామసేతుకు ఆడమ్స్ బ్రిడ్జ్ అని మరో పేరు కూడా ఉంది. అయోధ్యలో భవ్య రామాలయం ప్రాణప్రతిష్ఠ కోసం కఠిన దీక్ష చేస్తున్న ప్రధాని గత కొద్దిరోజులుగా రామాయణంతో ముడిపడి ఉన్న ఆలయాలు, ఆధ్యాత్మిక ప్రాంతాలను దర్శిస్తున్న విషయం తెల్సిందే. ఆదివారంతో దక్షిణ భారత పర్యటనను పూర్తిచేశారు. అరిచల్‌మునాయ్ నుంచి తమిళనాడుకు చెందిన పవిత్ర నదీజలాలతో నిండిన కలశాలను వెంట తీసుకుని మోదీ ఢిల్లీ చేరుకున్నారు.


ఆదివారం ధనుష్కోటిలో రామసేతు వద్ద సముద్రతీరంలో ధ్యానముద్రలో ప్రధాని మోదీ

## మేం 4 రోజుల్లో ఆపేవాళ్లం

### మణిపూర్ హింసాకాండపై రాహుల్



కలియబోర్: ప్రధానమంత్రి పదవిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత ఉండి ఉంటే మణిపూర్‌లో హింసకు నాలుగు రోజుల్లోనే ఫుల్‌స్టాప్ పడి ఉండేదని ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆదివారం అస్సాంలోని నగావ్ జిల్లాలో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ తలుచుకుంటే మణిపూర్ హింసను సైన్యం సాయంతో మూడు రోజుల్లో ఆపగలిగేవారని అన్నారు. కానీ, అలా చేయడం బీజేపీకి ఇష్టం లేదని రాహుల్ వ్యాఖ్యానించారు. 'మణిపూర్ నాలుగు నెలలుగా మండుతున్నా, మన ప్రధాని ఇప్పటివరకు అక్కడికి వెళ్లలేదు. అదే కాంగ్రెస్ ప్రధానే ఉంటే మూడు రోజుల్లోనే అక్కడికి వెళ్లి ఉండేవారు. నాలుగో రోజుకల్లా అక్కడ హింస ఆగిపోయి ఉండేది'అని ఆయన చెప్పారు. 'నేతలు వస్తుంటారు, పోతుంటారు. కానీ, మనస్సు నిండా విద్వేషాన్ని, అహంకారాన్ని నింపుకున్నవారు త్వరలోనే కనుమరుగవుతారు'అని రాహుల్ పేర్కొన్నారు.

**జై శ్రీ రాం, మోదీ నినాదాలు, రాహుల్ ఫ్లయింగ్ కిస్‌లు...**

నగావ్ జిల్లాలో న్యాయ్ యాత్ర సందర్భంగా రాహుల్‌కు నిరసన సెగ తగిలింది. ఒక చోట బీజేపీ కార్యకర్తలు జై శ్రీ రాం, మోదీ, మోదీ.. అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ ఫ్లయింగ్ కిస్‌లు విసురుతూ వారిని కలుసుకునేందుకు వెళ్లారు. సంబంధిత వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు. తర్వాత ర్యాలీలో మాట్లాడుతూ.. 'సుమారు 3 కిలోమీటర్ల దూరంలో 20 నుంచి 25 మంది వరకు బీజేపీ కార్యకర్తలు కర్రలు పట్టుకుని మా బస్సు ముందుకు వచ్చారు. నేను బస్సు దిగి వచ్చే సరికి వారంతా పారిపోయారు. ప్రధాని మోదీ, సీఎం హిమంత బిశ్వశర్మ ఎవరొచ్చినా మేం భయపడేది లేదు'అని రాహుల్ తెలిపారు.

## 'భరతవర్ష' పునర్నిర్మాణానికి నాంది

### రామాలయ ప్రారంభంపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అయోధ్యలోని జన్మస్థలానికి శ్రీరాముడి ప్రవేశం, ఆలయ ప్రాణప్రతిష్ట ఉత్సవం 'భరతవర్ష'పునర్నిర్మాణానికి నాంది అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. 'భరతవర్ష'లో సమాజంలోని ప్రతి ఒక్కరి సంక్షేమం, శాంతి, అభివృద్ధి, ఐక్యత, సామరస్య సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ వెబ్‌సైట్‌లో ఆదివారం ఆయన రాసిన వ్యాసం పోస్ట్ అయ్యింది. అయోధ్యలో రామాలయ నిర్మాణం కోసం హిందూ సమాజం పోరాటం, సంక్షోభాలు ఇక ముగిసి పోవాలని ఆయన ఆకాంక్షించారు. అయోధ్య పునర్నిర్మాణం ఇక మనందరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధికులు పూజించే దైవం శ్రీరాముడేనని ఆయన తెలిపారు. మందిర నిర్మాణం 'జాతి గౌరవానికి పునరుజ్జీవనం'గా ఆయన అభివర్ణించారు. ''రామజన్మభూమిలో రామ్ లల్లా ప్రవేశం, ప్రాణప్రతిష్ట భరతవర్ష పునర్నిర్మాణానికి నాంది. ఇది అందరి శ్రేయస్సు కోసం, భేదభావం లేకుండా అందరినీ అంగీకరించడం, సామరస్యం, ఐక్యత, పురోగతి, శాంతి మార్గాన్ని చూపుతుంది. యావత్ ప్రపంచ పునర్నిర్మాణానికి బాటలు వేస్తుంది'' అని భాగవత్ అన్నారు.

## 25,000 దాటిన గాజా మృతులు

రఫా(గాజా స్ట్రిప్): తమతమ మతసంబంధ పవిత్ర ప్రాంతాలపై పట్టు కోసం ఘర్షణలతో మొదలై మెరుపు దాడులతో తీవ్రతరమై మహోగ్రరూపం దాల్చిన హమాస్– ఇజ్రాయెల్ పోరు పాతికవేల ప్రాణాలను పొట్టనబెట్టుకుంది. మరోవైపు వంద మందికిపైగా బందీలను విడిపించుకున్నాసరే అందర్నీ విడిపిస్తామని, హమాస్ సభ్యులందర్నీ హతమారుస్తామని ఇజ్రాయెల్ సేనల ప్రతినబూనడం చూస్తుంటే యుద్ధ బాధితులు, మరణాల సంఖ్య ఇక్కడితో ఆగేలా లేదు. యుద్ధం ఇంకొన్ని నెలలపాటు కొనసాగుతుందని ఇజ్రాయెల్ సైన్యాధికారులు తాజాగా ప్రకటించారు. ఇన్ని నెలలు గడుస్తున్నా ఇంకా బందీలను విడిపించలేకపోవడంతో ఇజ్రాయెల్ ప్రభుత్వంపై స్థానికంగా పెద్ద ఎత్తున విమర్శలు, నిరసనలు ప్రదర్శలు పెరిగాయి.

## నేడు సగం రోజు సెలవుపై వెనక్కి తగ్గిన ఢిల్లీ ఎయిమ్స్

న్యూఢిల్లీ: అయోధ్యలో రామాలయం ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం అవుట్ పేషెంట్ విభాగాన్ని మధ్యాహ్నం 2.30 గంటల వరకు మూసి ఉంచాలంటూ శనివారం జారీ చేసిన మెమోరాండంను ఢిల్లీ ఎయిమ్స్ వెనక్కి తీసుకుంది. అవుట్ పేషెంట్ సేవలు(ఓపీడీ)సహా అన్ని విభాగాలు యథావిధిగా తెరిచి ఉంచాలంటూ ఆదివారం తాజాగా మెమోరాండం జారీ చేసింది. అన్ని కేంద్రాల, విభాగాల అధిపతులు, యూనిట్లు, బ్రాంచ్ ఆఫీసర్లు తమ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఈ సమాచారం అందజేయాలని కోరింది. రోగులకు అసౌకర్యం కలగరాదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఓపీడీ సహా అన్ని సేవలు సోమవారం రోజంతా యథావిధిగా కొనసాగుతాయని లేడీ హార్డింజ్ మెడికల్ కాలేజీ కూడా తెలిపింది.

## జేఎన్.1 కేసులు 1,513

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసుల సంఖ్య 1,513కు చేరుకున్నట్లు కేంద్ర ప్రభుత్వ విభాగం ఇన్సాకాగ్ పేర్కొంది. ఈ వేరియంట్ కేసులు అత్యధికంగా మహారాష్ట్రలో 382, కర్ణాటకలో 249 నమోదైనట్లు ఆదివారం తెలిపింది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్‌లో 189, కేరళలో 156, గుజరాత్‌లో 126, బెంగాల్‌లో 96, గోవాలో 90, తమిళనాడులో 89 జేఎన్.1 వేరియంట్ కేసులు బయటపడ్డాయని ఇన్సాకాగ్ వివరించింది. కేసుల సంఖ్యలో పెరుగుదల నమోదవుతున్నప్పటికీ, ఈ వేరియంట్ అంత ప్రమాదకారి కాదని స్పష్టం చేసింది.

## ట్రంప్ మానసిక స్థితిపై అనుమానాలు: నిక్కీ హేలీ

కొలంబియా: అమెరికా మాజీ అధ్యక్షుడు, మళ్లీ అధ్యక్ష రేసులో ఉన్న డొనాల్డ్ ట్రంప్ మానసిక ఆరోగ్యంపై భారత సంతతికి చెందిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి నిక్కీ హేలీ అనుమానం వ్యక్తం చేశారు. అమెరికా హౌస్ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ పేరుకు బదులుగా తన పేరును ప్రస్తావించడంపై ఆమె ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆమె న్యూహ్యాంప్‌షైర్‌లోని కీనీలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడారు. 2021 జనవరి 6వ తేదీన క్యాపిటల్ హిల్ సెక్యూరిటీ ఇన్‌చార్జిగా అప్పటి అమెరికా హౌస్ స్పీకర్ నాన్సీ పెలోసీ పేరుకు బదులుగా హేలీ పేరును ట్రంప్ పేర్కొనడంపై ఆమె స్పందించారు. మానసికంగా సరిగా లేని ట్రంప్ అధ్యక్ష పదవిలో ఒత్తిళ్లను ఎదుర్కొనగలరా అనేది అనుమానమేనని పేర్కొన్నారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 22 । జనవరి । 2024

బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1లోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీరాముడి ప్రతిమ



- అందరి చూపూ అయోధ్య వైపే
- నేడు బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ
- నగరమంతా ఆధ్యాత్మిక శోభ
- ప్రధాన కూడళ్లలో భారీ స్క్రీన్‌లు
- ఆలయాలు, ఇళ్లల్లో అలంకరణలు
- శ్రీరాముడి చిత్రపటాలకు డిమాండ్



లంగర్‌హౌజ్‌లో రమ్యంగా ముస్తాబైన రామాలయం

# అహో.. భాగ్యనగరామ్

## ప్రతినోటా రామనామ స్మరణే

ఎన్నో ఏళ్లుగా యావత్ ప్రపంచం మహోద్వేగభరితంగా ఎదురు చూస్తున్న అపురూప క్షణాలు రానేవచ్చాయి. మరికొద్ది గంటల్లో అయోధ్యలో కొలువుదీరనున్న బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు భాగ్యనగర వాసుల చూపంతా అయోధ్య వైపే నిలిపింది. మహా నగరం శ్రీరామ నామస్మరణతో తాదాత్మ్యత పొందనుంది. ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. సోమవారం అయోధ్యలో జరగనున్న వేడుకలను దృష్టిలో ఉంచుకొని నగరవాసులు తమ ఇళ్లు, వాకిళ్లను అందంగా అలంకరిస్తున్నారు. ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దుతున్నారు. మరోవైపు కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌ల సంక్షేమ సంఘాలు సైతం శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాయి.

–సాక్షి, సిటీబ్యూరో



మల్లాపూర్ చౌరస్తాలో కాషాయ వస్త్రధారణలతో బైక్ ర్యాలీ



కాషాయ తోరణాలతో నిండిపోయిన దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ వీధి

### ముస్తాబైన ఆలయాలు..

నగరంలోని అన్ని ఆలయాలను అందంగా అలంకరించారు. చిలుకూరు బాలాజీ టెంపుల్ వద్ద ప్రత్యేక ప్రదర్శనల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తాడ్‌బండ్, కర్మన్‌ఘాట్, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు, శ్రీరాముడి మందిరాలను, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, హిమాయత్‌నగర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాలను అందంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. నగరంలో అడుగడుగునా ఆధ్యాత్మికత, భక్తిభావం ఉట్టిపడేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీధుల్లో, ప్రధాన కూడళ్లలో కాషాయ జెండాలతో తోరణాలు కట్టారు. మరో వైపు శ్రీరాముడి నిలువెత్తు భారీ కటౌట్‌లు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

### భారీ స్క్రీన్‌ల ఏర్పాటు..

బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ క్షణాలను వీక్షించేందుకు నగరంలో భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు 'జై శ్రీరామ్' అని నినదిస్తూ వేడుకల్లో పాల్గొనేలా ఇంటింటికీ కాషాయ జెండాల పంపిణీ చేపట్టారు. సాయంత్రం ఆలయాలు, కమ్యూనిటీహాళ్లు తదితర ప్రాంతాల్లో భక్తి కార్యక్రమాలను, భజనలను ఏర్పాటు చేయనున్నారు. ఇళ్లను అందంగా అలంకరించుకోవడంతో పాటు సాయంత్రం వేళ 5 ప్రమిదల్లో దీపాలను వెలిగించాలని సూచించారు. అయోధ్యలో వేడుకల సందర్భంగా నగర మార్కెట్‌లో శ్రీరాముడి చిత్రపటాల అమ్మకాలు భారీగా పెరిగాయి. ఉస్మాన్‌గంజ్, కోఠి, బేగంబజార్, సికింద్రాబాద్, తదితర ప్రాంతాల్లో చిత్రపటాలను విక్రయించే షాపుల వద్ద సందడి నెలకొంది. పూలు, పూజా ద్రవ్యాలకు సైతం డిమాండ్ ఏర్పడింది. వివిధ సంస్థల ఆధ్వర్యంలో ప్రదర్శనలు, భారీ ర్యాలీలను సైతం నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు.

### రామనామ జపం

నివాసిత సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీలు, లగ్జరీ అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు శ్రీరామ నామాన్ని జపిస్తున్నాయి. అపార్ట్‌మెంట్లలో రాముడి భారీ కటౌట్లు, పూల దండలు, ప్రతిమలు, శ్రీ రామ్ జెండాలు, రంగురంగుల లైట్లతో అలంకరించారు. నల్లగడ్డలోని అపర్ణా సైబర్ కమ్యూనిటీ, బంజారాహిల్స్ రోడ్ నంబరు-5లోని ట్రెండ్‌సెట్ సుమాంజలి, నానక్‌రాంగూడలోని మై హోమ్ విహంగ, కొండాపూర్‌లోని అపర్ణా టవర్స్‌లో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నేటి ఉదయం 11 గంటల నుంచి అయోధ్యలో జరిగే పూజా కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు భారీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఫెడరేషన్ ఆఫ్ గేటెడ్ కమ్యూనిటీస్ సైబరాబాద్ (ఎఫ్‌జీసీసీ)లో అయోధ్యలోని రామలీలా మందిరం నమూనాలను రూపొందిచారు. రథయాత్రలు, అన్నదానం, రామ భజనలు, విష్ణు సహస్రనామాలు వంటి ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. సుందరకాండ పారాయణం, ప్రత్యేక రంగోలీ, దీపోత్సవం వంటి ఏర్పాట్లు చేశారు.

## హై అలర్ట్
## రంగంలోకి ప్రత్యేక బృందాలు

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని ఉగ్రవాద, అసాంఘిక సంస్థలు ప్రకటనలు చేయడంతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ఠ బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని కమిషనర్లు కొత్త కోట శ్రీనివాసరెడ్డి, అవినాష్ మహంతి, జి.సుధీర్‌బాబు సమీక్షిస్తున్నారు. పాతబస్తీతో పాటు నగరంలోని సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసులు అదనపు, సాయుధ బలగాలను మోహరిస్తున్నారు. సీసీఎస్, సిట్, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, సిటీ ఆరమ్డ్ రిజర్వ్, టీఎస్ఎస్పీ, స్పెషల్ ఆపరేషన్ టీమ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను మోహరిస్తున్నారు. వీటికి తోడు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన, కేంద్ర బలగాలను రంగంలోకి దింపుతున్నారు. అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ, సాంకేతిక నిఘా ఏర్పాటు చేశారు. గతంలో తీవ్ర పరిణామాలకు ఒడిగట్టిన వ్యక్తులను అనునిత్యం వెంటాడటానికి షాడో టీమ్‌లను ఏర్పాటు చేశారు. క్విక్ రియాక్షన్ టీమ్‌తో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రైకింగ్ ఫోర్స్‌ను అన్ని వేళలా అందుబాటులో ఉంచుతున్నారు. సున్నిత, అతి సున్నిత ప్రాంతాల్లో ఆ స్థాయిలో సిబ్బందితో పికెట్లు ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెకింగ్ పాయింట్ల ద్వారా వాహనాలను సోదా చేయనున్నారు. లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తూ నిఘా ఉంచారు. 'ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావు లేకుండా పక్కా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పోలీసు రికార్డుల్లో ఉన్న కమ్యూనల్, కరడుగట్టిన రౌడీ షీటర్లలో చాలా మంది ఇప్పటికే జైళ్లలో ఉన్నారు. బయట ఉన్న వారిపై నిఘా ఉంచుతాం. డీజీపీ కార్యాలయంతో పాటు ఇతర యూనిట్లతోనూ సమన్వయం ఏర్పాటు చేసుకుని పని చేస్తాం' అని ఓ ఉన్నతాధికారి 'సాక్షి'తో అన్నారు.



నిజాం కళాశాలలో ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ లక్ష్మణ్ తదితరులు

---

## వసుధైక కుటుంబం.. ఐదు తరాల అనుబంధం

బంజారాహిల్స్: ఐదు తరాలు అలరించాయి. ఒకే వేదికపైకి వచ్చి సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ఈ ఘనతను ఆదివారం నగరంలోని జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమం దక్కించుకుంది. ఇక్కడ చదువుతున్న విద్యార్థుల కుటుంబాలను పరిచయం చేసే క్రమం చేపట్టారు. కన్నులపండువగా జరిగిన ఈ కార్యక్రమంలో ఐదు తరాలకు చెందిన కుటుంబం ఒకటి, నాలుగు తరాలకు చెందిన కుటుంబం ఒకటి, మూడు తరాలకు చెందిన నాలుగు కుటుంబాలు ఆహూతులను అలరించాయి. ఈ పాఠశాలల్లో చదువుతున్న తాళ్లపాక శుభకృతి 5వ తరగతి చదువుతోంది. తల్లి జ్యోతిష్మతి గైనకాలజిస్ట్. తండ్రి కార్తీక్ భరద్వాజ్ సీసీఎంబీలో సైంటిస్ట్. ఈ చిన్నారి తన తల్లి జ్యోతిష్మతి, నాయనమ్మ నాగమణి, ఆ తర్వాత తరం సావిత్రీదేవి, పార్వతి.. వీరందరినీ ఒకే వేదికపై చూసుకుని మురిసిపోయింది. ఇలా ఆ తరానికి చెందిన వారంతా తమ అనుభవాలను నెమరువేసుకున్నారు. మరికొంత మంది వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయండా తమ ముని మనవలు, ముని మనవరాళ్లతో కలిసి సందడి చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



తన ముందు తరాలతో విద్యార్థిని శుభకృతి

## తెలుగు భాషకు పూర్వవైభవం తేవాలి

### హరియాణా, మిజోరం గవర్నర్లు దత్తాత్రేయ, హరిబాబు



మణికొండ: తెలుగు భాషకు పూర్వ వైభవం తేవాల్సిన బాధ్యత తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులపై ఉందని హరియాణా, మిజోరం గవర్నర్లు బండారు దత్తాత్రేయ, హరిబాబు పేర్కొన్నారు. ఆదివారం నగర శివారు నార్సింగి మున్సిపాలిటీలోని ఓం కన్వెన్షన్‌లో బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు, తెలుగు సంగమం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సమ్మేళనానికి దత్తాత్రేయ, హరిబాబు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. తెలుగు భాషను, మన సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటి పిల్లలకు తప్పనిసరి తెలుగును నేర్పించాలన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా మురళీధర్‌రావు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. మన దేశంలో సంస్కృతం తర్వాత తెలుగుకే గుర్తింపు ఉందని, రామాయణం సంస్కృతం తర్వాత తెలుగులోనే రాసిన విషయాన్ని మనమంతా తెలుసుకోవాలని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. ఈ సందర్భంగా గంగిరెద్దుల విన్యాసాలు, పేరిణి ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖ నాట్యకారిణి కళాకృష్ణ పాల్గొన్నారు.

## 'పది'పై ఫోకస్

- పరీక్షల్లో మెలకువలపై టీచర్లకు శిక్షణ
- సైన్స్, గణితం, ఆంగ్ల సబ్జెక్టులపై నజర్
- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు..





సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిసారీ పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం దిగజారడాన్ని తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. విద్యార్థుల కంటే ముందు వారిని బోధించే టీచర్లకు మెలకువలపై అవగాహన కల్పించే చర్యలకు ఉపక్రమించింది. ఏకంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పదో తరగతి పరీక్షలను సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల రిసోర్స్ పర్సన్‌లతో సమావేశం ఏర్పాటు చేసి తమ అనుభవాలను ఉపాధ్యాయులతో పంచుకొని మంచి ఫలితాల సాధించేలా ప్రయత్నించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత సాధించలేకపోతున్న సైన్స్, గణితం, ఆంగ్లం సబ్జెక్టులపై ప్రత్యేక కార్యాచరణకు దిగారు. రిసోర్స్ పర్సన్లలతో సబ్జెక్టు టీచర్లకు ఓరియంటేషన్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో స్వయంగా తాను పాల్గొంటూ దిశా నిర్దేశం చేస్తున్నారు. మరోవైపు పాఠశాల స్థాయిలో ఉత్తీర్ణత బాధ్యత ప్రధానోపాధ్యాయులపై పెట్టడంతో పాటు, సబ్జెక్టుల్లో ఫెయిల్ అయితే టీచర్ల తప్పిదంగా భావించాల్సి ఉంటుందని హెచ్చరించడంతో ప్రత్యేక తరగతుల నిర్వహణను పటిష్ఠంగా చేపట్టారు..

### ప్రత్యేక తరగతుల నిర్వహణ..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఇప్పటికే విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. పదో తరగతిలో ఎక్కువగా ఫెయిలయ్యే సబ్జెక్టులపై ఫోకస్ పెట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి రివిజన్ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. సబ్జెక్టు టీచర్ల కొరతతో కొన్ని పాఠశాలల్లో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. చాలా స్కూళ్లలో 60 శాతం మాత్రమే సిలబస్ పూర్తయింది. ఇదే పరిస్థితి గత విద్యా సంవత్సరం కొనసాగడంతో ఉత్తీర్ణత శాతం 72 శాతం మించలేదు. అప్పట్లో మొత్తమ్మీద 7,244 మంది విద్యార్థుల్లో సుమారు 2,009 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ప్రస్తుతం 181 ఉన్నత పాఠశాలల్లో ఈసారి సుమారు 6,859 మంది విద్యార్థులు చదువుతున్నారు.

### సామర్థ్యాలు అంతంత మాత్రమే..

ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. సరైన బోధన జరగక సబ్జెక్టులపై కనీస పట్టులేకుండా పోయింది. పాఠశాలల్లో నిపుణుల కొరతతో ప్రధాన సబ్జెక్టుల్లో పాఠ్యాంశాల బోధన కూడా సరిగా సాగడం లేదు. ఆయా పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులతోనే మొక్కుబడిగా బోధన కొనసాగడంతో దయనీయ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.



నాలుగు రోజుల పాటు సాగిన విహంగామా వీడ్కోలు పలికింది. నగరంలోని బేగంపేట విమానాశ్రయం వేదికగా కనువిందు చేసిన వింగ్స్ ఇండియా– 2024 ముగిసింది. ఆదివారం ఆఖరిరోజు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గగనతలంలో విమానాల విన్యాసాలను వీక్షించి ఆనందభరితులయ్యారు. మళ్లీ రెండేళ్ల తర్వాత జరిగే షోకు వస్తామంటూ బైబై చెప్పారు. –సనత్‌నగర్

## విహంగామాకు వీడ్కోలు





## ఆత్మీయ నేస్తాలే..







కవాడిగూడ: వీధి శునకాలను ఆదరించి ఆత్మీయతతో అక్కున చేర్చుకోవాలని బ్లూక్రాస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు అక్కినేని అమల పేర్కొన్నారు. ఆదివారం దోమలగూడలోని చైతన్య విద్యామందిర్‌లో బ్లూక్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాగ్‌షోలో ఆమె మాట్లాడారు. సరైన సమయంలో స్టెరిలైజేషన్ చేస్తే వీధి కుక్కల సంతానోత్పత్తిని నివారించవచ్చన్నారు. డాగ్ షోలో పెంపుడు శునకాలు అలరించాయి. కార్యక్రమంలో బ్లూక్రాస్ హైదరాబాద్ అధ్యక్షులు అపర్ణారావు, డైరెక్టర్ కుమారి, డాగ్‌షో న్యాయ నిర్ణేతలు, శ్రీపరోపకారి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

























# నుమాయిష్.. జోష్

- సందర్శకులతో కిక్కిరిసిన ఎగ్జిబిషన్
- 80 వేల మంది సందర్శన



**అబిడ్స్:** ఎగ్జిబిషన్ సందర్శకులతో కిక్కిరిసింది. 83వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్)ను ఆదివారం 80 వేల మంది సందర్శించారు. జనవరి 1వ తేదీన ప్రారంభమైన ఎగ్జిబిషన్ ఫిబ్రవరి 15న ముగియనుంది. ఆదివారం వరకు దాదాపు 8.50 లక్షల మంది ఎగ్జిబిషన్‌ను సందర్శించారని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్తేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి ఏనుగుల రాజేంద్రకుమార్‌లు తెలిపారు. సందర్శకుల సౌకర్యార్థం ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. వలంటీర్లతో పాటు పోలీసులు ఆదివారం ఎగ్జిబిషన్ పరిసరాల్లో ఎగ్జిబిషన్ లోపల భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శంకర్ తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ముమ్మరం చేశామన్నారు. మఫ్టీలో పోలీసులు ఉండి బందోబస్తు చేపడుతున్నారన్నారు.

## 'సామాజిక సేవా దృక్పథం అభినందనీయం'



**సుల్తాన్‌బజార్:** విద్యను వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక సేవా దృక్పథంతో నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. ఆదివారం హనుమాన్‌టేక్డీలోని శ్రీ గుజరాతీ ప్రగతి సమాజ్ ఆధ్వర్యంలో ప్రగతి మహా విద్యాలయం స్వర్ణోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ సుల్తానియా హాజరై మాట్లాడుతూ.. శ్రీ గుజరాతీ ప్రగతి సమాజ్ విద్యార్థులకు ఇంటర్ నుంచి పీజీ వరకు తక్కువ ఫీజుతో విద్యను అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి మహోన్నతమైన విద్యాసంస్థలో విద్యను అభ్యసించడం విద్యార్థుల అదృష్టమన్నారు. ఈ సందర్భంగా కాలేజ్ సావనీర్‌ను విడుదల చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన భారతీయ సాంస్కృతి, వెస్టర్న్ నృత్యాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్శిటీ కామర్స్ విభాగం సీనియర్ ఆచార్యులు ప్రొఫెసర్ అప్పారావు, ప్రగతి సమాజ్ ఉపాధ్యక్షులు మహేష్‌పటేల్, సమాజ్ అధ్యక్షులు గోవింద్‌దాస్ షా, కార్యదర్శి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శోభన్‌బాబు జయంతి



ఆమని, రోజారమణిలకు పురస్కారాలను అందజేస్తున్న బండారు సుబ్బారావు తదితరులు

**గన్‌ఫౌండ్రీ:** అందాల నటుడు శోభన్‌బాబు సినీ ప్రేక్షకుల గుండెలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో శోభన్‌బాబు 88వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటులు ఆమని, రోజారమణిలకు పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు గాయనీ గాయకులు ఆలపించిన సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా, కళాపత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్లయినా లెనిన్ ప్రభావం ఉంది

సీపీఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు



లెనిన్‌కు నివాళులర్పిస్తున్న కూనంనేని, చాడ తదితరులు

**హిమాయత్‌నగర్:** రష్యాన్ విప్లవోద్యమ సారధి లెనిన్ మరణించి 100 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆయన ప్రభావం ప్రపంచంపై ఉందని సీపీఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. సోవియట్ యూనియన్ నిర్మాత వ్లాదిమిర్ లెనిన్ 100వ వర్థంతిని పురస్కరించుకొని హిమాయత్‌నగర్‌లోని మగ్దూం భవన్‌లో లెనిన్‌కు సిపిఐ నాయకులు నివాళులర్పించారు. లెనిన్ చిత్రపటానికి కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాంబశివ రావు మాట్లాడుతూ చరిత్రలో కారల్ మార్క్స పేరు ఉంటే ఆయన పక్కన లెనిన్ పేరు ఉండాల్సిందే అన్నారు. లెనిన్ 100వ వర్థంతి పురస్కరించుకొని పార్టీని మరింతగా పటిష్టంగా నిర్మాణం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కడ వైఫల్యాలు జరిగాయో పరిశీలించుకోవాలని, వాటిని సరిచేసుకుని, పార్టీని నిర్మాణాన్ని పటిష్టం చేయాలన్నారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా లెనిన్ ఆచరించిన, అమలు పరిచిన ఆయన ఆలోచన విధానాన్ని అవలోకన చేసుకొని, లెనిన్ చూపిన బాటలో నడవాలన్నారు. తెలంగాణ ప్రజా నాట్యమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, పల్లె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## డీసీఎం ఢీకొని ఒకరి మృతి

**పోచారం:** డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన మేరకు.. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టింది. కాళ్లు, చేతులకు తీవ్రంగా గాయాలు తగిలాయి. స్థానికుల సమీపంలోని నీలిమ ఆసుపత్రికి తీసుళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలుడిని చితకబాదిన ఉపాధ్యాయుడు

**బహదూర్‌పురా:** జహనుమాలోని సెయింట్ మార్క్ బాయ్ టౌన్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థిని చితకబాదిన సంఘటన కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ నెల 20న (శనివారం) జరిగిన ఈ సంఘటనతో బాలుని తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. విద్యార్థి తండ్రి ఖాదర్ హుటాహుటిన శనివారం ఉదయం పాఠశాలకు చేరుకొని సంబంధిత ఉపాధ్యాయులను నిలదీశాడు. వారి నుంచి ఎలాంటి సమాధానం లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# సోవియట్ రష్యా అక్టోబర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** దోపిడీ, అసమానతలు, ఆర్థిక సంక్షోభం లేని కష్టజీవుల రాజ్యం రావాలని ఆ దిశగా సోవియట్ రష్యా అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగాలని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో మార్కిస్ట్ మహోపాధ్యాయుడు లెనిన్ శత వర్ధంతి సభ నిర్వహించారు.ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ నాటి పరిస్థితుల్లో లెనిన్ చెప్పిన విషయాలు సమాజాన్ని ప్రపంచ దేశాల్లో నడిపించాలనే ప్రజా ఉద్యమాలకు విప్లవోద్యమాలకు మార్గనిర్దేశం చేస్తున్నాయని తెలిపారు. లెనిన్ సమాజం అనే విషయాలను అనేక విధాలుగా అధ్యయనం చేశారని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, చెరుపల్లి సీతారాములు, సిపిఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## క్విజ్‌లో సత్తా చాటిన బీవీబీపీ స్కూల్ జట్టు



అవార్డు అందుకుంటున్న బీవీబీపీ స్కూల్ జట్టు

**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమం జట్టు టైమ్స్ ఇంటర్ స్కూల్ క్విజ్ కాంపిటీషన్ 2023–24లో మొదటి బహుమతి గెలుచుకుని రూ.లక్ష నగదుతో పాటు ట్రోఫీని అందుకుంది. నగర వ్యాప్తంగా 72 పాఠశాలల నుంచి 9,000 మంది విద్యార్థులు ఈ క్విజ్ పోటీలో పాల్గొన్నారు. టక్సన్ యూనివర్సిటీ ఈ ట్రోఫీని స్పాన్సర్ చేసింది. ఎక్సలెన్సియా గ్రూప్ ఆఫ్ కాలేజస్, క్షేత్ర సెంటర్ ఫర్ లెర్నింగ్, ఎస్ ఏడబ్ల్యూ 144 టీమ్‌లు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో భారతీయ విద్యాభవన్ స్కూల్ విద్యార్థుల జట్టు చక్కని ప్రతిభ కనబరుస్తూ మొదటి నుంచి ఫైనల్ వరకు దూసుకెళ్లింది. స్కూల్ విద్యార్థి అనిమేష్ పాణిగ్రహి తన సహచర ఇద్దరు విద్యార్థులతో కలిసి స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ స్మితా సబర్వాల్ చేతుల మీదుగా చెక్కుతో పాటు ట్రోఫీని అందుకున్నారు.

## మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ బస్సు ప్రారంభం

**బంజారాహిల్స్:** కేన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తించడానికి వీలుగా బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో అత్యాధునిక మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ బస్సును ఆదివారం ప్రారంభించారు. సీఎస్ఆర్ కార్యక్రమం కింద స్టేట్ బ్యాంక్ ఇండియా రూ.1.5 కోట్లను సమకూర్చారు. పరీక్షా ఫలితాలను కూడా వెనువెంటనే అందించేలా అత్యాధునిక సదుపాయాలను కూడా బస్సులో ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ సీజీఎం రాజేష్ కుమార్ చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. కార్యక్రమంలో యాడ్ లైఫ్ అండ్ అకడమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా రాఘునాథ్, మెడికల్ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## వీధి కుక్కలను తరలించిన సర్పంచ్, కార్యదర్శిపై కేసు నమోదు

**మేడ్చల్ రూరల్:** గ్రామంలోని ఉన్న వీధి కుక్కలను ఎలాంటి సంరక్షణ లేకుండా అటవీ ప్రాంతానికి తరలించిన గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శామీర్‌పేట్ మండలం మురహరిపల్లి గ్రామంలో ఉన్న వీధి కుక్కలను సర్పంచ్ భాస్కర్, గ్రామ కార్యదర్శిలు ఇటీవల గ్రామం నుండి తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఈ నెల 9న విషయం తెలుసుకున్న స్ట్రే యానిమల్ పౌండేషన్ ఆఫ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ పీసీఏ మేనేజర్ గౌతమ్, పీసీఏ అసిస్టెంట్ లక్ష్మీప్రసన్నలు సర్పంచ్‌ను విషయంపై ఆరా తీయగా గ్రామంలో వీధి కుక్కల బెడద వల్ల వాటిని అటవీ ప్రాంతానికి తరలించినట్లు ఒప్పుకున్నాడు. మరింత సమాచారం కోసం కుక్కలను వదిలిపెట్టిన ప్రాంతాన్ని సందర్శించిన పీసీఏ అసిస్టెంట్ వీధి కుక్కల తరలింపు కారణంగా వాటికి ఆహారం, నీటి కొరత ఏర్పడి మరణించే స్థితికి చేరడంతో ఈ మేరకు లక్ష్మీప్రసన్న మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జంతు సంరక్షణ చర్యలు తీసుకోకుండా కుక్కలను తరలించిన వారిపై యానిమల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరడంతో ఈ మేరకు మేడ్చల్ పోలీసులు విచారణ జరిపి కేసు నమోదు చేశారు.




# గూగుల్‌కి కూడా గురువు అవసరం

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

**మాదాపూర్:** సంగీతం మంచి అలవాటును, సాత్విక భావాన్ని, మంచి ఆలోచన శక్తిని కలిగిస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమీ (బాల గాంధర్వం) సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించింది. వేడుకలను చినజీయర్‌స్వామి, నిర్వాహకులు కొమండూరి రామాచారితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. గూగుల్ వచ్చినా గురువు ప్రాధాన్యత తగ్గదన్నారు. గూగుల్‌కి కూడా గురువు కావాలని తెలిపారు. గురువు సన్మార్గాన్ని చూపిస్తారన్నారు. గురువును ఎప్పుడు గౌరవించాలని వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. మానసిక చైతన్యం కోసం సంగీతం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పిల్లలను ర్యాంకులు తెచ్చే యంత్రాలుగా పెంచుతున్నారన్నారు. శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి, శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్, మైహోంగ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్ రావు, శాంత బయోటిక్స్ అధినేత డాక్టర్ కె.ఐ వరప్రసాదరెడ్డి అన్నమయ్యపురం వ్యవస్థాపకురాలు శోభరాజు పాల్గొన్నారు.

## సత్తా చాటిన ఓబుల్‌రెడ్డి స్కూల్ విద్యార్థులు



**సాక్షి, సిటీబ్యూరో:** కబడ్డీ జూనియర్స్ 2023 సీజన్-4లో పి.ఓబుల్‌రెడ్డి జట్టు హైదరాబాద్ చాంపియన్‌గా నిలిచి నేషనల్స్‌కు అర్హత సాధించింది. ఆదివారం ఉదయం గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సిస్టర్ నివేదిత పాఠశాల జట్టును 25–14 పాయింట్లతో ఓడించింది. లీగ్స్ స్టేజీకి మొత్తం 24 జట్లు కేబీడీ జూనియర్ పోటీలకు అర్హత పొందగా, అందులో నుంచి 8 జట్లు సూపర్–8కి చేరుకున్నాయి. వీటిలో నుంచి ఓబుల్‌రెడ్డి స్కూలు జట్టు విజయం సాధించి చాంపియన్‌గా నిలిచి నేషనల్స్‌కు అర్హత సాధించింది. వివిధ నగరాల నుంచి ఎంపికైన 12 జట్లతో జాతీయస్థాయిలో ఫైనల్స్ నిర్వహిస్తారు. వీటి వేదిక, తేదీలను స్టార్‌స్పోర్ట్స్ త్వరలో ప్రకటిస్తుంది.

## మ్యూజియంలో అధునాతన గ్యాలరీ ప్రారంభం

**బహదూర్‌పురా:** చారిత్రక సాలార్‌జంగ్ మ్యూజియంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో కొత్తగా నిర్మించిన రెండు అధునాతన బ్లాక్‌లను గ్యాలరీలను కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ...1951 డిసెంబర్ లో ప్రారంభమైన ఈ ప్రతిష్టాత్మకమైన సాలార్‌జంగ్ మ్యూజియం.. రోజు రోజుకూ కొత్త కళాకృతులు, దేశ,విదేశాల చిత్రాలను ప్రదర్శిస్తూ..72 ఏళ్లుగా సందర్శకులను ఆకట్టుకుంటూనే ఉందన్నారు.

ఏ దేశానికైనా, జాతికైనా తన అస్తిత్వం కోసం.. దేశ చరిత్రను, సంస్కృతిని, కళలను, సంప్రదాయాలను, భాషను కాపాడుకోవడం చాలా అవసరమన్నారు. మన కళలను కాపాడుకోవడం, కళాకృతులను సంరక్షించుకోవడం కూడా మన బాధ్యత అన్నారు.

## ఉడాన్ పథకంతో సామాన్యులకూ విమానయానం

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



సారంగ్ టీమ్ సభ్యులతో బండారు దత్తాత్రేయ

**సనత్‌నగర్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉడాన్ పథకం సామాన్యులను సైతం విమాన ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించిందని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన వింగ్స్ ఇండియా–2024 ఏవియేషన్ ప్రదర్శనను చివరి రోజు ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో కొలువుదీరిన పలు విమానాలను దత్తాత్రేయ ఎక్కి ఆసక్తిగా తిలకించారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సారంగ్ టీమ్ బృందంతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ తదితర కార్యక్రమాల ద్వారా దేశీయ ఉత్పత్తి రంగానికి తగిన ప్రోత్సాహం లభిస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగానే విమానయాన రంగం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు.


# సాక్షి క్లాసిఫైడ్స్

**FLAT FOR SALE**

- జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10 C గాయత్రి హిల్స్‌లో నూతనంగా నిర్మించిన 2BHK ఫ్లాట్స్ (1100sft) గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి. లోన్ సౌకర్యం కలదు. క్లియర్ టైటిల్. ఫోన్: 9848212776. [HA-812]
- 3 BHK Flat @ Kothapet Mohan Nagar, Deluxe 3 BHK Flat For Sale 2200 sft 1st & 5th Floor Availble, Each Floor 1 Flat. 7013396800 / 9502793854. [H-189642]
- Near Kowkur, Yapral, Sec-bad. Ready To Occupy 3BHK Flats 1,715 Sft & 1,945 Sft. Gated Community, Clubhouse. Nr. GHMC Park. Must See! 9246503300/ 9391059595/9502759933. [HA-1116]
- Mallapur, Near Nacharam, Habsiguda. 3BHK Premium Flats For Resale. Gated Community, Clubhouse, Ready To Occupy. Brand New. Call : 7702226063. [HA-1115]

**LAND FOR SALE**

- తిరుపతి జిల్లా, నెల్లూరు జిల్లాకు దగ్గరలో రోడ్డు ప్రక్కన 250 ఎర్రచందనం మరియు టేకు చెట్లు గల 110 ఎకరాల పొలం అమ్మబడును. వివరములకు సంప్రదించండి: 90007 31560. [NA-11620]

**PLOT FOR SALE**

- బెంగుళూరు హైవే కొత్తూరు (నందిగామ) దగ్గర హైవేకి అతి సమీపంలో HMDA అప్రూవల్ గల రన్నింగ్ వెంచర్‌లో ప్లాట్స్ కలవు. సంప్ర:: 7799893899. [G-3119]
- Shankarpally R1 Zone Semi Commercial 2600 Sq.yds per Sq.yard 60000 40 Feet Road. Ph: 9347768712, 8008007786. [HA-96010]

**FOR SALE**

- తూముకుంటలో రోజుకు 22,000/- నుండి 25,000/- కౌంటర్ ఉన్న కర్రీ పాయింట్ అమ్మకమునకు ఉన్నది. ఫోన్: 8367626626. [H-793579]

**BUSINESS SERVICE**

- మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739. [H-801561]

**BUSINESS OFFER**

- 'అద్భుత అవకాశం E bike కేవలం 15,000/- రూ. "పెట్టుబడితో మీరు సొంతంగా వ్యాపారం చేసి రోజు 5,000/- నుండి 50,000/- నిరుద్యోగులు ప్రతిఒక్కరూ సంపాదించే సువర్ణ అవకాశం. సంప్ర: 9666689464. [H-801464]

**OLD AGE HOME**

- వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-788123]

**Wanted**

- అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ & ITI అసిస్టెంట్స్ మెకానిక్స్ కావలెను. మంచి జీతం ఇవ్వబడును. సంప్ర: 9392663777, 9246663777, 9290003999 [HA-1348]
- బాలాజీ గ్రూప్(AP&న్యూఢిల్లీ నెం-1)శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు, ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281465283/9281465282. [H-787776]
- ఆటోమేటిక్ కార్ డ్రైవింగ్‌లో అనుభవం ఉన్న డ్రైవర్ / ఆఫీస్ నందు పని చేయుటకు ఆఫీస్ బాయ్ కావలెను. సంస్థ పేరు: PVC Projects, Hyderabad. కాల్: 040-23338080. సంప్రదించు సమయం: Mon - Sat 10am - 5pm. [H-788276]
- రామ రామ కృష్ణ కృష్ణ హోమ్ కేర్ నందు పనిచేయుటకు వృద్ధుల, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనము, జీతం: 16k to 18k ఏజెంట్ కమీషన్ 5k. ఫోన్: 8374477022 / 8919437897. [H-788060]
- Hydలో పనిచేయుటకు సెగార్డ్స్, సెక్యూరిటీ సూపర్ వైజర్స్ లేడీ గార్డ్స్, ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. ఏరియా: బాలానగర్, మియాపూర్, జీడిమెట్ల, గండిమైసమ్మ కొల్లూరు రూం ఫ్రీ మెట్రో మేనేజ్‌మెంట్ ఫోన్: 9963077722/ 9885657755 [H-801465]
- హైదరాబాద్ లో ఉద్యోగ అవకాశం ఇంటి పని మనిషి కావలెను. (F) వయస్సు: 18-25 సం. & ఆంధ్ర వంట మనిషి కావలెను (F) (రూమ్+భోజనం వసతి కల్పించబడును). సంప్ర: 9133343652 / 7337322201. [H-787963]
- రామకృష్ణ గ్రూప్ (AP&న్యూఢిల్లీ నెం-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల, పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం 15-21 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9515119570/9505701122. [H-787775]
- మహిళలు కావలెను. ఫ్రీ రూం+భోజనం, జీ: 18-30 వేల వరకు మ్యాన్‌పవర్ ఏజెంట్‌కు 1 మనిషికి 5000/- రూ.ల కమీషన్. ఫోన్: 9966310431/ 8886733005. [HA-10846]
- హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [H-793680]
- పూజిత హోంకేర్: పేషెంట్లు, బేబీకేర్, ఇంటి / వంట పని చేయుటకు స్త్రీలు, పురుషులు, కేర్ టేకర్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీతం: 15-20 వేలు. ఫోన్: 8801821210. [H-793577]

**FACULTY TEACHERS**

- Required Teachers for Maths, Social St, Telugu, Pre - Primary Teachers, Lady Office Clerks & Ayas Wanted For A Reputed School @ Fathe nagar, Bala Nagar. PH: 9985187777. [H-787912]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

| | | | |
|---|---|---|---|
| దిల్‌సుఖ్‌నగర్ | 9912348016 | రాజేంద్రనగర్ | 9010202372 |
| ఎల్.బి.నగర్ | 9912225475 | కూకట్‌పల్లి | 9912225476 |
| కాప్రా | 9010202751 | బాలానగర్ | 9951602997 |
| సికింద్రాబాద్ | 9010299013 | మల్కాజిగిరి | 9505507562 |
| చిక్కడపల్లి | 9010188892 | మెహదీపట్నం | 9912225468 |
| అబిడ్స్ | 9705144457 | చందానగర్ | 9010213322 |
| అమీర్‌పేట్ | 9505507563 | ఉప్పల్ | 7095250115 |

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

## సికింద్రాబాద్ స్థానం కోసం వినతి



భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న వేణుగోపాల్

బంజారాహిల్స్: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు స్థానాన్ని తనకు కేటాయించాలని కాంగ్రెస్ నేత, సీపీ వేణుగోపాల్ స్వామి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆదివారం కలిసి వినతిపత్రంతో పాటు బయోడేటా అందించారు. తాను కాంగ్రెస్ పార్టీలో 15 ఏళ్లుగా పని చేస్తున్నానని వేణుగోపాల్ చెప్పారు. సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని నియోజక వర్గాలపై తనకున్న పట్టును వివరించడంతో పాటు తన స్వచ్ఛంద సంస్థ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో సీనియర్ నేత ధర్మేందర్ కూడా ఉన్నారు.

## 'ఆమ్ ఆద్మీ' ఆధ్వర్యంలో కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

లిబర్టీ: శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠని పురస్కరించుకొని ఆమ్ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రామ్ ధున్, సుందరకాండ, సత్యనారాయణ స్వామి వ్రతం, మహాహారతి, మహాప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలను మతంతో కలపడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. సమావేశంలో ఆప్ నేతలు జి.సతీశ్‌కుమార్, కొండల్ శ్రీనివాస్, నాగరాజు, శివాజీ, టి.రాకేశ్‌సింగ్ ఉన్నారు.

## బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న సినీ రచయిత చిన్ని కృష్ణ

పంజగుట్ట: మనది రాచరిక ప్రభుత్వమైతే ఎప్పుడో రామాలయం నిర్మితమయ్యేదని ప్రముఖ సినీ రచయిత, శ్రీరామ భక్తులు చిన్ని కృష్ణ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1992లో లక్షలాది మంది కరసేవకులు డిసెంబర్ 6వ తేదీన స్వల్ప వ్యవధిలో అక్కడ నిర్మించిన మసీదును నేలమట్టం చేశారని గుర్తుచేశారు. దీంతో అప్పటి ప్రభుత్వం డిసెంబర్ 6ను బ్లాక్‌డేగా ప్రకటించింది.. ఇప్పుడు ఇదే తేదీని రామమందిర నిర్మాణానికి శంఖం పూరించిన రోజుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ రెండోసారి బీజేపీని రెండోసారి కేంద్రంలో అధికారంలోకి తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

లిబర్టీ: సబ్జెక్టుల్లో ఆల్ రౌండర్ ప్రతిభ చూపినందుకు కేవీ రంగారెడ్డి కాలేజీ డిగ్రీ విద్యార్థి స్వాతి సావర్ధికకు కళాశాల ప్రిన్సిపాల్ బాలభాస్కర్, కార్యదర్శి రామనాయుడు మెరిట్ గోల్డ్ మెడల్ అవార్డు అందించారు. ఆదివారం ఈ అవార్డుల ప్రదానం జరిగింది. స్వాతి అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ మార్కులు సాధించడంతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## కనుల పండువగా సీతారాముల శాంతి కల్యాణం



సీతారాముల విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు

ఫిలింనగర్: అయోధ్య శ్రీ రాముని విగ్రహప్రతిష్ఠ సందర్భంగా ఫిలింనగర్ దైవ సన్నిధానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం కార్యక్రమాల్లో భాగంగా సీతారాముల విగ్రహాలకు విశేష నదీ సాగర జలాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీ సీతారామ స్వామి వారి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు.

## వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న స్వాములు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని స్రవంతినగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి మంగళ శాసనాలతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. భోజిరెడ్డి నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎలక్షన్ రెడ్డి, తెలుకుంట రమేశ్‌గుప్తా పాల్గొన్నారు. కార్యక్రమాలను స్రవంతినగర్ సంక్షేమ సంఘం సభ్యులు పీపీఎస్ యాదవ్, భోజిరెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, మనోహర్‌బాబు, మణిప్రసాద్, రమేశ్, సుధీర్, విద్యాసాగర్, శ్రీనివాస్, నాగేశ్‌సాగర్, రాము, లక్ష్మీనారాయణ, రామ్మోహన్‌రావు నిర్వహించారు.

## మన సంస్కృతిని భావితరాలకు అందించాలి

ముషీరాబాద్: అంతరించిపోతున్న మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఆదివారం ముషీరాబాద్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ముషీరాబాద్ పద్మశాలి సంఘం ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అతినగరం సుదేశ్, మనోహర్, సీనియర్ కత్తుల సుదర్శన్, రమేశ్, సంఘం కోశాధికారి సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు గణేశ్, యువజన అధ్యక్షుడు శ్రీధర్, మహిళా కమిటీ అధ్యక్షురాలు ఊర్మిళ ఉన్నారు.

# 208 దరఖాస్తులే!

- ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో స్పందన కరువు



ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో వివరాలు తెలియజేస్తున్న బీఎల్‌వోలు

బంజారాహిల్స్: రెండురోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి స్పందన కరువైంది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో అధికారులు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 240 పోలింగ్ కేంద్రాలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 329 బూత్‌లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌వోలతో పాటు ఎన్నికల సిబ్బంది, అధికారులు క్యాంపెయిన్ నిర్వహించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొదటిరోజు ఓటరు నమోదుకు 128 దరఖాస్తులు రాగా, రెండో రోజు 80 వరకు మాత్రమే వచ్చినట్లు అధికారులు తెలిపారు. తప్పుల సవరణకు కూడా అర్జీలు వచ్చినట్లు బీఎల్‌వోలు పేర్కొన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, సర్కిల్–18 డీసీ ప్రశాంతి తెలిపారు. అయితే, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో స్పందన కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇప్పటికీ అందని కార్డులు..**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమాల్లో అనేక ఫిర్యాదులు వచ్చాయి. దీనికితోడు తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు కూడా సరిగ్గా నమోదు చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. అధికారులు ఎన్నికల సమయంలో తమకు పోల్ స్లిప్‌లు అందించలేదంటూ చాలామంది ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఫిర్యాదు చేయడం గమనార్హం.

## చేతి వృత్తులను ప్రభుత్వం ఆదుకోవాలి

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



కేలండర్ ఆవిష్కరిస్తున్న కూనంనేని, చాడ తదితరులు

హిమాయత్‌నగర్: ప్రపంచీకరణ ఫలితంగా ఉపాధి కోల్పోతున్న చేతి వృత్తిదారులను ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు కోరారు. అనేకమంది చేతి వృత్తిదారులు ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. హిమాయత్‌నగర్ అమృత ఎస్టేట్స్‌లో తెలంగాణ చేతి వృత్తిదారులు సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక వృత్తిదారులు సంఘం 2024 నూతన సంవత్సర కేలండర్‌ను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డితో కలసి కూనంనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృత్తికులాలు, ఫెడరేషన్లు, పేద బీసీ కులాలకు రుణాలు, సబ్సిడీలు, పథకాలను గత ప్రభుత్వం అందించలేదన్నారు. రాష్ట్రంలోని చేతి వృత్తులను కాపాడుకోవడానికి నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సాహాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేతివృత్తిదారులు ఉద్యమం చేపట్టాలని కూనంనేని పిలుపునిచ్చారు. రాష్ట్ర చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలో బీసీ కులగణన చేపట్టకపోవడంతో బీసీలు విద్య, ఉపాధి, ఉద్యోగపరంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ తక్షణమే ఓబీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరుగంటి కృష్ణ, నేతలు జి.నరేందర్, ఎ.విజయకుమార్, తెలంగాణ రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న దీపక్‌రెడ్డి, నవీన్‌యాదవ్

వెంగళరావునగర్: అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని శ్రీ రామసేన అసోసియేషన్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి హైలామ్‌కాలనీలోని విజయదుర్గా పోచమ్మతల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకెల దీపక్‌రెడ్డి, కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి వి.నవీన్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయోధ్య మందిరాన్ని ఒక్కసారైనా దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు బండి రాజేందర్ ముదిరాజ్, కోట్ల శ్రీనివాస్, జి.రవికుమార్, కె.లక్ష్మణ్‌రెడ్డి, జి.ప్రభాకర్, రాజు, వడ్డె శ్రీను, సంపత్, రోహిత్, బీజేపీ సీనియర్ నేతలు గంగరాజు, ప్రేమ్, జ్ఞానేశ్వర్, సతీశ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

## 'చైర్మన్' పదవి కురుమలకే ఇవ్వాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

పంజగుట్ట: కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయ చైర్మన్ పదవి గొల్ల కురుమలకు ఇవ్వాలని రాష్ట్ర కురుమ సంఘం కోరింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం అధ్యక్షుడు సంపత్ కురుమ, ప్రధాన కార్యదర్శి మాదరం కృష్ణ కురుమ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లన్న స్వామికి సంప్రదాయప్రకారం బండారీతో పూజలు నిర్వహించాలన్నారు. కానీ, ఇప్పుడు పూజలు చేస్తున్న వారు స్వామి వారిని బండారీకి దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గొర్రెల యూనిట్ల కోసం 15 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 45 వేల మందికి మాత్రమే మంజూరయ్యాయని చెప్పారు. మిగిలిన వారు అప్పులు చేసి నగదు చెల్లించినా వారికి యూనిట్లు, నగదు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. త్వరలోనే సంఘం ఆధ్వర్యంలో సీఎంను కలిసి తమ సమస్యలను విన్నవిస్తమని చెప్పారు. వంశీ కురుమ, శ్రీశైలం, మారయ్య, రమణయ్య, రమాకాంత్, రాజు, రమేశ్, పరశురాం పాల్గొన్నారు.

## క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంది



క్రీడాకారులతో మహేశ్‌కుమార్ గౌడ్

వెంగళరావునగర్: క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ స్టేట్ కరాటే దూ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శనివారం నుంచి యునిక్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన కరాటే కిలాడీస్–1 జాతీయ స్థాయి కరాటే పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కేవలం తమ పిల్లల చదువుపైనే దృష్టిసారిస్తున్నారని అన్నారు. ఇది సరైన నిర్ణయం కాదని, విద్యార్థికి ఆసక్తి ఉన్న రంగాల్లో వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం కరాటే పోటీల్లో విజయం సాధించిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. నిర్వాహకులు రాజేశ్వరి చౌహాన్ మాట్లాడుతూ.. రెండురోజుల పాటు జరిగిన ఈ కరాటే పోటీల్లో దాదాపు పది రాష్ట్రాలకు చెందిన సుమారు వెయ్యిమంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరేశ్, సహదేవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జీఎన్ఐటీఎస్‌లో ప్రత్యేక కార్యక్రమాలు

గోల్కొండ: నేడు అయోధ్యలో జరగనున్న శ్రీరామ ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని తమ కళాశాలలో కార్యక్రమ లైవ్ స్ట్రీమింగ్‌తో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జీ.రాఘవరెడ్డి తెలిపారు. కళాశాలలోని ఆడిటోరియంలో అయోధ్యలో జరుగుతున్న కార్యక్రమం లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందని దీంతో పాటు కళాశాలలో వేద పండితులచే ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం కళాశాల ప్రాంగణంలో 21 సార్లు ఓంకార నినాదాలు, రాముడిపై శ్లోకాలు, రామభజన, హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా మధ్యాహ్నం 2 గంటలకు హనుమాన్ చాలీసా పఠనం, శేషాద్రి రామప్రతిష్ఠపై ప్రత్యేక ప్రసంగం, జ్యోతి ప్రజ్వాలన, మంగళ హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

### 'ఎన్‌వైకేఎస్' మెంబర్‌గా భరత్‌గౌడ్



రహమత్‌నగర్: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్(ఎన్‌వైకేఎస్) హైదరాబాద్ జిల్లా అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా రహమత్‌నగర్‌కు చెందిన బీజేవైఎం నాయకుడు వాల్దాస్ భరత్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేంద్ర క్రీడలు, యువజన సర్వీసులు శాఖ ద్వారా ఉత్తర్వులు అందుకున్నారు. భరత్ గౌడ్ విద్యార్థి దశ నుంచే ఆర్ఎస్ఎస్‌లో కీలకంగా పని చేశారు. ప్రస్తుతం భరత్‌గౌడ్ హైదరాబాద్ జిల్లా బీజేవైఎం కార్యదర్శిగా పనిచేస్తున్నారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.గౌతంరావు, బాలప్రకాశ్‌కు భరత్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

### వివాహ పరిచయ వేదికలతో మేలు

కాచిగూడ: వివాహ పరిచయ వేదికలతో ఎంతోమందికి మేలు జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో ఆదివారం నిర్వహించిన మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. వెంకటేశ్వర్ రావు, లక్ష్మణ్, శంకర్, సూర్యప్రకాశ్, రాఘవేందర్, హనుమంతరావు, రాధాకృష్ణ, శ్రీనివాస్, సురేశ్ బాబు, దామెర జ్ఞానేశ్వర్, జితేందర్, వినోద్ కుమార్, మణికొండ రమేశ్ కుమార్, ఏనుగుల మాణిక్ ప్రభు పాల్గొన్నారు.

### అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కేలండర్ ఆవిష్కరణ

కవాడిగూడ: హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మల్లారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక జలమండలి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారత్నం, ప్రధాన కార్యదర్శి బి కిరణ్ కుమార్, జలమండలి కార్మికులు పాల్గొన్నారు.

### 24న అనసూయ సంస్మరణ సభ

కాచిగూడ: మున్నూరుకాపు భవన్‌లో ఈ నెల 24 న వీరభద్ర స్వామి సేవా సమితి వ్యవస్థాపకురాలు, ప్రముఖ సంఘ సేవకురాలు కాసుల అనసూయ సంస్మరణ సభ జరగనుంది. ఈ విషయాన్ని రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు, శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి సలహాదారులు కొండూరు వినోద్ కుమార్ ఆదివారం తెలిపారు. అనసూయ జ్ఞాపకార్థం పాటలు, భజనలు, భక్తీ గీతాలు, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మించు ఆనంద్ రావు, ఉద్దాడి చిత్తరంజన్ రావు, మార్గం విజయ్ కుమార్, హరిబాబు పాల్గొన్నారు.

### నేడు ఉచిత దంత చికిత్సా శిబిరం

నల్లకుంట: అయోధ్య ఆలయ ప్రారంభం పురస్కరించుకొని సోమవారం(నేడు) దత్తసాయి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉచిత దంత చికిత్సా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్.రంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశా రు. నల్లకుంట పీవర్ ఆస్పత్రి ఎదురుగా, అంబర్‌పేట, రామంతాపూర్, నాగో ల్, చైతన్యపురిలో ఉన్న దత్తసాయి దంత వైద్యశాలల్లో ఈ శిబిరం ఉంటుందన్నారు. ఫోన్: 92463 66944కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చు.

### ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నాగేశ్వర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలతో పాటు రోడ్డు సౌకర్యం ఉన్న పల్లెలకు బస్సుల సంఖ్య పెంచాలని, విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసులు నడిపించాలని కోరారు. మహాలక్ష్మి పథకం వల్ల కోల్పోతున్న ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి ఆర్టీసీకి చెల్లించాలని, ఇందుకోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని సూచించారు. సిబ్బందిని కుదించే చర్యలను వీడి.. వెంటనే సంస్థలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అలాగే ఆర్టీసీ విలీన ప్రక్రియను ప్రభుత్వం సత్వరమే పూర్తి చేయాలని కోరారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పాల్గొన్నారు.



దీపాలతో వెలిగిపోతున్న శ్రీరాంనగర్

## మహోత్సవానికి ఆలయాలు ముస్తాబు

రహమత్‌నగర్: నేడు అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శ్రీరాంనగర్, ప్రతిభానగర్, కార్మికనగర్, రహమత్‌నగర్ ప్రాంతాల్లోని ఆలయాలతో పాటు బోరబండ డివిజన్‌లోని పలు ఆలయాల వద్ద కాషాయతోరణాలు ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు శోభాయాత్రలు నిర్వహించానున్నారు. ఇందుకోసం ఆలయాల కమిటీలు ఏర్పాట్లు పూర్తిచేశాయి. మరోవైపు రేపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మధురానగర్, బోరబండ పోలీసులు ప్రతిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



వీధుల్లో కాషాయ తోరణాలు

## వైభవంగా స్వామివారి జలాధివాసం



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ వినాయకనగర్ బస్తీలో పర్వతాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత పరివార విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో గణపతి పూజ, వేద పారాయణం, ఆవాహిత పూజలు, గణపతి హోమం, పంచసూక్త నవగ్రహ విష్ణు సహస్ర నామహోమం, రామనామ తారక మంత్ర హోమం, స్వామివార్లకు జలాధివాసం, పంచామృతాభిషేకం, లఘుపూర్ణాహుతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల విగ్రహాలకు ధాన్యాధివాసం, ఫలపుష్ప శయ్యాధివాసం వేడుకలను వైభవంగా నిర్వహించారు. నేడు జరగనున్న స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపనకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.



జలాధివాస కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు




సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

9912220379
9640081203

క్లుప్తంగా...

## అంతా అప్పులే.. అభివృద్ధి ఎక్కడ?

ఏపీ కాంగ్రెస్ నూతన చీఫ్ షర్మిల విమర్శలు



సాక్షి, అమరావతి/పెనమలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చినా రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని ఏపీ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన షర్మిల విమర్శించారు. ఆదివారం విజయవాడలో ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ల లోన్లతో కలిపి రాష్ట్ర అప్పులు రూ.పది లక్షల కోట్లకు చేరాయన్నారు. విభజన నాటికి రాష్ట్ర అప్పులు రూ.లక్ష కోట్లు ఉంటే చంద్రబాబు అమరావతి రాజధాని అంటూ 3 డీ గ్రాఫిక్స్ చూపించి రూ.రెండు లక్షల కోట్లు అప్పు చేశారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదా కోసం ప్రతి రోజూ కొట్లాడి దీక్షలు చేశారని, ఎంపీలంతా మూకుమ్మడి రాజీనామా చేస్తే హోదా ఎందుకు రాదో చూస్తానన్నారని, కానీ అధికారంలోకి వచ్చాక నిజమైన ఉద్యమం చేయలేదని విమర్శలు చేశారు. 'జగన్ వచ్చాక మూడు రాజధానులని చెప్పి ఒక్కటి కూడా కట్టలేదు. ఆంధ్ర రాష్ట్రంలో, కనీసం విజయవాడలో ఒక్క మెట్రో అయినా ఉందా? కొత్త పరిశ్రమలైనా వచ్చాయా? ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా? రోడ్లయినా నిర్మించగలిగారా? ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వటానికి కూడా డబ్బులు లేవు'అని షర్మిల విమర్శించారు. మణిపూర్‌లో 2 వేల చర్చిలను ధ్వంసం చేసినా, అరవై వేల మంది క్రైస్తవులను నిర్వాసితులను చేసినా జగన్ మాట్లాడలేదన్నారు. వైఎస్సార్ చనిపోయాక పోలవరం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. కాగా, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా గిడుగు రుద్రరాజు బాధ్యతలు స్వీకరించగా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

## 'బ్రో'.. బాబెప్పుడూ ఇంతే!

సీట్లపై ఆఖరి నిమిషం దాకా నాన్చే ధోరణిలో చంద్రబాబు

చివర్లో అతి కొద్ది సీట్లతో పవన్‌కు చెక్ పెట్టే యోచన

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

# బాబు కోసం బలి!

## టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చివరి అస్త్రంగా షర్మిల

## వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును సీఎంను చేయడం ఎలా? అన్నదే షర్మిల లక్ష్యంగా కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. సంక్షేమ పథకాలు, సుపరిపాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక అన్ని అస్త్రాలు ప్రయోగించిన చంద్రబాబు చివరి ప్రయత్నంగా షర్మిలను తీసుకొచ్చారని చెప్పారు. చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చడం కోసమే షర్మిల పీసీసీ చీఫ్‌గా రాష్ట్రానికి వచ్చారన్నది ప్రజలందరికీ అర్థమవుతోందన్నారు. ఇదంతా చంద్రబాబు ఎత్తుగడేనని చెప్పారు. గతంలో షర్మిలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడిన ఎల్లో మీడియా ఇప్పుడు ఆమెను భుజానికెత్తుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సజ్జల మీడియాతో మాట్లాడారు. నిన్నటిదాకా తెలంగాణలోనే తన బతుకు, చావు అంటూ వైఎస్సార్ టీపీని నడిపిన షర్మిల ఇప్పుడు హఠాత్తుగా పీసీసీ చీఫ్‌గా రాష్ట్రానికి ఎందుకొచ్చారో చెప్పాలన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి బతికి ఉంటే కాంగ్రెస్‌పై ఉమ్మేసేవారంటూ నిన్నటిదాకా తూర్పారబట్టిన షర్మిల ఇప్పుడు రాష్ట్రంలో ఆ పార్టీకి నేతృత్వం వహించడానికి కారణాలేంటో చెప్పాలని నిలదీశారు. అడ్డగోలుగా విభజించి ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. రాష్ట్రంలో గత ఎన్నికల్లో నోటాకు 1.28 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 1.17 శాతం ఓట్లు వచ్చాయని సజ్జల గుర్తు చేశారు. అలాంటి కాంగ్రెస్‌ను బతికించడమంటే శవానికి జీవం పోయటమేనని ఎద్దేవా చేశారు. సజ్జల ఏమన్నారంటే...

### హోదాపై కాంగ్రెస్ తరఫున వివరణ ఇవ్వాలి..

కాంగ్రెస్ పార్టీ చంద్రబాబుతో కుమ్మక్కై అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజించి తీరని అన్యాయం చేసింది. రాష్ట్ర హక్కులను రక్షించకుండా, ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా ద్రోహం చేసింది కాంగ్రెస్సే. ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చి ఉంటే ఇప్పుడింత పోరాడాల్సిన అవసరమే ఉండదు కదా? తాను చేసిన తప్పులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోయింది. ఆ పార్టీ తరఫున వకాల్తా పుచ్చుకున్న షర్మిల వాటిపై సీఎం జగన్‌ను ప్రశ్నించడం విచిత్రం. కాంగ్రెస్ తరఫున ప్రత్యేక హోదా, రాజధానికి నిధులపై షర్మిల వివరణ ఇవ్వాలి. ప్రత్యేక హోదాపై సీఎం జగన్ ఒకే మాటకు కట్టుబడ్డారు. పోరాటం ఏ పద్ధతుల్లో చేయాలో అలా కొనసాగించడంతోపాటు కేంద్రంపై ఒత్తిడి పెంచి మనపై ఆధారపడే పరిస్థితి వచ్చే వరకూ ఆ అంశాన్ని సజీవంగా ఉంచుతున్నాం. ఎప్పటికప్పుడు హోదా అంశాన్ని ప్రస్తావిస్తూ సరైనా అవకాశం రాగానే సాధించుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. అందులో భాగంగా ప్రధాని సమక్షంలోనే విశాఖ సభలో సీఎం జగన్ హోదా అంశాన్ని గుర్తు చేశారు.

### వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ ద్రోహం..

ఏకపక్ష విభజనతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ మహానేత వైఎస్ కుటుంబానికి తీరని ద్రోహం చేసింది. 2004, 2009లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వైఎస్ చేసిన కృషే ప్రధాన కారణమని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ పలు సందర్భాల్లో చెప్పారు. వైఎస్ మరణానంతరం అక్రమ కేసులు బనాయించి ఆయన పేరును నేరుగా ఎఫ్ఐఆర్‌లో పెట్టిన పార్టీ కాంగ్రెస్. వైఎస్సార్ తనయుడు జగన్‌ను అక్రమంగా 16 నెలలు జైల్లో నిర్బంధించిన పార్టీ కాంగ్రెస్. శంకర్రావు, ఎర్రన్నాయుడు, అశోక్ గజపతిరాజు కలిసి ఆ కేసులు వేశారు. సోనియాగాంధీ చెబితేనే కేసులు పెట్టామని శంకర్రావు పలు మార్లు మీడియాకు చెప్పారు. సోనియా చెప్పినట్టుగా జగన్ విని ఉంటే కేసులు పెట్టేవాళ్లం కాదని అప్పట్లో కాంగ్రెస్‌లో కీలక భూమిక పోషించిన కేంద్ర మాజీ మంత్రి గులాంనబీ ఆజాద్ కూడా చెప్పారు. అంటే అవన్నీ అక్రమ కేసులేనని తెలిసిపోతోంది.

### భాష, యాస బాధాకరం..

పీసీసీ చీఫ్‌గా ప్రమాణ స్వీకారం సందర్భంగా షర్మిల మాట్లాడిన భాష, యాస దివంగత వైఎస్సార్ కుటుంబ సన్నిహితులకు, అభిమానులకు, ఆయన ఆశయాల సాధనకు పేటెంట్ కలిగిన వైఎస్సార్‌సీపీ నాయకులకు బాధ కలిగించింది. సీఎం జగన్ మహానేత వైఎస్ తనయుడిగానే కాకుండా రాజకీయ వారసుడిగా, వైఎస్సార్ ఆశయాల సాధనకు ప్రజలతో మమేకమవుతూ నిబద్ధతతో పని చేస్తున్నారు. షర్మిల వ్యవహార శైలి చూస్తే జాలి కలుగుతోంది. కేవీపీ, రఘువీరారెడ్డి మినహా కాంగ్రెస్‌లో షర్మిలకు పరిచయం ఉన్న వారెవరూ లేరు.

### ప్రసంగాన్ని తయారు చేసి పంపించారు..

రాష్ట్రంలో ఉనికిలో లేని కాంగ్రెస్ పార్టీకి హఠాత్తుగా అధ్యక్షురాలిగా వచ్చి చంద్రబాబు డైలాగులనే షర్మిల చెబుతుంటే జాలి కలగక మరేం అనిపిస్తుంది? జగన్‌కు మద్దతుగా గతంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న షర్మిల ఇప్పుడు ఆయన నియంత అంటూ విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు తన పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకునేందుకు ఏమీ లేకపోవడంతో 56 నెలలుగా కొనసాగుతున్న సీఎం జగన్ సంక్షేమ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారు. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పకుండా ఆమె డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి ఎందుకు వచ్చారు? రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యమైతే ఇక్కడకు వచ్చి ఆమె చేయగలిగింది ఏముంది? ఆమె లక్ష్యం.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం కాదు.. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ఎలా అన్నదే. వైఎస్ అభిమానుల ఓట్లు చీల్చడానికి షర్మిల తోడ్పడతారన్నదే చంద్రబాబు చివరి ఎత్తుగడ. క్రిస్టియన్ మైనార్టీలు, దళితుల ఓట్లు చీల్చడమే లక్ష్యంగా ప్రసంగాన్ని తయారు చేసి షర్మిలకు ఇచ్చి పంపారు.

### ఆ అవసరం, అవకాశం కూడా లేదు..

రాష్ట్రంలో ఉన్నది ఒకటే కాంగ్రెస్ పార్టీ.. అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. హస్తం గుర్తు కాంగ్రెస్ ఎప్పుడో పోయింది. వైఎస్సార్ వారసుడిగా సీఎం జగన్ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. రాష్ట్రంలో మైనార్టీలు, క్రైస్తవులు, ఎస్సీలతోపాటు అందరికీ రక్షణ కల్పించే శక్తి, నిబద్ధత తనకుందని పన్నెండేళ్లుగా సీఎం జగన్ రుజువు చేసుకుంటూనే ఉన్నారు. మతం ఏదైనా వ్యక్తిగతంగానే ఉండాలి కానీ రాజకీయంగా, పరిపాలనలో దాని ప్రభావం ఉండకూడదని బలంగా విశ్వసించే వ్యక్తి సీఎం జగన్. ఏ దేవుడ్ని ఎవరు కొలిచినా అన్నిటి భావం ఒకటే అని నమ్మిన వ్యక్తిగా వాటికి అతీతంగా ఉన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా వారిని రక్షించి అక్కున చేర్చుకుంటున్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు మన వ్యక్తిగత విశ్వాసాలు కాకుండా రాష్ట్రం అవసరాలు, ప్రజల ఆకాంక్షలే మన రాజకీయ విధానాలను నిర్దేశించాలని సీఎం జగన్ బలంగా నమ్ముతారు. కేంద్రంలో ఎవరున్నా వారితో సమన్వయం చేసుకుంటూ వీలైనంత వరకూ రాష్ట్రానికి మేలు చేయాలని భావిస్తారు. సీఎం జగన్ చెల్లెలుగా, మహానేత వైఎస్ కుమార్తెగా తనను ఆదరించే వారి అభిమానాన్ని సైతం పోగొట్టుకునే దిశగా షర్మిల అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.



### అంబేడ్కర్ స్మృతి వనం.. పులకించిన జనం

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడలోని సామాజిక న్యాయ మహా శిల్పం (అంబేడ్కర్ విగ్రహం), అంబేడ్కర్ స్మృతి వనం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో కుటుంబ సమేతంగా వచ్చిన వారితో ఉదయం నుంచే రద్దీ నెలకొంది. సాయంత్రం మరింత పెరిగింది. విద్యుత్ దీపాల వెలుగుల్లో స్మృతి వనం, అంబేడ్కర్ బొమ్మలు, విజువల్ షో వంటివి చూసి పులకించిపోయారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## ఏపీ అభివృద్ధిపై చాలెంజ్‌కు సిద్ధమా?

- పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ అభివృద్ధి జరగలేదంటే ఎలా?
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం/తగరపువలస: ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై చాలెంజ్‌కు సిద్ధమా? తమతో వస్తే.. తాము చేసిన అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపిస్తామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సవాల్ విసిరారు. పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ అభివృద్ధి జరగలేదనడానికి ఆమె ఎవరు.. అంటూ మండిపడ్డారు. మొన్నటి వరకు తెలంగాణ బిడ్డనని తిరిగి.. అక్కడ ఎందుకు పోటీ చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. షర్మిల కాదు కదా.. ఎవరు వచ్చినా తమ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టలేరని, వచ్చేది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. ఆదివారం మధురవాడ ఐటీ సెజ్‌లో గల ఆయన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి అధికారంలో నిలిపిన వైఎస్సార్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చిన విషయాన్ని మరిచి పోయావా? వైఎస్సార్ దయతో కేంద్రంలో అధికారాన్ని పొంది.. ఆయన మరణం తర్వాత వైఎస్సార్ కుమారుడిని 16 నెలలు అన్యాయంగా జైల్లో పెట్టిన సోనియాగాంధీతో ఎలా కలవాలనిపించింది'అని ప్రశ్నించారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్‌లో ఆమె ఎందుకు చేరారో? ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌కు నిజమైన వారసులెవరో రానున్న ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరి మమ్మల్ని టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమో సమీక్షించుకోవాలని షర్మిలకు హితవుపలికారు. ఏపీ ప్రజలపై నిజంగా ప్రేమే ఉంటే అవినీతికి పాల్పడ్డ చంద్రబాబును షర్మిల ప్రశ్నించాలని, రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన చంద్రబాబును నిలదీయాలని సూచించారు. అంతేగానీ దేశంలో ఎక్కడా లేని విధంగా, రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా సంక్షేమాభివృద్ధి చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేస్తావా.. అని ప్రశ్నించారు.

## ఊపందుకున్న కులగణన

41.63 లక్షల కుటుంబాల్లో పూర్తయిన వివరాల నమోదు

సాక్షి, అమరావతి: చరిత్రాత్మక కులగణన కార్యక్రమం ఊపందుకుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఆదివారం కూడా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల వివరాలు నమోదు చేశారు. శుక్రవారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం మొదలు కాగా, ఆదివారం రాత్రి వరకు 41,63,957 కుటుంబాలకు సంబంధించి వివరాల నమోదు పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు. ఆదివారం ఒక్కరోజే 20.36 లక్షల కుటుంబాల వివరాలు నమోదు చేసినట్టు తెలిపారు. మూడు రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లో 11,085 గ్రామ సచివాలయాల పరిధిలో 30.95 లక్షల కుటుంబాల వివరాలు నమోదు పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 3866 వార్డు సచివాలయాల పరిధిలో 10.68 లక్షల కుటుంబాల వివరాల నమోదు పూర్తయినట్టు అధికారులు వివరించారు.

నగర వార్తలు

### టీ తాగి వచ్చేలోపు ల్యాప్‌టాప్ మాయం

వెంగళరావునగర్: ఆఫీసు నుంచి బయటకు వచ్చి టీ తాగేలోపు లాప్‌టాప్ చోరీకి గురైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. విజయ్‌నగర్‌కాలనీకి చెందిన దిగ్విజయ్‌కుమార్ సివిల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 18న జీటీఎస్ కాలనీలోని జెన్‌కో కార్యాలయానికి పని నిమిత్తం వచ్చాడు. ఆఫీసు టేబుల్ మీద ల్యాప్‌టాప్ ఉంచి రోడ్డుమీదకు టీ తాగేందుకు వచ్చా డు. తిరిగి కార్యాలయంలోనికి వెళ్ళి చూడగా అతని ల్యాప్‌టాప్ కనిపించలేదు. చుట్టుపక్కల వారిని వివిధ ప్రాంతాల్లో వెదికినా ఫలితం లేదు. దాంతో ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగిలించబడిన లాప్‌టాప్ విలువ దాదాపు రూ.20 వేలు ఉంటుందని పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### 'పరీక్షా పే చర్చ'కు లాలాపేట ఉపాధ్యాయుడికి ఆహ్వానం



తిరుపతిరెడ్డి


లాలాపేట: దేశ ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులను ద్దేశించి నిర్వహించే పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనే అరుదైన అవకాశాన్ని మారేడుపల్లి మండల పరిధి లాలాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు బొల్లెపల్లి తిరుపతి రెడ్డికి దక్కింది. ఈ మేరకు ఇటీవల ప్రధాన మంత్రి నుంచి దీనికి సంబంధించిన లేఖ అందింది. పరీక్షలంటే విద్యార్థుల్లో కలిగే భ యాలను పోగొట్టేందుకు పాటించాల్సిన అంశాలు, విద్యార్థుల సందేహాలపై ప్రధానితో చర్చి ంచే అవకాశం దక్కినందుకు తిరుపతిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా ఫిబ్రవరిలో జరిగే పరీక్ష పే చర్చా కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.

### యువకుడిపై దాడిచేసిన మైనర్లపై కేసు

బంజారాహిల్స్: బాలికలను బెదిరించడమే కాకుండా యువకుడిపై దాడి చేసి కత్తితో బెదిరించిన మైనర్ల పై పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్‌పేట చెందిన జఫ్రాన్ తన స్నేహితులతో కలిసి ఫిలింనగర్లో ఓ విందుకు హాజరయ్యాడు. స్నేహితులైన ఇద్దరు బాలికలతో కలిసి మాగంటి కాలనీ సమీపంలో ఛాట్ తినేందుకు వచ్చాడు. అక్కడే కొంత మంది మైనర్లు స్నేహితుడి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వీరిలో ఐదుగురు మైనర్లు బాలికలను ఏడిపించారు. దీంతో జఫ్రాన్ అడ్డుతగిలి ఎందుకు ఏడిపిస్తున్నారంటూ ప్రశ్నించాడు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగి గొడవ జరిగింది. ఐదుగురు కలిసి జఫ్రాన్ తీవ్రంగా కొట్టారు. కత్తితో బెదిరించారు. బాలికలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మైనర్లను జువైనల్ కోర్టులో హాజరుపర్చనున్నారు.

# కరసేవ చేసి జైలుకు వెళ్లా

- 1990లో నగరం నుంచి అయోధ్యకు బయలుదేరాం
- అలహాబాద్‌లో అడ్డుకుని జైలుకు పంపిన ప్రభుత్వం
- 18 రోజులకు ప్రమాణ్ పత్ర్ ఇచ్చి వదిలారు
- 1992 నాటి కరసేవలోనూ పాల్గొన్నా
- 'సాక్షి'తో అనుభవాలు పంచుకున్న నారాయణ్‌రావు





సాక్షి, సిటీబ్యూరో: 'బాహ్య ప్రపంచానికి 1992లో జరిగిన కరసేవ మాత్రమే తెలుసు. అయితే దీనికి ముందు రెండుసార్లు ఇలాంటి ప్రయత్నాలే జరిగాయి. అతి కొద్దిమందికి మాత్రమే వాటి విషయం తెలుసు' అంటూ సంతోష్‌నగర్‌కు చెందిన జమలాపురం సాయి నారాయణ్ రావు తన అనుభవాలను వివరించారు. 1990, 1992ల్లోనూ కరసేవలో పాల్గొన్న ఈయన తొలి సేవలో మీర్జాపూర్ జైలుకు వెళ్ళారు. అక్కడే 18 రోజులు గడిపి ప్రమాణ్ పత్ర్‌తో బయటకు వచ్చారు. సోమవారం అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో ఆయన ఆదివారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు నారాయణ్ రావు మాటల్లోనే...

**కేశవ్‌రావు శతజయంతి వేడుకలే స్ఫూర్తి...**

అయోధ్య రామమందిరం నిర్మాణానికి సంబంధించి 1992కు ముందు రెండుసార్లు కర సేవకు ప్రయత్నాలు జరిగాయి. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవ్‌రావ్ బలిరామ్ హేడ్గేవర్ శత జయంతి వేడుకలు 1989లో ప్రారంభమయ్యాయి. వీటి స్ఫూర్తితో 1990 అక్టోబర్ 31న అయోధ్యలోని కర సేన పురం వరకు వెళ్ళాలని, అక్కడి వివాదాస్పద స్థలంలో మందిరం నిర్మించాలనే వాదన ముమ్మరమైంది. అదే కరసేవకు సంబంధించిన కీలక తొలి ముహూర్తం. అదే ఏడాది సెప్టెంబర్‌లో ఎల్‌కే అద్వానీ సోమ్‌నాథ్‌లో రామ్ రథ్ యాత్ర ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా రామ్ శిల, రామ్ జ్యోతి కార్యక్రమాలు నిర్వహించాం. ప్రతి ఇంటికీ తిరుగుతూ స్టిక్కర్లు, కీచైన్లు విక్రయిస్తూ నిధులు సమీకరించాం. ఇలా వచ్చిన నిధుల నుంచి అయోధ్యకు వెళ్ళే ఒక్కో కరసేవకుడికి ఖర్చుల నిమిత్తం రూ.400 చొప్పున ఇచ్చారు.


**ఆలె నరేంద్ర నేతృత్వంలో ఇక్కడ నుంచి...**

పాతబస్తీకి చెందిన భాగ్యనగర్ జిల్లా ఇన్‌చార్జ్ ఆలె నరేంద్ర నేతృత్వంలో హైదరాబాద్‌కు చెందిన కరసేవకులం బయలుదేరాం. 1990 అక్టోబర్ 21 సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాం. దారిలో ఎన్నో అడ్డంకులు వస్తాయని, వాటిని అధిగమిస్తూ అయోధ్యకు చేరడానికి పది రోజులు పట్టే అవకాశం ఉందనే ఇంత ముందర రైలు ఎక్కాం. మరుసటి రోజు మా రైలు అలహాబాద్ వద్దకు చేరుకునేసరికి పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ నుంచి కరసేవకులను బస్సుల్లో మీర్జాపూర్‌లో ఉన్న సెంట్రల్ జైలుకు తరలించారు. అదే నెల 23 నుంచి దాదాపు 18 రోజుల తర్వాత నవంబర్ 8న ప్రమాణ్ పత్ర్ ఇచ్చి విడుదల చేశారు. అక్కడ నుంచి బందోబస్త్ మధ్య అయోధ్య వెళ్ళి బాలరాముడిని దర్శనం చేసుకుని వచ్చాం. ఆపై 1992 డిసెంబర్‌లో మరో కరసేవకు ముహూర్తం ఖరారైంది.

**1992లో ఘట్‌నాయక్‌గా కరసేవలో...**

నగరానికి చెందిన సుభాష్‌చందర్ జీ 1992 నాటి కర సేవ సందర్భంలో ఆర్ఎస్ఎస్ వాహిని ప్రముఖ్‌గా ఉన్నారు. అప్పట్లో ఘట్‌నాయక్ హోదాలో డిసెంబర్ 3 సాయంత్రం మిగిలిన కరసేవకులతో కలిసి సికింద్రాబాద్ నుంచి రైలులో బయలుదేరాం. అప్పట్లో ప్రతి కరసేవకుడికీ ఓ గుర్తింపు కార్డు సైతం జారీ చేశారు. అలహాబాద్‌లో రైలు దిగి అక్కడ నుంచి బస్సుల్లో కరసేవపుర్‌కు చేరుకున్నా. మాలాంటి కొందరు యువకులతో ఆత్మాహుతిదళం ఏర్పాటు చేసుకున్నాం. డిసెంబర్ 5న ఆ సమీపంలోని గుట్టల్లో కొంత ప్రాక్టీసు కూడా చేశాం. ఆపై డిసెంబర్ 6న జరిగిన కరసేవలో పాల్గొన్నా. ముందు వరుసలో ఉండే వాళ్ళను ఆత్మాహుతి దళంగా పేర్కొన్నారు. తదనంతరం పోలీసుల వేట ముమ్మరం కావడంతో దాదాపు ఆరు నెలల పాటు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయా. మా తాత సర్దార్ జయపురం కేశవరావు ఖమ్మం జిల్లాకు చెందిన స్వతంత్ర సమరయోధుడు.


### జాతీయ సమైక్యత కోసం కృషిచేసిన గురుగోవింద్ సింగ్



రసూల్‌పురా: జాతీయ సమైక్యత, శాంతి, సౌభ్రాతృత్వం మతసామరస్యం కోసం గురు గోవింద్ సింగ్ దేవ్ విశేషంగా కృషి చేశారని సిక్కు బోధకులు అమర్జీత్ సింగ్ (పాటియాలా) మెహతాబ్ సింగ్ (జలంధర్)లు పేర్కొన్నారు. గురుద్వారా సాహెబ్ సికింద్రాబాద్ ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సిక్కుల పదవ గురువు గురు గోవింద్ సింగ్ దేవ్ 357వ జయంతి సందర్భంగా వేలాది మంది సిక్కులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురు గోవింద్ సింగ్ దేవ్ బోధనలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు బల్దేవ్ సింగ్, ప్రధాన కార్యదర్శి జగ్మోహన్ సింగ్, సెక్రటరి ఎస్ హర్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలో క్లాసిక్ గార్డేన్‌లోజరిగిన ముగింపు వేడుకల్లో సిక్కు భక్తులు కీర్తనలు, విశాల దీవాన్ (సామూహిక సమ్మేళనం)లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిక్కు బోధకులు చరణ్‌జీత్ సింగ్, జగదేవ్ సింగ్ పలువురు సిక్కులు పాల్గొన్నారు.



### అయోధ్య రామ మందిరంపై ప్రత్యేక పాట



బంజారాహిల్స్: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రముఖ నటుడు అభినవ్ సర్దార్ కేతావత్ రూపొందించిన అయోధ్య రామ మందిరం ప్రత్యేక పాటను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అభినవ్ సర్దార్ మాట్లాడుతూ 100 ఏళ్ళ హిందువుల కల రామమందిరం సాకారమవుతున్న వేళ శ్రీరాముడిపై భక్తితో ఈ ప్రత్యేక పాటను రూపొందించినట్లు ఆయన తెలిపారు. రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా తాను గత కొద్ది రోజులుగా శ్రీరామ దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఈ పాటను బలిజేపల్లి శరత్ చంద్ర రచించగా, మల్లికార్జున్ స్వరకల్పన, లోహిత్ కుమార్ డైరెక్షన్, సాయి ఎడిటింగ్ చేసినట్లు ఆయన తెలిపారు. మంత్రి ఈ పాటను విని బృందాన్ని అభినందించారు.

### సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరికలు



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బండ్లగూడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వివిధ పార్టీల నాయకులు ఆకర్షితులై భారతీయ జనతా పార్టీలో చేరుతున్నారని కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, అసెంబ్లీ మాజీ ఇన్‌చార్జి అన్నపురెడ్డి స్వర్ణలతాభీమార్జున్‌రెడ్డి రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో బండ్లగూడ జాగీరు గ్రామ మాజీ వార్డు సభ్యులు దయానంద్‌గౌడ్, వెంకటేష్, శ్రీధర్, కిస్మత్‌పూర్, బండ్లగూడలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలతో కలిసి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్వర్ణలతభీమార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మంచిరేయాలనే ఉద్దేశంతోనే బీజేపీలో చేరామన్నారు.

### కనుల పండువగా ప్రత్యంగిరా మహాయాగం



యాగాన్ని ప్రారంభిస్తున్న వేద పండితులు

కవాడిగూడ: సమస్త మానవాళి శ్రేయస్సు కోసం ఎవరికి వారు యాగం చేయాల్సిన అవసరం ఉందని సిద్ధేశ్వరానంద భారతి మహా స్వామి పేర్కొన్నారు. సిద్ధేశ్వరానంద భారతి మహా స్వామి 88వ అవతరణ ఉత్సవాన్ని పురస్కరించుకొని కుర్తాలం శ్రీ సిద్ధేశ్వర పీఠం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నుంచి 28వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన కోటి ప్రత్యాంగిర యాగాన్ని స్వామిజీ అగ్నిమండలం తో దీపారాధన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అష్టోత్తర శతకుండాత్మక హోమగుండాలతో ఈ మహాయాగం రుత్విక్కుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.... దేశంలోని అవినీతి అక్రమాల నివారణకు యాగాలు చేయడానికి ప్రజలు సంకల్పించాలని సూచించారు. ఎనిమిది రోజుల పాటు జరిగే ఈ యాగంలో 25వేల కేజీల ఎండు మిరపకాయలతో భారీ ఎత్తున యాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుర్తాలం శ్రీ సిద్ధేశ్వర పీఠం ఆస్థాన పండితులు రమేష్ శర్మ మాట్లాడుతూ.... యావత్ ప్రపంచం ఎదురుచూస్తున్న భవ్యమైన రామ మందిరంలో రాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా నేడు 108 నది జలాలు, 5 సముద్రాల నుంచి ప్రత్యేక కంగా తీసుకు వచ్చిన జలాలలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమ్యానంద భారతిస్వామి పీఠం కోఆర్డినేటర్ మునిపల్లే శ్రీనివాస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మాచర్ల శశిభూషణ్ పాల్గొన్నారు.

### నిమ్స్‌లో మల్టిపుల్ స్క్లీరోసిస్ జబ్బుకు ప్రత్యేక వైద్యం



లక్డీకాపూల్: నిమ్స్‌లో మల్టిపుల్ స్క్లీరోసిస్ జబ్బుతో బాధపడే రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఆదివారం ఆస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్పుడప్పుడు కాళ్లు, చేతులు తిమ్మిర్లు రావడం మధుమేహులకు చిరపరిచితమే..కానీ మధుమేహం లేకపోయినా తిమ్మిర్లు, మంటలు, నీరసం, నిస్సత్తువ ఉంటే మాత్రం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి లక్షణాలుంటే మల్టిపుల్ స్క్లీరోసిస్ కి సంకేతమన్నారు. నరాలపై మైలిన్ పొర దెబ్బతినడంతో ఈ సమస్య వస్తుందని ఉత్పన్నమవుతుందని వివరించారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగాధిపతి అఫ్సన్ జబీన్, ప్రొఫెసర్ సూర్యప్రభ, అసోసియేట్ ప్రొఫెసర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

సన్నిధి

సాక్షి ఫ్యామిలీ

హైదరాబాద్
సోమవారం ॥ 22-1-2024



తండ్రి మాటను జవదాటని తనయుడు, సోదరులను అభిమానించిన అన్న, ఆలిని అనునిత్యం మనసులో నిలుపుకున్న భర్త, స్నేహధర్మాన్ని పాటించిన మిత్రోత్తముడు. ఈ బంధాలు ఎన్ని ఉన్నా... ధర్మం తప్పకుండా ప్రజల కోసమే నిరంతరం పాటుపడిన ప్రభువు. మొత్తంగా మనిషి అనేవాడు ఇలా జీవించాలని చూపించినవాడు మర్యాదా పురుషోత్తముడు శ్రీరాముడు.

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే త్రేతాయుగంలో రాముడిగా అవతరించాడని రామాయణ మహాకావ్యం చెబుతోంది. మహావిష్ణువు అవతారమే అయినప్పటికీ ఎక్కడా మహిమలు చూపలేదు. మాయలు చేయలేదు. ముమ్మూర్తులా మానవుడిలాగే వ్యవహరించాడు. మానవుల లాగే కష్టాలననుభవించాడు. నిందలు మోశాడు. బాధలు పడ్డాడు.

# జగదానంద కారకునికి జేజేలు

చిన్న చిన్న సంతోషాలనూ, సరదాలనూ కూడా మామూలు మనుషులలాగే అనుభవించాడు. అయితే ఎక్కడా ఎప్పుడూ ధర్మాన్ని తప్పలేదు. ఆపత్సమయంలోనూ ధర్మాన్నే అనుసరించాడు. ధర్మాన్నే ఆచరించాడు. ఒకవిధంగా చెప్పాలంటే ధర్మమంటే ఇదే అన్నట్టుగా ప్రవర్తించాడు. రాముడు అనుసరించిన మార్గం కనుకనే ఆయన చరితామృతానికి రామాయణమనే పేరు వచ్చింది.

**షోడశ మహాగుణ సంపన్నుడు**

వాల్మీకి మహర్షి రామాయణంలో రాముడి లక్షణాల గురించి వర్ణిస్తూ షోడశ మహా గుణాలు ఆయనలో ఉన్నట్లు తెలిపాడు. పితృవాక్పాలకుడిగా పేరు పొందాడు. తండ్రి దశరథుడి మాటను ఎన్నడూ జవదాటలేదు. కన్నతల్లి కౌసల్యతో సమానంగా సవతి తల్లులైన సుమిత్రతోనూ, తనను అడవులకు పంపిన కైకతోనూ కూడా ప్రియంగానే మెలిగాడు.

**సోదర ప్రేమకు పెట్టింది పేరు**

సోదర ప్రేమ రాముని చూసి నేర్చుకోవలసిందే. తమ్ముడు లక్ష్మణుని ఎంతగానో ప్రేమించాడు. కొద్దిపాటి దుడుకు స్వభావి అయినప్పటికీ అతడిని ఏనాడూ పల్లెత్తు మాటనలేదు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణానికి లక్ష్మణుడు మూర్ఛిల్లితే ఒక అతి సాధారణమైన అన్నయ్యలాగే తల్లడిల్లాడు. తమ్ముణ్ణి తిరిగి మామూలుగా చూసేంత వరకు స్థిమిత పడలేకపోయాడు. భరతునితో కూడా ఎంతో వాత్సల్యంతో మెలిగాడు. తాను వనవాసం పూర్తి చేసుకుని వచ్చేటప్పుడు తాను వస్తున్న వార్తను భరతుడికి చేరవేసి, అతడి ముఖ కవళికలలో ఏమైనా మార్పు వచ్చిందేమో జాగ్రత్తగా గమనించి తనకు చెప్పమంటూ నమ్మిన బంటు హనుమను అందుకు నియోగించాడు. ఒకవేళ భరతుడు గనక రాజుగా ఉండేందుకు ఇష్టపడితే అందుకు తానేమీ అడ్డుపడదలచుకోలేదు. అంతేకాదు, శత్రుఘ్నుని కూడా అమితంగా ప్రేమించాడు. లవణాసురుడనే రాక్షసుని వధకు శత్రుఘ్నునే నియోగించాడు. అతడు జయించిన రాజ్యాన్ని అతడికే అప్పగించాడు. అందుకే ఆదర్శవంతులైన అన్నదమ్ములను రామలక్ష్మణుల్లా ఉన్నారంటారు.

**మర్యాదా పురుషోత్తముడు**

శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు. తన పంచేంద్రియాలపై పూర్తి నియంత్రణను కలిగి ఉన్నవాడు. ఆలోచనాపరుడు. అహంకారం లేని వాడు. అందువలనే పురుషోత్తముడిగా గుర్తింపు పొందాడు. శ్రీరాముడి పాద స్పర్శతో అయోధ్యా నగరం పావనమైంది. అడవులు ధన్యమైనాయి.

**ఆత్మశత్రువుని అధిగమించాడు**

కామం, కోపం, అత్యాశ, అసూయ వంటి అవలక్షణాలు కలిగిన రావణుడిని ఆత్మ శత్రువుగా పేర్కొంటారు. రావణుడి వధతో శ్రీరాముడు ఈ లక్షణాలను కూడా వధించాడని రామాయణం రుజువు చేస్తుంది.

**ఏక పత్నీవ్రతుడు**

నేటి సమాజంలో ఒక భార్యను కలిగి ఉండటం అనేది ఒక కట్టుబాటుగా మారింది. శ్రీరాముడి కాలంలో రాజులకు ఎందరో భార్యలు కలిగి ఉండేవారు. అటువంటి సమయంలో కూడా శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడిగా పేరొందాడు. మనసా వాచా కర్మణా ప్రేమించిన సీతాదేవిని తప్ప మరొక మహిళ వంక కన్నెత్తి చూడలేదు. ఏకపత్నీవ్రతుడిగా పేరొందాడు.

స్మిత పూర్వభాషిగా శ్రీరాముడికి పేరు. అంటే అవతలి వారు తనను పలకరించేవరకు వేచి చూడాలని అనుకోడు. ముందుగా తానే వారిని మాట్లాడించేవాడు. అంతటి మర్యాదా పురుషోత్తముడు. అటువంటి ఆదర్శమూర్తి, ధర్మప్రభువు... ఆయన నడయాడిన పుణ్యపుడమిగా పేర్కొంటున్న అయోధ్యలో బాల రాముడిగా నేడు విగ్రహ రూపంలో కొలువుతీరనున్నాడు. ఈ శుభ సందర్భంలో ఆ జగదానంద కారకుడికి జేజేలు చెబుదాం...

– డి.వి.ఆర్.

వాగ్గేయకార వైభవం

# చదువులో కాదు.. అనుభవంలో ...

త్యాగరాజ స్వామి ఒక కీర్తనలో...'' గురులేక ఎటువంటి గుణికి తెలియగ బోదు... కఱుకైన హృద్రోగ గహనమును గొట్ట....'' అంటారు. ఎటువంటి గుణాలయినా ఉండొచ్చు. ఎంత తెలివిగలవాడయినా కావొచ్చు. ఏది తెలియాలో అది తెలియాలంటే మాత్రం గురువు ఉండి తీరాలి. ఏది తెలియాలి... అంటే.. కరుకైన హృద్రోగమును గహనమును కొట్ట... హృద్రోగం చాలా కరుకైనదే.. ఊపిరి అందని వాడికి అది పరీక్షాకాలం... ఇంత మందిని విడిచిపెట్టి పోతున్నానన్న భావన.. అది కరుకైనది... దానిని గహనమున కొట్ట... అంటే అరణ్యంలా.. ఎలా చేస్తున్నాడో తెలియకుండా దానిని కొట్టగలిగినవాడు గురువు... అన్నాడు. తెలియని విషయాలు తెలియకుండా పోవడం... తెలియవు అన్నంత వరకు పనికొస్తాయేమో గానీ.. ఆత్మ అనుభవంలోకి రావడం... అద్వైతానుభూతిని పొందడం... అన్న దగ్గరకు వస్తే అది గురువు గారి వీక్షణములచేత మాత్రమే సాధ్యమవుతుంది.. అంటాడు త్యాగయ్య.

అమ్మవారిని మూడు రకాలుగా – కామాక్షి, మీనాక్షి, విశాలాక్షి అని... అక్షి సంబంధంగా పిలుస్తారు. ఆమె గురు మండల రూపిణి. గురువులు కూడా మూడు రకాలుగా అనుగ్రహిస్తారు. కామాక్షి–కుక్కుట న్యాయం.. అలాగే గురువు హస్త మస్తక సంయోగంలో శిష్యుడి బ్రహ్మస్థానం లో తన చేతిని ఉంచి అనుగ్రహిస్తాడు. అది పక్షి గుడ్డును పొదిగి దాని నుంచి పిల్ల వచ్చేటట్లుగా చేయడంలాగా ఉంటుంది. అలా పొదుగుతాడు శిష్యుడిని. అదే స్పర్శ దీక్ష.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

రెండవది మీనాక్షి. విజ్ఞాన శాస్త్రంలో ఎలా ఉందనే విషయం పక్కనబెడితే యోగశాస్త్రంలో చెప్పిన ప్రకారం చేపగుడ్లు పెట్టి, వాటిని ప్రేమగా చూసిన మాత్రం చేత అవి పిల్లలవుతాయి.. అంటుంది. అలా గురువు కేవలం తన చూపులతో శిష్యుణ్ణి అనుగ్రహిస్తాడు. అలా భగవాన్ రమణులు ఒకసారి అనుగ్రహించారు. అది మీనాక్షి.



మూడవది విశాలాక్షి. బ్రహ్మాండం ఎంతవరకు ఉంటుందో అంతవరకు పరదేవత చూస్తుంటుంది. అందరూ తన బిడ్డలే అన్న స్మరణతో అనుగ్రహిస్తుంటుంది. 'వాడు వృద్ధిలోకి రావాలి' అని గురువు గారు సంకల్పించినంత మాత్రం చేత శిష్యుడు ఆ స్థితిని పొందుతాడు. అది విశాలాక్షీ తత్త్వం. నిజానికి కామాక్షి, మీనాక్షి, విశాలాక్షి... ఈ మూడూ కూడా శిష్యుడి వైపునుంచి గురువుకు, గురువు వైపునుంచి శిష్యుడికి ఉంటాయి. అదొక విచిత్రం. తెలిసినా తెలియక పోయినా నన్ను గురువుగారు ఒకసారి ముట్టుకుంటే చాలు, చూస్తే చాలు, స్మరిస్తే చాలు.. అన్న నమ్మకం ఉంటే... వాడు గురి కలవాడు. ఎవరి మీద అది ఉందో వారు గురువయిపోతారు. వాడి కరుకైన హృద్రోగమును గహనమును కొట్ట... అంటే అలా కొట్టగలిగిన వాడు గురువు.. అంటున్నాడు త్యాగరాజు. అజ్ఞాన గ్రంథులను తొలగించి జ్ఞానాన్ని కలుగ చేయాలి అంటే... ఒక సద్గురువు ఉండాలి.

అప్పుడు భగవంతుని దర్శనం.. ఆత్మ అనుభవంలోకి వచ్చి... శాశ్వతమైనది, సత్యమైనది, నిత్యమైనది, నిరంజనమైనది, నిష్కళంకమైనది... అయిన ఆత్మ నేను తప్ప శరీరం కాదు... అని శ్లోకాల్లో చెప్పినవి, నోటితో చెప్పినవి కాక.. అనుభవంలో తెలుసుకుంటాడు శిష్యుడు.

బౌద్ధవాణి

# దిటవు గల భిక్షువు!

అది మధ్యాహ్న సమయం. ఎండ కాంతిమంతంగా ప్రసరిస్తోంది. కానీ, ఆ తోటలో చల్లగా ఉంది. తోట మధ్యలో ఉన్న చెట్టు కింద అరుగు మీద కూర్చొని ఉన్నాడు బుద్ధుడు. ఆయన ముందు కూర్చొని, చెప్పే ధర్మప్రవచనాన్ని శ్రద్ధగా వింటున్నారు భిక్షువులు. బుద్ధుడు ఒకసారి అందర్నీ కలియ చూశాడు. అందరి ముఖాలూ ప్రశాంతంగా ఉన్నాయి. కానీ వారిలో భద్దాలి భిక్షువు కనిపించలేదు. బుద్ధుడు అది గమనించాడు. భద్దాలిని పిలిపించాడు. భద్దాలి వచ్చి కూర్చొన్నాడు. ఆరోజు భిక్షువులు తీసుకునే ఆహార నియమాల గురించి మాట్లాడుతున్నాడు బుద్ధుడు. భిక్షువులు రోజుకి ఒక్కసారి మాత్రమే భుజించాలి. వారికి ఒక భిక్షాపాత్ర ఉంటుంది. ఆ పాత్ర నిండుగా, తలకట్టు వరకూ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. ఉదయం సాయంత్రం ద్రవ పదార్థాలు తీసుకోవచ్చు. రాత్రికి భోజనం ఉండదు.

ఈ నియమం భద్దాలికి చాలా ఇబ్బందిగా ఉంది. ఆకలి బాధ పెడుతుంటే... ఆగలేక పోతున్నాడు. రాత్రికి కూడా కొంత భోజనాన్ని సంపాదించుకుని తింటున్నాడు. ఆ విషయం బుద్ధునికి తెలుసు..! అందుకే...

''భిక్షువులారా! ఏకాసన భోజనం (ఒకసారి భోజనం) చాలా మంచిది. శారీరక రోగాలూ, బాధలు లేకుండా చేస్తుంది. తేలికగా కూడా ఉంటుంది. శక్తినిస్తుంది. బలాన్ని ఇస్తుంది. ఆరోగ్యాన్నీ ఇస్తుంది.'' అని చెప్పాడు. వెంటనే భద్దాలి భిక్షువు లేచి నమస్కరించి–

''భగవాన్! నేను మాత్రం ఏకాసన భోజనం చేయాలనుకోవడం లేదు. ఎందుకంటే ఆకలికి తాళలేకపోతున్నాను. అయ్యో తక్కువ తింటున్నానే అనే భావన కలుగుతుంది. దానివల్ల ఆతురత కలుగుతుంది. చింత పెరిగిపోతుంది.'' అన్నాడు.



అప్పుడు బుద్ధుడు– ''భద్దాలీ! నీవు ఈ ఆహారాన్ని మరోవిధంగా స్వీకరించవచ్చు. ఆ భిక్షనే ఒక్కపూట కాకుండా దాన్ని రెండు భాగాలుగా చేసుకుని ఒక భాగం మధ్యాహ్నం, మరో భాగం రాత్రికి తినవచ్చు. అలా తినడం వల్ల నీవు భిక్ష నియమావళిని అతిక్రమించిన వాడవు కావు. నీవు ఒకే భోజనంతోనే గడిపినట్లు అవుతుంది. నీవు రేపటి నుండి అలా తినవచ్చు'' అన్నాడు.

భద్దాలి అప్పటికి 'సరే' నన్నాడు. కానీ, అలాగ ఉండలేక పోయాడు. దాంతో.. అందరు భిక్షువులతో కలిసి బుద్ధుని దగ్గరకు రావడం మానాడు. నిజానికి భిక్షువులకు ఈ వర్షాకాలం మూడునెలలూ ఎంతో ధార్మిక ప్రబోధం చేస్తాడు బుద్ధుడు. వారికి గొప్ప శిక్షణ కాలం. ఆ శిక్షణకు దూరమయ్యాడు భద్దాలి. మూడు నెలలు గడిచాయి. భిక్షువులు నూతన చీవరాలు (భిక్షువులు ధరించే దుస్తులు) ధరించి ధర్మోపదేశం చేయడానికి వివిధ ప్రాంతాలకు బయలుదేరి వెళ్ళే సమయం వచ్చింది. తన తోటి మిత్రులు చెప్పగా, భద్దాలి బుద్ధుని దగ్గరకు వెళ్ళాడు. ఆయనకు నమస్కరించి... ''భగవాన్! నేను చాలా తప్పు చేశాను. పిల్లవాడిలా ప్రవర్తించాను. మూర్ఖునిలా నడుచుకున్నాను. నూతన శిక్షణ పొందలేక, వెనుకబడిపోయాను'' అని బాధపడ్డాడు.

అప్పుడు బుద్ధుడు...

''భద్దాలీ... తప్పుని తప్పుగా గ్రహించి,కోర్కెల్ని అదుపు చేసుకుని, నిగ్రహంతో ఉండేవారు ఎప్పుడూ వృద్ధి పొందుతారు'' అని అతని ముఖంలోకి దయా దృక్కులు సారించాడు బుద్ధుడు.

''ఇక నేను అందరి భిక్షువుల్లా నడుచుకుంటాను భగవాన్'' అని మోకాళ్ళపై నిలబడి నమస్కరించాడు భద్దాలి! ఆ తర్వాత దిటవు గల భిక్షువుగా నడుచుకున్నాడు.

– డా. బొర్రా గోవర్ధన్

# సినిమా

## నా పెళ్లి వార్తలు అవాస్తవం

**- విజయ్ దేవరకొండ**



టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ లిస్ట్‌లో విజయ్ దేవరకొండ ఒకరు. అప్పుడప్పుడు విజయ్ దేవరకొండ పెళ్లి గురించిన వార్తలు ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతూ ఉంటాయి. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నాల నిశ్చితార్థం జరగనుందని, వీరి వివాహ తేదీని కూడా త్వరలోనే ప్రకటిస్తారనే వార్తలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఓ ఆంగ్ల మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ ఈ విషయంపై స్పందించారు. ''ఈ ఫిబ్రవరిలో ఎవరితోనూ నా నిశ్చితార్థం జరగదు.. పెళ్లి లేదు. నా పెళ్లి గురించిన పుకార్లు తరచూ వస్తూనే.. వినిపిస్తూనే ఉన్నాయి. రెండేళ్లకో సారి నాకు పెళ్లి చేస్తూనే ఉన్నారు'' అని చెప్పుకొచ్చారు విజయ్ దేవరకొండ. ఇక ప్రస్తుతం 'ఫ్యామిలీ స్టార్' చిత్రంతో బిజీగా ఉన్నారు విజయ్ దేవరకొండ. పరశురామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలో విడుదల కానుంది.

## అలా చేయడం తప్పు

**- రష్మికా మందన్నా**



హీరోయిన్ రష్మికా మందన్నా అంటూ మార్ఫింగ్ చేసిన ఓ డీప్ ఫేక్ వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా రష్మికా మందన్నా స్పందించారు. ''ఢిల్లీ పోలీసులకు ధన్యవాదాలు. నన్ను అభిమానిస్తూ, నాకు అండగా నిలిచేవారు నా చుట్టూ ఉన్నందుకు సంతోషిస్తున్నాను. అలాగే ఇలాంటి ఘటనలకు (మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను ఉద్దేశించి) పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. అమ్మాయిలు... అబ్బాయిలు... ఎవరైనా కావొచ్చు. మీ అనుమతి లేకుండా మీ ఫొటోలను మార్ఫింగ్ చేయడం, దుర్వినియోగం చేయడం అనేవి తప్పు'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు రష్మికా మందన్నా. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న 'పుష్ప: ది రూల్' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. అలాగే 'ది గాళ్ ఫ్రెండ్', 'రెయిన్ బో' అనే ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ కూడా చేస్తున్నారీ బ్యూటీ. వీటితో పాటు కొన్ని బాలీవుడ్ ప్రాజెక్ట్స్ కూడా ఉన్నాయి.

## ఇటు హీరోగా... అటు నిర్మాతగా...



● ఆమిర్ ఖాన్

నటుడిగా ఆమిర్ ఖాన్ మేకప్ వేసుకుని దాదాపు రెండేళ్లవుతోంది. 'లాల్ సింగ్ చద్దా' (2022)లో చేసిన టైటిల్ రోల్, 'సలామ్ వెంకీ' (2022)లో చేసిన అతిథి పాత్ర తర్వాత ఆమిర్ ఖాన్ నటుడిగా మేకప్ వేసుకోలేదు. ఫైనల్‌గా ఫిబ్రవరిలో కెమెరా ముందుకు రానున్నారు. హీరోగా 'సితారే జమీన్ పర్' అంగీకరించారు ఆమిర్. ఫిబ్రవరి 2న ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారు. కొన్ని నెలలుగా ఈ చిత్రంలోని పాత్ర కోసం ప్రిపేర్ అవుతున్నారు ఆమిర్ ఖాన్. పలు లుక్స్ ట్రై చేసి, చివరికి ఒకటి ఖరారు చేశారు. అలాగే పలుమార్లు స్క్రిప్ట్‌ని చదివారు. అన్నీ సంతృప్తికరంగా అనిపించడంతో ఫిబ్రవరిలో చిత్రీకరణ ప్లాన్ చేశారు. ఆర్.ఎస్. ప్రసన్న దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రానికి 70 నుంచి 80 రోజులు డేట్స్ ఇచ్చారు ఆమిర్. ఈ చిత్రాన్ని క్రిస్మస్‌కి విడుదల చేయాలనుకుంటున్నారు.

**సన్నీ డియోల్ హీరోగా..**

నిర్మాతగా 'లాహోర్: 1947' చిత్రాన్ని నిర్మించనున్నారు ఆమిర్ ఖాన్. రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో సన్నీ డియోల్ హీరోగా ఈ చిత్రం రూపొందనుంది. ఇందులో ఆమిర్ ఖాన్ అతిథి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ సినిమా మాత్రమే కాదు.. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌లో (ఏకేపీ) మరో రెండు సినిమాలు ఉన్నాయి. ఒకటి ఆమిర్ భార్య కిరణ్ రావ్ దర్శకత్వంలో రూపొందిన 'లాపతా లేడీస్'. ఈ ఏడాది ప్రథమార్ధంలో ఈ చిత్రం విడుదల కానుంది. మరొకటి 'ప్రీతమ్ ప్యారే'. సంజయ్ శ్రీవాస్తవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఆమిర్ బుక్ న్యారేటర్‌గా అతిథి పాత్ర చేశారు. ఈ చిత్రం కూడా ప్రథమార్ధంలోనే విడుదల కానుంది. ఈ చిత్రం నిర్మాణ బాధ్యతలను ఆమిర్ తనయుడు జునైద్ ఖాన్ చేపట్టడం విశేషం. ఇలా హీరోగా, ఏకేపీ నిర్మించే చిత్రాలతో ఆమిర్ బిజీ.


## చిన్నారులకు గుంటూరు కారం



● సితార

మహేశ్‌బాబు కుమార్తె సితార ఘట్టమనేని చీర్స్ ఫౌండేషన్‌లోని అనాథ పిల్లల కోసం తన తండ్రి నటించిన 'గుంటూరు కారం' చిత్రం ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేసింది. మహేశ్‌బాబు ఫౌండేషన్ సహకారంతో ఏఎంబీ సినిమాస్‌లో ఈ ప్రదర్శన జరిగింది. సితార ఈ స్పెషల్ స్క్రీనింగ్‌ని నిర్వహించడంతో పాటు పిల్లలతో కలిసి 'గుంటూరు కారం' చిత్రాన్ని వీక్షించింది. పిల్లలతో కలిసి సెల్ఫీ దిగింది. తమ ఫౌండేషన్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు పొందిన ఆనందం పట్ల మహేశ్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇక త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు, శ్రీలీల జంటగా సూర్యదేవర రాధాకృష్ణ నిర్మించిన 'గుంటూరు కారం' సంక్రాంతికి విడుదలైన సంగతి తెలిసిందే.


## రామ మందిరానికి హను-మాన్ విరాళం



● తేజ సజ్జా

తేజ సజ్జా టైటిల్ రోల్‌లో ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో నిరంజన్ రెడ్డి నిర్మించిన 'హను–మాన్' ఈ సంక్రాంతికి విడుదలైన విషయం తెలిసిందే. కాగా అయోధ్యలోని రామ మందిరానికి ప్రతి టిక్కెట్ నుండి రూ. 5 విరాళంగా ఇస్తామని ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లో ఈ చిత్రం యూనిట్ పేర్కొంది. ఆ మేరకు రామ మందిరానికి విరాళం అందజేశారు. ఈ సినిమా ప్రీమియర్ షోల నుండి విక్రయించిన 2,97,162 టిక్కెట్లలో రూ. 14,85,810 చెక్కును ఇప్పటికే అందించగా, ఇప్పటివరకు విక్రయించిన 53,28,211 టిక్కెట్ల నుంచి రూ. 2,66,41,055 అందిస్తున్నట్లు ప్రకటించారు. ''ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల మార్కును ఈ చిత్రం దాటింది'' అని యూనిట్ పేర్కొంది.

## చార్ జోర్



● అజయ్ దేవగన్

ఈ ఏడాది అజయ్ దేవగన్ ఫుల్ రైజింగ్‌లో ఉన్నారు. ప్రస్తుతం 'సింగమ్ ఎగైన్', 'రైడ్ 2', 'సైతాన్' సినిమాల్లో నటిస్తున్నారు. 'సైతాన్' మార్చి 8న, 'సింగమ్ ఎగైన్' ఆగస్టు 15న, 'రైడ్ 2' నవంబరు 15న రిలీజ్ కానున్నాయి. అలాగే ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన అజయ్ దేవగన్ 'మైదాన్' కూడా ఈ ఏడాదే రిలీజ్ కానుంది.

ఇండియన్ మాజీ ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవితం ఆధారంగా రూపొందిన 'మైదాన్' సినిమాకు అమిత్ శర్మ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, బోనీ కపూర్ నిర్మించిన ఈ సినిమాను 2022లోనే విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా 'మైదాన్'ను ఈ ఏడాది రంజాన్ సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ వెల్లడించింది. అన్నీ సవ్యంగా జరిగితే ఈ ఏడాది అజయ్ దేవగన్ చిత్రాలు 4 వెండితెరకు వస్తాయి. అంటే.. చార్ (నాలుగు) సినిమాలతో అజయ్ దేవగన్ ఈ ఏడాది ఫుల్ జోర్ అన్నమాట.

## బంపర్ ఆఫర్



● అన్నా బెన్

మలయాళంలో 'హెలెన్' (2019), 'కప్పెలా' (2020) వంటి సినిమాల్లో నటించిన అన్నా బెన్‌ను ఓ బంపర్ ఆఫర్ వరించినట్లుగా తెలుస్తోంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 ఏడీ' సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్. కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దిశా పటానీ ముఖ్య పాత్రధారులు. రాజమౌళి, విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా మలయాళ బ్యూటీ అన్నా బెన్ పేరు తెరపైకి వచ్చింది. 'కల్కి 2898 ఏడీ' వంటి పాన్ వరల్డ్ మూవీలో చాన్స్ అంటే.. అది బంపర్ ఆఫర్ అనొచ్చు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న రిలీజ్ కానుంది.

## ఏం జరుగుతుందో ఊహించలేరు

**- దర్శకుడు రాజు దుస్సా**



''పాటలు, ఫైట్స్, కామెడీ... ఇవేం లేకుండా ఓ కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా '105 మినిట్స్'. స్క్రీన్‌ప్లేను బేస్ చేసుకుని తీసిన ఈ చిత్రం ఆడియన్స్‌ను మెప్పిస్తుంది'' అన్నారు దర్శకుడు రాజు దుస్సా. హన్సిక లీడ్ రోల్‌లో రాజు దుస్సా దర్శకత్వంలో బొమ్మక్ శివ నిర్మించిన ప్రయోగాత్మక చిత్రం '105 మినిట్స్'. ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం విలేకర్ల సమావేశంలో రాజు దుస్సా మాట్లాడుతూ– ''ముందు బాలీవుడ్‌లో రైటర్‌గా చేశాను. సొంతంగా కథలు రాసుకుని, దర్శకత్వ ప్రయత్నాల్లో ఉన్నప్పుడు '105' మినిట్స్ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ వచ్చింది. సింగిల్ క్యారెక్టర్ ఫిల్మ్ ఇది. ఓ నీడ మాత్రం కనిపిస్తుంది. కనిపించని మనిషి ఒకరు పంచభూతాలను కంట్రోల్ చేస్తూ, ఓ అమ్మాయిని ఏడిపించే ఆటే ఈ సినిమా థీమ్. సాధారణంగా కొన్ని సినిమాల్లో నెక్స్ట్ ఏం జరుగుతుంది? అని ప్రేక్షకులు ఊహిస్తుంటారు. చాలెంజ్ చేసి చెబుతున్నాను.. మా సినిమాలో నెక్స్ట్ ఏం జరుగుతుందో కూడా ఊహించలేరు'' అని చెప్పుకొచ్చారు.

## క్రైమ్ కామెడీ



● 'నటరత్నాలు' పోస్టర్

ఇనయా సుల్తానా, సుదర్శన్ రెడ్డి, 'రంగస్థలం' మహేశ్, 'తాగుబోతు' రమేశ్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'నటరత్నాలు'. శివ నాగు దర్శకత్వంలో చంటి యలమాటి, డా. దివ్య నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా యూనిట్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శివనాగు మాట్లాడుతూ– ''సినిమా ఇండస్ట్రీకి వచ్చి, సినిమా తీయాలనుకునేవాళ్లు ఎలా సఫలమవుతున్నారు? ఎలా విఫలమవుతున్నారు? ఏం చేస్తున్నారు? అనే అంశాలతో ఈ సినిమా తీశాం'' అన్నారు. ''2002లో ఓ సినిమా తీయాలని ఇండస్ట్రీకి వచ్చి, లాస్ అయ్యాను. 'నటరత్నాలు' కథ సినిమాలో సినిమాలాంటిది. ప్లాన్ చేసిన బడ్జెట్‌లోనే సినిమాను పూర్తి చేశాం'' అన్నారు చంటి యలమాటి.



## ఆఖరి టి20లో పాకిస్తాన్‌కు ఊరట విజయం

న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో క్లీన్‌స్వీప్ కాకుండా పాకిస్తాన్ తప్పించుకుంది. శనివారం జరిగిన ఐదో టి20లో పాక్ 42 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. ముందుగా పాక్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. మొహమ్మద్ రిజ్వాన్ (38), ఫఖర్ జమాన్ (33) రాణించారు. కివీస్ బౌలర్లలో సౌతీ, ఇష్ సోధి, ఫెర్గూసన్, హెన్రీ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ 17.2 ఓవర్లలో 92 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై కివీస్‌కు టి20ల్లో ఇది రెండో అత్యల్ప స్కోరు. ఫిలిప్స్ (26), అలెన్ (22) మాత్రమే ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇఫ్తికార్ అహ్మద్ (3/24) ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. 275 పరుగులు సాధించిన అలెన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. తొలి నాలుగు మ్యాచ్‌లు గెలిచిన న్యూజిలాండ్ 4-1తో సిరీస్ గెలుచుకుంది.



## 'కొన్ని నెలల క్రితమే విడాకులు'

### సానియా మీర్జా కుటుంబస్పందన

సాక్షి, హైదరాబాద్: పాక్ క్రికెటర్ షోయబ్ మలిక్‌తో విడాకులకు సంబంధించి భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా కుటుంబం స్పందించింది. షోయబ్‌తో విడిపోయిన విషయాన్ని నిర్ధారించింది. ఆదివారం తమ వైపునుంచి సానియా కుటుంబం ఒక ప్రకటన జారీ చేసింది. 'సానియా మొదటి నుంచి కూడా తన వ్యక్తిగత జీవితం గురించి గోప్యత పాటిస్తూనే వచ్చింది. అయితే ఇప్పుడు బహిరంగంగా కొంత స్పష్టతనివ్వాల్సిన అవసరం వచ్చింది. సానియా, షోయబ్ కొన్ని నెలల క్రితమే విడాకులు తీసుకున్నారు. షోయబ్ కొత్త ప్రయాణంలో అతనికి మంచి జరగాలని కోరుకుంటోంది. ఆమె జీవితంలో ఇది సున్నితమైన పరిస్థితి. కాబట్టి ఎలాంటి ఊహాగానాలను ప్రచారం చేయరాదని, ఆమె ఏకాంతానికి భంగం కలిగించరాదని అభిమానులు, శ్రేయోభిలాషులకు మా విజ్ఞప్తి' అని ఈ ప్రకటనలో ఆమె కుటుంబం పేర్కొంది. సానియా మీర్జా ప్రస్తుతం ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీకి 'సోనీ' నెట్‌వర్క్ తరఫున వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోంది.

## టెస్టు సిరీస్‌కు బ్రూక్ దూరం



లండన్: భారత్‌తో గురువారం నుంచి మొదలయ్యే ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు ఇంగ్లండ్‌కు పెద్ద దెబ్బ తగిలింది. జట్టులో కీలకమైన మిడిలార్డర్ బ్యాటర్, అద్భుతమైన ఫామ్‌లో ఉన్న హ్యారీ బ్రూక్ ఈ సిరీస్ నుంచి తప్పుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో అతను జట్టును వదిలి వెళ్లాడని, సిరీస్ మొత్తానికి అతను అందుబాటులో ఉండడని ఇంగ్లండ్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. తొలి టెస్టు కోసం ఆదివారమే ఇంగ్లండ్ జట్టు హైదరాబాద్‌కు చేరుకుంది. బ్రూక్ స్థానంలో డాన్ లారెన్స్‌ను ఇంగ్లండ్ సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇంగ్లండ్ తరఫున 11 టెస్టులు ఆడిన లారెన్స్ 551 పరుగులు చేశాడు.

# జొకోవిచ్ జోరుగా...


జొకోవిచ్

- సులువైన విజయంతో క్వార్టర్స్‌లోకి
- సబలెంక, గాఫ్ కూడా
- ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో సీడెడ్ ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), నాలుగో సీడ్ సిన్నెర్ (ఇటలీ), మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంక (బెలారస్), నాలుగో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా) క్వార్టర్స్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్‌సీడ్ నొవాక్ జొకోవిచ్ అతి సులువైన విజయంతో ముందంజ వేశాడు. పది సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత అయిన జొకో 6-0, 6-0, 6-3తో అడ్రియన్ మనారినో (ఫ్రాన్స్)ను చిత్తు చేశాడు. ఏకంగా 17 ఏస్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసిన సెర్బియన్ దిగ్గజం 31 విన్నర్లతో అలవోకగా మ్యాచ్‌ని చేతుల్లోకి తెచ్చుకున్నాడు. తొలి రెండు సెట్లలో అయితే ఫ్రాన్స్ ఆటగాడిని ఖాతా తెరువకుండా చేశాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. కేవలం గంటా 44 నిమిషాల్లోనే వరుస సెట్లలో ప్రత్యర్థి ఆట కట్టించాడు. తాజా ఫలితంతో గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో 58 సార్లు క్వార్టర్స్ ఫైనల్ చేరిన ఆటగాడిగా స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ సరసన సెర్బియన్ సూపర్‌స్టార్ నిలిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే 14 సార్లు క్వార్టర్స్ చేరిన జొకోవిచ్ 10 సార్లు ముందంజ వేసి టైటిల్ గెలువగలిగాడు.

**సిట్సిపాస్ అవుట్**

నిరుటి రన్నరప్, ఏడో సీడ్ స్టెఫనొస్ సిట్సిపాస్ (గ్రీస్)కు ప్రిక్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. గత మూడేళ్లలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అతనికి ఇదే నిరాశాజనక ప్రదర్శన. ఆదివారం జరిగిన పోరులో ప్రపంచ ఏడో ర్యాంకర్ సిట్సిపాస్ 6-7 (3/7), 7-5, 3-6, 3-6తో అమెరికాకు చెందిన 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ చేతిలో కంగుతిన్నాడు. ఈ విజయంతో అమెరికా ఆటగాడు తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్‌లో నాలుగో రౌండ్ అడ్డంకిని దాటి క్వార్టర్ ఫైనల్ చేరాడు. మిగతా మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా)కు స్థానిక ప్లేయర్ నుంచి అసాధారణ పోటీ ఎదురైంది. సుదీర్ఘంగా 4 గంటల 14 నిమిషాల పాటు జరిగిన ఈ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో రుబ్లెవ్ 6-4, 6-7 (5/7), 6-7 (4/7), 6-3, 6-0తో పదో సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై చెమటోడ్చి నెగ్గాడు. దీంతో స్థానిక ఆటగాడు వరుసగా మూడో ఏడాదీ ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిబాట పట్టాడు. నాలుగో సీడ్ జానిక్ సిన్నెర్ (ఇటలీ) 6-4, 7-5, 6-3తో గత సీజన్ సెమీఫైనలిస్ట్, 15వ సీడ్ కరెన్ కచనొవ్ (రష్యా)కు షాకిచ్చాడు.

### కొకొ గాఫ్ తొలిసారి...

మహిళల సింగిల్స్‌లో యూఎస్ ఓపెన్ చాంపియన్, నాలుగో సీడ్ అమెరికన్ స్టార్ కొకొ గాఫ్ తొలిసారి ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సంపాదించింది. నాలుగేళ్లుగా బరిలోకి దిగుతున్న ఆమెకు రెండు సార్లు ప్రిక్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. కానీ ఈ సారి ఆమె 6-1, 6-2తో మగ్దలెన ఫ్రెచ్ (పోలాండ్)పై సునాయాస విజయంతో ముందంజ వేసింది. కేవలం గంట 3 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించడం విశేషం. రెండో సీడ్ అరిన సబలెంక (బెలారస్) 6-3, 6-2తో అమండ అనిసిమొవ (అమెరికా)పై గెలుపొందగా, 9వ సీడ్ క్రెజిసికొవా (చెక్ రిపబ్లిక్) 4-6, 6-3, 6-2తో మిర అంద్రీవా (రష్యా)పై విజయం సాధించింది.


గాఫ్

## గెలుపు దిశగా ఆంధ్ర

### అస్సాంతో రంజీ ట్రోఫీ మ్యాచ్

డిబ్రూగఢ్: రంజీ ట్రోఫీ సీజన్‌లో ఆంధ్ర మొదటి విజయం దిశగా సాగుతోంది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్రతో జరుగుతున్న మ్యాచ్‌లో అస్సాం ఓటమికి చేరువైంది. 363 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అస్సాం మూడో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (48 నాటౌట్) పోరాడుతుండగా...చేతిలో ఉన్న ఐదు వికెట్లతో అస్సాం మరో 282 పరుగులు చేయాల్సి ఉంది. ఆంధ్ర బౌలర్లలో గిరినాథ్ రెడ్డి 3, లలిత్ మోహన్ 2 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 147/1తో ఆట కొనసాగించిన ఆంధ్ర తమ రెండో ఇన్నింగ్స్‌లో 334 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రికీ భుయ్ (187 బంతుల్లో 125; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) శతకం పూర్తి చేసుకోగా, హనుమ విహారి (63) అర్ధసెంచరీ సాధించాడు. షేక్ రషీద్ (40 నాటౌట్) కూడా రాణించగా... అస్సాం బౌలర్లలో సిద్ధార్థ్ వాసుదేవ్ 5 వికెట్లు తీశాడు.

## సాత్విక్ - చిరాగ్ జోడీకి నిరాశ

### ఇండియా ఓపెన్‌లో రన్నరప్‌గా ముగింపు ● ఫైనల్లో ఓడిన భారత ద్వయం



న్యూఢిల్లీ: సొంతగడ్డపై జరిగిన ప్రతిష్టాత్మక టోర్నీలో భారత బ్యాడ్మింటన్ డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్‌శెట్టిలకు చుక్కెదురైంది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ - సూపర్ 750 టోర్నీ ఇండియా ఓపెన్‌లో భారత జోడి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో కొరియాకు చెందిన వరల్డ్ చాంపియన్ జంట కాంగ్ మిన్ హ్యూక్ - సియో సంగ్ జె 15-21, 21-11, 21-18 స్కోరుతో సాత్విక్ - చిరాగ్‌పై విజయం సాధించింది. 65 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో తొలి గేమ్‌ను సునాయాసంగానే గెలుచుకున్న భారత జోడి ఆ తర్వాత తడబడింది. ముఖాముఖీ పోరులో కొరియా ఆటగాళ్లతో ఈ మ్యాచ్‌కు ముందు 4-1తో సాత్విక్-చిరాగ్‌లదే పైచేయిగా ఉంది. అదే తరహాలో చక్కటి ర్యాలీలతో దూసుకుపోయిన వీరిద్దరు తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. రెండో గేమ్‌లో 1-5తో ఆరంభంలో వెనుకబడిన మన ఆటగాళ్లు ఆ తర్వాత కోలుకోలేకపోయారు. ఒక దశలో వరుసగా తొమ్మిది పాయింట్లు సాధించిన కొరియా టీమ్ 15-5తో ముందంజలో నిలిచి ఆపై గేమ్‌ను గెలుచుకుంది. మూడో గేమ్ పోటాపోటీగా సాగింది. గేమ్ తొలి అర్ధభాగాన్ని కొరియా ఆటగాళ్లు 11-6తో ముగించారు. అయితే ఆ తర్వాత భారత ద్వయం కోలుకొని మళ్లీ నిలిచారు. 15-16కు, ఆపై 18-19 వరకు స్కోరు వెళ్లింది. అయితే సాత్విక్ బయటకు కొట్టిన షాట్‌తో, అనంతరం చిరాగ్ నెట్‌కు కొట్టిన షాట్‌తో కొరియా విజయం ఖాయమైంది.

**తైజుకు మహిళల టైటిల్**



వరల్డ్ నంబర్ 3 ప్లేయర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) మహిళల సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో నాలుగో సీడ్ తై జు 21-16, 21-12తో రెండో సీడ్ చెన్ యు ఫెపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ టైటిల్‌ను షి యు కి (చైనా) సొంతం చేసుకున్నాడు.

## తలైవాస్ గెలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తమిళ్ తలైవాస్ 45-28 స్కోరుతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ పోరులో తమిళ్ రెయిడర్లు నరేందర్ (14), అజింక్యా పవార్ (11) క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చి పెట్టారు. డిఫెండర్లలో సాగర్ (5), సాహిల్ గులియా (4) రాణించారు. బెంగళూరు తరఫున రెయిడర్ అక్షిత్ (12) ఒంటరి పోరాటం చేశాడు. సుశీల్ 6 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో పుణేరీ పల్టన్ 32-24 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది. పుణేరీ తరఫున మొహమ్మద్ రెజా 9 పాయింట్లు మోహిత్ గోయత్ 7 పాయింట్లు సాధించారు. గుజరాత్ ఆటగాళ్లలో మొహమ్మద్ నబీబక్ష్ 7, ప్రతీక్ దహియా 5 పాయింట్లు నమోదు చేశారు.

### పాయింట్ల పట్టిక (PKL)

| జట్టు | ఆ | గె | ఓ | టై | పా |
|---|---|---|---|---|---|
| జైపూర్ పింక్ పాంథర్స్ | 14 | 10 | 2 | 2 | 58 |
| పుణేరి పల్టన్ | 13 | 11 | 2 | 0 | 57 |
| దబంగ్ ఢిల్లీ | 14 | 8 | 4 | 2 | 49 |
| గుజరాత్ జెయింట్స్ | 14 | 8 | 6 | 0 | 44 |
| హరియాణా స్టీలర్స్ | 13 | 7 | 5 | 1 | 39 |
| బెంగాల్ వారియర్స్ | 13 | 6 | 5 | 2 | 38 |
| యు ముంబా | 13 | 6 | 6 | 1 | 37 |
| పట్నా పైరేట్స్ | 14 | 6 | 7 | 1 | 37 |
| బెంగళూరు బుల్స్ | 15 | 6 | 9 | 0 | 37 |
| తమిళ్ తలైవాస్ | 14 | 5 | 9 | 0 | 30 |
| యూపీ యోధాస్ | 15 | 3 | 11 | 1 | 23 |
| తెలుగు టైటాన్స్ | 14 | 2 | 12 | 0 | 15 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

# భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## బీమా సంస్థలో 274 ఉద్యోగాలు

జాబ్స్ ఇన్ఫో

» రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక
» ఎంపికైతే నెలకు రూ.85వేల వరకూ వేతనం

ప్రభుత్వ రంగ సంస్థ.. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్ఐసీ) పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా 274 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ (జనరలిస్ట్స్,స్పెషలిస్ట్స్) స్కేల్-1 పోస్టులను భర్తీ చేయనుంది. రాత పరీక్ష, సర్టిఫికేషన్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

» మొత్తం పోస్టుల సంఖ్య: 274

**పోస్టుల వివరాలు**

» **డాక్టర్స్:** ఈ విభాగంలో 28 ఉద్యోగాలున్నాయి. ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్ /పీజీ-మెడికల్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా నేషనల్ మెడికల్ కమిషన్ గుర్తించిన మెడికల్ డిగ్రీ పూర్తిచేయాలి. నేషనల్ మెడికల్ కమిషన్‌లో రిజిస్టరై ఉండాలి.

» **లీగల్:** ఈ విభాగంలో 20 పోస్టులు ఉన్నాయి. ఇందులో లా గ్రాడ్యుయేషన్/పోస్ట్ గ్రాడ్యుయేషన్‌ను 60శాతం మార్కులతో పూర్తిచేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం ఉండాలి.

» **ఫైనాన్స్:** ఈ విభాగంలో 30 ఖాళీలున్నాయి. ఛార్టెడ్ అకౌంటెంట్(ఐసీఏఐ/కాస్ట్ అకౌంటెంట్(ఐసీడబ్ల్యూఏ) పూర్తిచేయాలి. లేదా బీకాం/ఎంకామ్‌లో 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 55శాతం సరిపోతుంది.

» **యాక్చూరియల్:** ఇందులో 2 పోస్టులున్నాయి. స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్ /యాక్చూరియల్ సైన్స్ డిగ్రీ 60 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం ఉండాలి.

» **ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ:** ఇందులో 20 ఖాళీలున్నాయి. కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 55శాతం ఉండాలి.

» **ఆటోమొబైల్ ఇంజనీర్స్:** ఈ విభాగంలో 20 పోస్టులున్నాయి. ఆటోమొబైల్ ఇంజనీరింగ్ బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్ 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ఎస్టీలకు 55 శాతం.

» **జనరలిస్ట్ ఆఫీసర్స్:** ఇందులో 130 పోస్టులున్నాయి. ఏదైనా డిగ్రీ/పీజీ 60శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ/ఎస్టీలకు 55శాతం సరిపోతుంది.

» **హిందీ(రాజ్‌భాష) ఆఫీసర్స్:** ఈ విభాగంలో 24 పోస్టులున్నాయి. హిందీ పీజీ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ఎస్టీలకు 55 శాతం. ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్టుగా చదివుండాలి. లేదా హిందీ ఒక సబ్జెక్టుగా ఇంగ్లిష్‌లో పీజీ చేయాలి.

**వయసు**

01.12.2023 నాటికి అభ్యర్థుల వయసు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ఠ వయసులో ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు మూడేళ్లు,పీడబ్ల్యూబీడీలకు 10ఏళ్లు,ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 5ఏళ్ల వరకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

**ఎంపిక ఇలా**

హిందీ ఆఫీసర్స్ పోస్టులకు తప్ప..మిగతా అన్ని పోస్టులకూ ఎంపిక విధానం ఒకే విధంగా ఉంటుంది. ఎంపికలో భాగంగా రెండు దశల్లో రాతపరీక్షను నిర్వహిస్తారు. మొదటి దశ (ఫేజ్-1)లో ఆన్‌లైన్ ప్రిలిమినరీ, రెండో దశ (ఫేజ్-2)లో ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష ఉంటాయి.

**ఫేజ్-1 ప్రిలిమినరీ**

ప్రిలిమ్స్ ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. ఇందులో మూడు విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్-30 మార్కులు,రీజనింగ్ ఎబిలిటీ-35 మార్కులు,క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-35 మార్కులకు ప్రశ్నలుంటాయి. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రతి సెక్షన్‌నూ నిర్దేశించిన వ్యవధిలోనే పూర్తిచేయాలి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో ఫేజ్-2లోని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

**250 మార్కులకు మెయిన్ పరీక్ష**

» మెయిన్ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో 250 మార్కులకు, డిస్క్రిప్టివ్ టెస్ట్ 30 మార్కులకు ఉంటాయి. ఆబ్జెక్టివ్ అనంతరం డిస్క్రిప్టివ్ రాయాలి. మెయిన్ పరీక్ష జనరలిస్ట్, స్పెషలిస్టు పోస్టులకు వేర్వేరుగా ఉంటుంది.

» **జనరలిస్ట్ పోస్టులకు:** ఇందులో 5 విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రతి విభాగం నుంచి 50 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. అవి... రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీ భాషల్లో ఉంటుంది.

» **స్పెషలిస్టు పోస్టులకు:** ఇందులో 6 విభాగాలుంటాయి. మొదటి 5 విభాగాలు రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్. ప్రతి విభాగం నుంచి 40 ప్రశ్నలకు, 40 మార్కులుంటాయి. చివరి విభాగం టెక్నికల్ అండ్ ప్రొఫెషనల్ నాలెడ్జ్ నుంచి 50 ప్రశ్నలకు 50 మార్కుల ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి పావు వంతు మార్కును తగ్గిస్తారు.

» ఇంగ్లిష్ లాంగ్వేజ్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌కు 30 మార్కులు (ఎస్సే-10, కాంప్రహెన్షన్-10).

**ముఖ్యసమాచారం**

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:22.01.2024
» వెబ్‌సైట్: https://nationalinsurance.nic.co.in

## ఇలా చేస్తే.. సర్కారీ కొలువు సులువు

» తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు
» ఇప్పటికే ఏపీపీఎస్సీ నుంచి వరుస నోటిఫికేషన్లు
» తెలంగాణలోనూ మరికొద్ది రోజుల్లో నోటిఫికేషన్లకు అవకాశం
» ముందస్తు వ్యూహం, ప్రణాళికతో విజయానికి బాటలు

**సర్కారీ కొలువులో చేరడం.. సుస్థిర భవితను సొంతం చేసుకోవడం.. నేడు ప్రతి ఒక్క ఉద్యోగార్థి కల! బీటెక్ వంటి టెక్నికల్ కోర్సులు మొదలు సంప్రదాయ బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ అభ్యర్థుల వరకూ.. అధికశాతం మంది ప్రభుత్వ ఉద్యోగం కావాలని కోరుకుంటున్నారు!! ఇందుకోసం ఆయా రిక్రూట్‌మెంట్ సంస్థల నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటారు. కొత్త సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో సర్కారీ కొలువుల భర్తీ ప్రక్రియకు ప్రభుత్వాలు చర్యలు ప్రారంభించాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ఏపీపీఎస్సీ వరుస నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. మరోవైపు తెలంగాణలోనూ గ్రూప్స్ మొదలు డీఎస్సీ వరకు ఉద్యోగ నోటిఫికేషన్ల దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. కొత్త సంవత్సరంలో.. ఉద్యోగార్థులు తమ సర్కారీ కొలువు కలను నిజం చేసుకునే మార్గాలపై విశ్లేషణాత్మక కథనం..**




లక్ష్యం నిర్దేశించుకోవడం ఒక ఎత్తయితే.. దాన్ని చేరుకునే దిశగా అడుగులు వేయడం అంతకంటే ఎంతో ముఖ్యం. ప్రధానంగా లక్షల్లో పోటీ ఉండే ప్రభుత్వ ఉద్యోగం సొంతం చేసుకోవాలనుకుంటే.. అందుకు తగ్గ పటిష్ట ప్రిపరేషన్ ప్రణాళికతో ముందుకు సాగాలి అంటున్నారు నిపుణులు.

**వ్యూహంతోనే విజయం**

బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో అనేక ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు పోటీ పడే అవకాశం ఉంది. అదే విధంగా పలు నియామక పరీక్షల్లో ఒకే విధమైన సిలబస్ అంశాలు ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు ఉమ్మడి ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి. ఫలితంగా ఒకే సమయంలో పలు పరీక్షలకు సన్నద్ధత పొందొచ్చు.

**ఉమ్మడి అంశాలపై పట్టు**

ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు.. ముందుగా సిలబస్‌ను సమగ్రంగా అవగాహన చేసుకోవాలి. ఇందులో కామన్ టాపిక్స్‌ను గుర్తించాలి. ప్రస్తుతం ఆయా పరీక్షలను గమనిస్తే.. అన్నింటిలోనూ జనరల్ నాలెడ్జ్/జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ మెంటల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ సబ్జెక్టులు కామన్‌గా కనిపిస్తున్నాయి. పరీక్షల్లో వీటికి ఎక్కువ వెయిటేజీ ఉంటోంది. వీటితోపాటు జనరల్ స్టడీస్, హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎకాలజీ, అంతర్జాతీయ, జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలతో సిలబస్ ఉంటోంది. వీటిపై పట్టు సాధించే ప్రయత్నం చేయాలి. ఉమ్మడి టాపిక్స్ సిలబస్‌కు, ప్రత్యేక టాపిక్స్ సిలబస్‌కు సమయం కేటాయించునేలా పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలి.

**పరీక్ష తేదీలను గుర్తిస్తూ**

ఉమ్మడి సిలబస్‌తో పలు పరీక్షలకు పోటీ పడే అభ్యర్థులు..ఆయా పరీక్షల తేదీలకు అనుగుణంగా ముందుకుసాగాలి. తొలుత పరీక్ష జరిగే పోస్ట్‌లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పరీక్ష తేదీకి కనీసం నెల రోజుల ముందు నుంచీ ఆ పరీక్ష ప్రిపరేషన్‌కే సమయం కేటాయించాలి.

**జనరల్ అవేర్‌నెస్**

జనరల్ అవేర్‌నెస్/జనరల్ స్టడీస్.. అన్ని నియామక పరీక్షల్లో కనిపించే విభాగం ఇది. సివిల్స్ వంటి అత్యున్నత పరీక్షల అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అమలవుతున్న పథకాలు, ఆయా రాష్ట్రాల ఆర్థిక విధానాలు, పథకాలు -లబ్ధిదారులు; లక్షిత వర్గాలు, సామాజిక అంశాలు, సంస్కృతి తదితర అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.

**ఈ టాపిక్స్‌పై ఫోకస్**

అభ్యర్థులు జనరల్ అవేర్‌నెస్ తర్వాత.. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, మెంటల్ ఎబిలిటీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి.. మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, యావరేజెస్, రేషియో-ప్రపోర్షన్, ప్రాఫిట్-లాస్, సింపుల్- కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్-వర్క్, టైమ్-డిస్టెన్స్, పర్ముటేషన్స్ -కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, మిక్షర్ అండ్ అలిగేషన్స్, పార్టనర్ షిప్‌పై దృష్టిపెట్టాలి. భాగహారాలు, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలను నోటితో గణించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. సింప్లిఫికేషన్స్‌కు బోడ్‌మాస్ రూల్స్‌ను అనుసరించాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తించుకోవాలి. డేటా ఇంటర్‌ప్రెటేషన్, మెంటల్ ఎబిలిటీలో.. టేబుల్స్, చార్ట్‌లు, గ్రాఫ్‌ల ద్వారా సమాచారమిస్తూ ప్రశ్నలు అడుగుతారు. వీటిని సాధించాలంటే.. పర్సంటేజెస్, యావరేజెస్, రేషియోలతో ఉండే భిన్నమైన ప్రశ్నలు సాధన చేయాలి.

**ఇంగ్లిష్ లాంగ్వేజ్**

గ్రూప్-1 నుంచి సబార్డినేట్ సర్వీసుల పరీక్షల వరకు.. ప్రతి పరీక్షలోనూ కచ్చితంగా ఉండే సబ్జెక్ట్ ఇంగ్లిష్. దీనికోసం అభ్యర్థులు బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, రీడింగ్ కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్‌పైనా దృష్టిపెట్టాలి. అదేవిధంగా స్పెల్లింగ్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, టెన్సెస్, ప్రిపోజిషన్స్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, వొకాబ్యులరీ, రీ రైటింగ్ ద సెంటెన్స్, సెంటెన్స్ రీ-అరేంజ్‌మెంట్, ఆల్ఫాబెటికల్ ఆర్డర్, ప్రెసిస్ రైటింగ్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, కాంప్లెక్స్ సెంటెన్సెస్ వంటి ముఖ్యాంశాలపై దృష్టి సారించాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, వొకాబ్యులరీల్లో పూర్తి స్థాయిలో నైపుణ్యం పొందాలి.

**లక్ష్యం ఉన్నతం**

ఉమ్మడి సిలబస్ అవకాశాన్ని అనుకూలంగా చేసుకుంటూ..పోటీ పరీక్షలకు హాజరవ్వాలనుకునే అభ్యర్థులు ఉన్నత స్థాయి పరీక్షను తమ తొలి గమ్యంగా నిర్దేశించుకోవాలి. దానికి అనుగుణంగా ఆ స్థాయి ప్రిపరేషన్ సాగించాలి. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే గ్రూప్-1 లక్ష్యంగా ప్రిపరేషన్ సాగిస్తే.. ఆ తర్వాత స్థాయిలోని గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4లను సులభంగా సాధించే వీలుంది. అదే విధంగా జాతీయ స్థాయిలోని అత్యున్నత పరీక్ష సివిల్ సర్వీసెస్‌ను లక్ష్యంగా ప్రిపరేషన్ కొనసాగిస్తే.. యూపీఎస్సీ నిర్వహించే ఇతర పోటీ పరీక్షల్లో, రాష్ట్రస్థాయి గ్రూప్స్ పరీక్షల్లో విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

**డిస్క్రిప్టివ్‌గానే అడుగులు**

పరీక్ష ఏదైనా.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగించడం మేలు చేస్తుంది. ముఖ్యంగా గ్రూప్-1 వంటి ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలోని పరీక్షలు; అదే విధంగా పూర్తిగా ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఉండే గ్రూప్-2, 3, 4, ఇతర పోటీ పరీక్షలకు ఈ విధానాన్ని అనుసరించాలి. పరీక్ష ఏదైనా.. డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ముందుకు సాగితే.. ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు సులభంగా సమాధానాలు ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. ఇది రెండు రకాల పరీక్షల్లోనూ విజయానికి దోహదపడుతుంది.

**సొంత నోట్స్**

ఆయా పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు.. ఎప్పటికప్పుడు తాము చదివిన టాపిక్స్ నుంచి ముఖ్యమైన అంశాలతో షార్ట్ నోట్స్ రాసుకోవాలి. సొంత నోట్సు రివిజన్ సమయంలో చాలా కీలకంగా మారుతుంది. వేగంగా పునశ్చరణ చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

**నమూనా పరీక్షలు**

అభ్యర్థులు నమూనా పరీక్షలకు హాజరై.. తమ బలాలు, బలహీనతలను గుర్తించాలి. దీని ఆధారంగా తక్కువ మార్కులు వస్తున్న టాపిక్స్, అందుకు కారణాలను గుర్తించి.. వాటి ప్రాధాన్యతకు అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలి. ఆయా సిలబస్ అంశాలకు పరీక్షలో వెయిటేజీ ఎక్కువగా ఉంటే.. వాటి ప్రిపరేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

**అనుసంధాన దృక్పథం**

ఒకే సమయంలో పలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు.. అనుసంధాన వ్యూహాన్ని అనుసరించాలి. అన్ని పరీక్షలలోనూ కామన్ టాపిక్స్‌ను గుర్తించి.. వాటిని ఏకకాలంలో పూర్తి చేసే విధంగా వ్యవహరించాలి. ప్రతి పరీక్షలోనూ ఆయా సబ్జెక్ట్‌ల మధ్య ఉన్న పోలికలను గుర్తిస్తూ.. వాటిని కూడా అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తే విజయం సాధించొచ్చు.

**స్టాక్‌ మార్కెట్లు**

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 260 | 51 |
| 71,424 | 21,572 |

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్‌ | 15,294 | △ | 238 |
| డోజోన్స్‌ | 37,847 | △ | 378 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,462 | △ | 3 |
| డాక్స్‌ | 16,555 | ▽ | 12 |
| షాంఘై | 2,833 | ▽ | 14 |
| నికాయ్‌ | 35,963 | △ | 467 |

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

**ఫారెక్స్‌ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | ఎసిఐ | 82.75 | 83.77 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | ఎసిఐ | 104.56 | 107.12 |
| € | యూరో | ఎసిఐ | 89.46 | 91.83 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | ఎసిఐ | 55.54 | 56.80 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్‌ | ఎసిఐ | 53.85 | 55.78 |
| S$ | సింగపూర్‌ డాలర్‌ | ఎసిఐ | 61.21 | 62.67 |
| SAR | సౌదీ రియాల్‌ | థామస్‌కుక్‌ | 21.19 | 22.81 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | థామస్‌కుక్‌ | 21.69 | 23.51 |
| ¥ | చైనా యువాన్‌ | థామస్‌కుక్‌ | 10.39 | 12.49 |

# 2024లో పెట్టుబడులకు దారేది..?

ఈక్విటీలతోనే మెరుగైన రాబడి • బంగారానికి తప్పక చోటుండాలి
అనిశ్చితి, ద్రవ్యోల్బణం నుంచి రక్షణ • దీర్ఘకాలంలో ఆకర్షణీయ ఆదాయం
డెట్‌లో పెట్టుబడులకు అనుకూలతలు • సరైన కేటాయింపులతో మెరుగైన లాభాలు



ఇన్వెస్టర్లు ఏడాదికోసారి తమ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను తప్పకుండా సమీక్షించుకోవాలి. అప్పుడే ఏ విభాగానికి ఏ మేరకు కేటాయింపులు చేయాలన్న స్పష్టత వస్తుంది. ఈక్విటీలు ఆల్‌టైమ్‌ గరిష్టాల్లో ట్రేడ్‌ అవుతున్నాయి. వడ్డీ రేట్లు సైతం గరిష్టాలకు చేరాయి. ఈ ఏడాది ప్రథమార్ధంలో కీలకమైన సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. క్యాపిటల్‌ మార్కెట్లపై ఈ ప్రభావం తప్పకుండా కనిపిస్తుంది. ఈక్విటీ, డెట్‌, బంగారం, రియల్‌ ఎస్టేట్‌.. వీటిల్లో ఏ విభాగం పనితీరు ఎలా ఉంటుంది..? ఇది తెలిస్తే.. తమ పెట్టుబడుల్లో వేటికి ఎంత మేర ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిర్ణయించుకోవచ్చు. తద్వారా అధిక రాబడులను ఒడిసి పట్టుకోవచ్చు. అంతేకాదు, మార్కెట్‌ అస్థిరతలను తట్టుకునే విధంగా తమ పోర్ట్‌ఫోలియోను నిర్మించుకోవచ్చు. దీనిపై మార్కెట్‌ నిపుణుల అభిప్రాయాల సమాహారమే ఈ వారం ప్రాఫిట్‌ ప్లస్‌ కథనం.




దీర్ఘకాలంలో ఇతర సాధనాలతో పోలిస్తే ఈక్విటీలు అధిక రాబడులు ఇస్తాయని తెలిసిందే. 2024 సైతం ఇందుకు భిన్నంగా ఏమీ ఉండకపోవచ్చు. ''2024 పట్ల ఆశావహ దృక్పథంతో ఉన్నాం. అంతర్జాతీయ, దేశీయ ముఖచిత్రం మెరుగ్గా కనిపిస్తోంది. ద్రవ్యోల్బణం నియంత్రణ పరిధిలో ఉండడం, మానిటరీ పాలసీ రేట్ల విషయంలో సర్దుబాట్లు, ముడి చమురు ధరలు తగ్గడం ఇందుకు మద్దతునిస్తున్నాయి''అని ఫండ్స్‌ ఇండియా సీఈవో గిరిరాజన్‌ మురుగన్‌ పేర్కొన్నారు. కరోనా మహమ్మారి, ఆ తర్వాత పలు దేశాల మధ్య యుద్ధాలతో అంతర్జాతీయంగా ఏర్పడిన అవరోధాల నడుమ మన దేశ ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు ప్రదర్శించడాన్ని గమనించొచ్చు. ''అంతర్జాతీయంగా వాణిజ్యం విషయంలో మారిన ప్రాధాన్యతలు భారత్‌కు అనుకూలించనున్నాయి. పలు రంగాల్లో భారత్‌ అంతర్జాతీయంగా మార్కెట్‌ వాటాను పెంచుకోనుంది. ఒకవైపు సేవల ఎగుమతుల్లో బలంగా ఉన్నాం. మరోవైపు తయారీలోనూ బలమైన స్థానం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది''అని ఓల్డ్‌ బ్రిడ్జ్‌ క్యాపిటల్‌ మేనేజ్‌మెంట్‌ వ్యవస్థాపకుడు

## ఈక్విటీ అవకాశాలు



కెన్నెత్‌ ఆండ్రడే పేర్కొన్నారు. ఈక్విటీ ఇన్వెస్టర్లకు భారత్‌ ప్రాధాన్య ఎంపికగా ఉంటుందన్న విశ్లేషణ వినిపిస్తోంది. ''భారత్‌ ఆర్థిక అంచనాలు బలంగా ఉన్నాయి. అంతర్జాతీయ వృద్ధి అంచనా 2.7 శాతాన్ని భారత్‌ వృద్ధి అంచనాలు 6.5–7 అధిగమిస్తున్నాయి. భారత ప్రభుత్వం వైపు నుంచి పారదర్శక, స్థిరమైన, స్నేహపూర్వక పెట్టుబడుల విధానాలు ఈ వృద్ధికి బలాన్నిస్తున్నాయి. ఇవన్నీ ప్రపంచవేదికపై భారత్‌ను పెట్టుబడులకు ఆకర్షణీయమైన స్వర్గధామంగా మారుస్తున్నాయి''అని వైజ్‌ఎక్స్‌ సీఈవో ఆర్యమన్‌ వీర్‌ తెలిపారు.

• ● •

ఈక్విటీల్లోనూ మెరుగైన రాబడుల అవకాశాలు ఎక్కడ ఉన్నాయి? అన్న సందేహం వస్తుంది. కేంద్ర సర్కారు దేశీ తయారీ బలోపేతంపై విరామం లేకుండా కృషి చేస్తోంది. కనుక తయారీ రంగం 2024లోనూ బలమైన పనితీరు చూపించనుంది. 2024 సంవత్సరం మధ్య నుంచి వడ్డీ రేట్ల కోత మొదలవుతుందని ఎక్కువ మంది విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. వడ్డీ రేట్ల కోత భారత మార్కెట్లకు మరింత బూస్టినిస్తుందన్న విశ్లేషణలు ఉన్నాయి. ''వడ్డీ రేట్ల కోతతో విదేశీ ఇనిస్టిట్యూషన్‌ ఇన్వెస్టర్ల పెట్టుబడులు మరింతగా భారత్‌కు తరలివస్తాయి. దీంతో తయారీ, ఐటీ, బ్యాంకింగ్‌, ఆటోమొబైల్స్‌, ఇన్సూరెన్స్‌, రియల్‌ ఎస్టేట్‌, డిఫెన్స్‌, రైల్వే ఇన్‌ఫ్రా, డిజిటల్‌ ట్రాన్స్‌ఫార్మేషన్‌ కంపెనీలు లాభపడనున్నాయి''అని మురుగన్‌ వివరించారు. దేశీయ ఇన్వెస్టర్లు చిన్న కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తుంటే.. అంతర్జాతీయ ఇన్వెస్టర్లు పెద్ద కంపెనీలు, సూచీల్లో ఎక్కువ వెయిటేజీ ఉన్న వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆండ్రడే తెలిపారు. ''ఈ ఏడాది డిఫెన్స్‌, రియాలిటీ, ఆటో, ప్రభుత్వరంగ, ఫార్మా కంపెనీలు మంచి పనితీరు చూపిస్తాయి. నూతనతరం (న్యూఏజ్‌) వ్యాపార కంపెనీలు అయితే డార్క్‌హార్స్‌గా నిలుస్తాయి. ఫైనాన్షియల్స్‌, ఐటీ, తయారీ, ప్రభుత్వరంగ సంస్థలు, హెల్త్‌కేర్‌ థీమ్‌లు సైతం ఇన్వెస్టర్లకు లాభాలను పంచుతాయి'' అని రీసెర్చ్‌ అండ్‌ ర్యాంకింగ్‌ సీఐవో జస్ప్రీత్‌ సింగ్‌ అరోరా అభిప్రాయపడ్డారు. 2022 ఈక్విటీలకు అనుకూలంగా లేని విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. 2022, 2023 రెండు సంవత్సరాలకు కలిపి చూస్తే సెన్సెక్స్‌ ఇచ్చిన నికర వార్షిక రాబడి 11.5 శాతమే. మార్కెట్ల వ్యాల్యూయేషన్లు కొంచెం గరిష్ట స్థాయికి చేరినందున ఇన్వెస్టర్లు వైవిధ్యంతో అడుగులు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. మిడ్‌, లార్జ్‌క్యాప్‌ కంపెనీలకు ప్రాధాన్యం ఇవ్వొచ్చని, అధిక రుణభారంతో నడిచే కంపెనీలకు దూరంగా ఉండాలని మురుగన్‌ సూచించారు.

## రియల్‌ ఎస్టేట్‌



దశాబ్ద కాలం పాటు రియల్‌ ఎస్టేట్‌లో డిమాండ్‌ పెద్దగా పెరగలేదు. కరోనా మహమ్మారి తర్వాత నుంచి డిమాండ్‌ పరిస్థితుల్లో స్పష్టమైన మార్పు కనిపించింది. వచ్చే ఐదు, పదేళ్ల పాటు రియల్‌ ఎస్టేట్‌ మెరుగైన పనితీరు చూపిస్తుందనే అంచనాలు ఉన్నాయి. 2030 నాటికి భారత్‌ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని నిపుణులు, విశ్లేషకుల అంచనా వేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ మెరుగైన పనితీరుకు అనుగుణంగా ఈ రంగంలోకి పెట్టుబడులు వస్తాయన్న అభిప్రాయాలు ఉన్నాయి. కానీ, భౌతిక రియల్‌ ఎస్టేట్‌ అన్నది భారీ పెట్టుబడికి సంబంధించిన అంశం. అధిక ఆర్జన కలిగిన వర్గానికి ఇది అనుకూలంగా ఉంటుంది. ''పెట్టుబడి పరంగా రియల్‌ ఎస్టేట్‌ అన్నది క్లిష్టమైన, లిక్విడిటీ పెద్దగా లేని సాధనం. వైవిధ్యం కోసం రియల్‌ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టాలని అనుకున్నా, రిస్క్‌లు కూడా లేకపోలేదు. రియల్‌ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టే ముందు ఇన్వెస్టర్లు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి''అని హర్ష గెహ్లోట్‌ సూచించారు. వాణిజ్య రియల్‌ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్‌ చేయాలనుకుంటే, అందుకు స్టాక్‌ ఎక్స్ఛేంజ్‌లలో లిస్ట్‌ అయిన రియల్‌ ఎస్టేట్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ట్రస్ట్‌ (రీట్‌)లను పరిశీలించొచ్చు.





దీర్ఘకాలంలో (10–15 ఏళ్లు అంతకంటే ఎక్కువ) బంగారం ద్రవ్యోల్బణానికి మించి రాబడులను ఇస్తున్నట్టు ఫండ్స్‌ ఇండియా రిపోర్ట్‌ చెబుతోంది. చారిత్రక గణాంకాలను పరిశీలించినా ఇదే విషయం తెలుస్తుంది. దీర్ఘకాలంలో బంగారంపై రాబడి ద్రవ్యోల్బణం కంటే 2–4 శాతం అధికంగా ఉంటోంది. స్వల్పకాలానికి ఇది అనుకూలమైన సాధనం కాదు. అదే పనిగా స్థిరమైన రాబడులను అన్ని కాలాల్లోనూ బంగారం నుంచి ఆశించరాదు. మధ్య మధ్యలో బంగారం కొన్నేళ్లపాటు ఎలాంటి రాబడులు లేకుండా కొనసాగుతందని చెప్పడానికి గత ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. దీర్ఘకాలం కోసం ఇందులో ఇన్వెస్ట్‌ చేయడం వల్ల పెట్టుబడుల్లో వైవిధ్యానికి తోడు, అనిశ్చిత సమయాల్లో, ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్‌ సాధనంగా ఉపకరిస్తుంది. ''భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కరెన్సీ యుద్ధాలు, ప్రపంచవ్యాప్తంగా అధిక ద్రవ్యోల్బణం ఇవన్నీ బంగారంలో పెట్టుబడికి బలమైన నేపథ్యాలుగా చూడొచ్చు. రాబడులు అధిక స్థాయిలో లేకపోయినా, మరే ఇతర సాధనంలో లేనంతగా పెట్టుబడుల భద్రతకు బంగారం భరోసానిస్తుంది. రిస్క్‌లను ఎదుర్కొనేందుకు వీలుగా పోర్ట్‌ఫోలియోలో కొంత మొత్తాన్ని బంగారానికి కేటాయించుకోవడం మంచి నిర్ణయం అవుతుంది''అని ఫిన్‌ఎడ్జ్‌ సీఈవో హర్ష గెహ్లోట్‌ సూచించారు.

బంగారానికి అనుకూలించే ఇతర అంశాలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంక్‌లు సైతం బంగారాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నాయి. డాలర్‌ నుంచి


## బంగారం



వైవిధ్యం కోరుకోవడం కూడా బంగారానికి మద్దతునిచ్చే అంశం. సెంట్రల్‌ బ్యాంక్‌ల నుంచి బంగారానికి డిమాండ్‌ ఉండడం 2023లో ధరలకు మద్దతునిచ్చిందని, 2024లోనూ ఇదే ధోరణి కొనసాగుతుందని అంచనా. భారత్‌, చైనా బంగారం కొనుగోళ్లలో రెండు అతిపెద్ద దేశాలు కాగా, వీటి నుంచి ఈ ఏడాదీ కొనుగోళ్లకు డిమాండ్‌ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పైగా మన దేశం బలమైన ఆర్థిక వృద్ధి నమోదు చేస్తున్న క్రమంలో బంగారానికి డిమాండ్‌ పెరుగుతుందన్న అంచనా కూడా ఉంది. అయితే బంగారానికి ఎంత శాతం పెట్టుబడి కేటాయించుకోవాలన్న సందేహం ఏర్పడొచ్చు. ''పెట్టుబడులకు బంగారాన్ని వైవిధ్య సాధనంగా చూడొచ్చు. అదే సమయంలో బంగారంపై పరిమితికి మించి చేసే పెట్టుబడులతో ప్రతికూల ఉత్పాదకత కూడా ఎదురుకావచ్చు. కనుక ఇన్వెస్టర్లు తమ సౌకర్యానికి అనుగుణంగా మొత్తం పెట్టుబడుల్లో 5–10 శాతానికి మించకుండా బంగారానికి కేటాయించుకోవచ్చు''అని నిపుణుల సూచన.

## వేటికి ఏ మేరకు..

వివిధ సాధనాల మధ్య పెట్టుబడులను వైవిధ్యం చేసుకోవడం ఎంత ముఖ్యమో.. అదే విధంగా ఒక్కో సాధనానికి ఎంత మేరకు కేటాయింపులు చేయాలన్నదీ కీలకమే. ఇన్వెస్టర్‌ వయసు, రిస్క్‌ తీసుకునే సామర్థ్యం, పెట్టుబడుల కాల వ్యవధి, పెట్టుబడుల వెనుక ఉన్న లక్ష్యం ఇవన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. సాధారణ నియమం ప్రకారం.. ఐదేళ్లు అంతకుమించి ఎక్కువ కాలం పాటు తన పెట్టుబడులు కొనసాగించే వెసులుబాటు ఉండి, అధికంగా వృద్ధి కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీ ఫండ్స్‌ మొదటి ఆప్షన్‌ అవుతుంది. ఫండ్స్‌ బలమైన నియంత్రణల మధ్య, తక్కువ వ్యయాలు, చక్కని వైవిధ్యంతో, తగినంత లిక్విడిటీతో, నిపుణుల ఆధ్వర్యంలో పనిచేస్తుంటాయని, ఇన్వెస్టర్లు తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఎంపిక చేసుకోవచ్చని గెహ్లోట్‌ సూచించారు. రిస్క్‌ నివారణకు ఈక్విటీల్లో దీర్ఘకాలానికి సిప్‌ ద్వారా ఇన్వెస్ట్‌ చేసుకోవడం మెరుగైన నిర్ణయం అవుతుంది. ఐదేళ్లకు మించిన కాలానికి ఇన్వెస్ట్‌ చేసే వారు ఈక్విటీలకు మొత్తం పెట్టుబడుల్లో 70–80% వరకు, డెట్‌కు 15–20% వరకు, బంగారానికి 5–10% మధ్య కేటాయింపులు చేసుకోవచ్చు. ఒకవేళ పదేళ్లు అంతకుమించి అయితే ఈక్విటీలకు 80–90%, డెట్‌కు 5–10%, బంగారానికి 5–10% వరకు కేటాయించుకోవచ్చు. పదేళ్లకు రియల్‌ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్‌ చేసుకోవాలని అనుకుంటే 20% వరకు కేటాయింపులు చేసుకోవచ్చన్నది సూచన. అప్పుడు డెట్‌ కేటాయింపులను రియల్‌ ఎస్టేట్‌కు మళ్లించుకోవచ్చు.



## డెట్‌ సాధనాలు..




డెట్‌ (స్థిరాదాయ) విభాగంలో పెట్టుబడులకు ఈ ఏడాది అనుకూలమేనని విశ్లేషకుల అభిప్రాయం. ''2023–24 వృద్ధి అంచనాలను ఆర్‌బీఐ అర శాతం పెంచి 7 శాతం చేసింది. 2024లో కనీసం మూడు పర్యాయాలు రేట్ల కోత ఉంటుందని యూఎస్‌ ఫెడ్‌ సంకేతాలు ఇచ్చింది. వడ్డీ రేట్ల కోతతో బాండ్‌ ధరలు పెరుగుతాయి. ఇది బాండ్లలో ఇన్వెస్ట్‌ చేసిన వారికి అనుకూలం''అని రీసెర్చ్‌ అండ్‌ ర్యాంకింగ్‌ సీఐవో జస్ప్రీత్‌ సింగ్‌ అరోరా పేర్కొన్నారు. ''2024–25లో జీడీపీ 6 శాతం లేదా అంతకంటే ఎక్కువ వృద్ధి నమోదు చేస్తుంది. అదే కాలంలో సగటు ద్రవ్యోల్బణం 5 శాతంగా ఉండొచ్చు. గడిచిన రెండేళ్లలో ద్రవ్యోల్బణం 6 శాతంతో పోలిస్తే ఇది తక్కువ. కనుక 2024–25 ద్వితీయ ఆరు నెలల్లో ఆర్‌బీఐ రేట్ల కోత చేపట్టొచ్చు. ఆ నిర్ణయం పదేళ్ల భారత ప్రభుత్వ బాండ్ల (ఐజీబీ)కు అనుకూలిస్తుంది. భారత ప్రభుత్వ దీర్ఘకాలిక బాండ్లలో ఉన్న వారు రేట్ల కోత ప్రయోజనాలు పొందుతారు'' అని ఎడెల్‌వీజ్‌ అస్సెట్‌ మేనేజ్‌మెంట్‌ ఫిక్స్‌డ్‌ ఇన్‌కమ్‌ సీఐవో దావల్‌ దలాల్‌ తెలిపారు. 10 ఏళ్ల ఐజీబీ ప్రస్తుతమున్న 7.17 స్థాయి నుంచి 2025 మార్చి నాటికి 6.75 శాతానికి దిగొస్తుందని దలాల్‌ అంచనా వేస్తున్నారు. ఫిక్స్‌డ్‌ ఇన్‌కమ్‌ పోర్ట్‌ఫోలియోలో ఇన్వెస్టర్లు క్రమంగా వ్యవధి పెంచుకోవాలని, ఐజీబీలను జోడించుకోవాలని సూచించారు. స్వల్పకాలానికి కార్పొరేట్‌ సంస్థలు షార్ట్‌డ్యురేషన్‌ బాండ్ల జారీకి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వాటిపై ఈల్డ్స్‌ పెరగొచ్చని.. ఇన్వెస్టర్లు దీర్ఘకాల బాండ్లలో ప్రస్తుతమున్న అధిక రేట్లపై పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తారని దలాల్‌ అంచనా వేశారు. ఆదాయపన్ను చట్టంలోని నిబంధనల ప్రకారం అన్ని రకాల డెట్‌ సాధనాలపై ఇప్పుడు కాల వ్యవధితో సంబంధం లేకుండా ఒకటే పన్ను విధానం ఉండడాన్ని మర్చిపోకూడదు. డెట్‌ సాధనాలపై వచ్చే ఆదాయం వ్యక్తుల వార్షిక ఆదాయానికి కలుస్తుంది. వారి ఆదాయ శ్లాబు రేటు ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కనుక మెరుగైన రాబడులు ఇచ్చే డెట్‌ సాధనాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన. మీడియం డ్యురేషన్‌తో కూడిన డెట్‌ మ్యూచువల్‌ ఫండ్స్‌ ఇందులో ఒకటి. వడ్డీ రేట్లు గరిష్టాల్లో ఉన్నందున ఈ సమయంలో ఫిక్స్‌డ్‌ డిపాజిట్లను కూడా పరిశీలించొచ్చు. ఎఫ్‌డీలు, డెట్‌ మ్యూచువల్‌ ఫండ్స్‌లో రిస్క్‌ సహజంగా తక్కువ.

## మ్యాక్స్‌లైఫ్‌ మిడ్‌క్యాప్‌ మూమెంటమ్‌ ఫండ్‌



మ్యాక్స్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ కంపెనీ యులిప్‌ పాలసీదారుల కోసం 'మిడ్‌క్యాప్‌ మూమెంటమ్‌ ఇండెక్స్‌ ఫండ్‌'ను ప్రారంభించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్‌ 150 మూమెంటమ్‌ 50 ఇండెక్స్‌ను అనుసరించి ఇది పెట్టుబడులు పెడుతుంటుంది. అంటే ఇండెక్స్‌లోని స్టాక్స్‌లోనే వెయిటేజీ ఆధారంగా పెట్టుబడులు పెడుతుంది. కనుక దీన్ని ఇండెక్స్‌ ఫండ్‌గా పరిగణించొచ్చు. ఈ ఇండెక్స్‌ రాబడులు ఐదేళ్లలో ఏటా 28.7 శాతం, పదేళ్లలో ఏటా 26.7 శాతంగా ఉన్నట్టు మ్యాక్స్‌లైఫ్‌ ప్రకటించింది. ఈ నెల 29వ తేదీ వరకు ఈ నూతన ఫండ్‌లో పాల్గొనవచ్చని పేర్కొంది. ఇండెక్స్‌లోని స్టాక్స్‌లోనే పెట్టుబడులు పెడుతుంది కనుక రాబడులు కూడా దానినే ప్రతిఫలించే మాదిరిగా ఉంటాయని ఆశించొచ్చు. ఒక యూనిట్‌ ఎన్‌ఏవీ రూ.10. మిడ్‌క్యాప్‌ విభాగంలో వ్యూహాత్మక పెట్టుబడుల అవకాశాలను సొంతం చేసుకోవచ్చని మ్యాక్స్‌లైఫ్‌ పేర్కొంది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)


| 22-1-2024 | |
|---|---|
| విశాఖ | 560–00 |
| చిత్తూరు | 548–00 |
| ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి | 550–00 |
| విజయవాడ | 550–00 |
| రిటైల్‌ ధర (డజను) | 72.00 |
| **21-1-2024 ఫామ్‌ ధర...** | |
| హైదరాబాద్‌ | 531–00 |
| వరంగల్‌ | 533–00 |
| రిటైల్‌ ధర | 5.90 |

# కార్పొరేట్ల జై శ్రీరామ్‌

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ మందిర ప్రారంభ వేడుకల్లో కార్పొరేట్‌ సంస్థలు కూడా సందడిగా పాల్గొంటున్నాయి. కార్యక్రమాన్ని మల్టీప్లెక్సుల్లో లైవ్‌ టెలికాస్ట్‌ చేయడం మొదలుకుని లాభాల్లో కొంత వాటాను అయోధ్యలో ప్రసాద వితరణ కోసం విరాళాలు ఇవ్వడం వరకు వివిధ రకాలుగా పాలుపంచుకుంటున్నాయి. వినియోగ ఉత్పత్తులను తయారు చేసే పలు కంపెనీలు పెద్ద సంఖ్యలో హోర్డింగ్‌లు, గేట్‌ బ్రాండింగ్‌, షాప్‌ బోర్డులు, కియోస్క్‌లు మొదలైనవి ఏర్పాటు చేసి, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. నేడు (జనవరి 22న) రామ మందిర ప్రారంభ వేడుకలను 70 నగరాల్లోని 160 స్క్రీన్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు మల్టీప్లెక్స్‌ ఆపరేటర్‌ పీవీఆర్‌ ఐనాక్స్‌ ప్రకటించింది. జనవరి 17 నుంచి జనవరి 31 వరకు తమ ఉత్పత్తుల విక్రయాలపై వచ్చే లాభాల్లో కొంత భాగాన్ని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు విరాళంగా ఇవ్వనున్నట్లు డాబర్‌ ఇండియా సీఈవో మోహిత్‌ మల్హోత్రా తెలిపారు. భక్తుల రాకతో అయోధ్యలో నిత్యావసరాలకు డిమాండ్‌ భారీగా పెరిగే అవకాశం ఉండటంతో తమ ఉత్పత్తుల సరఫరాను డాబర్‌ మరింతగా పెంచింది.

**వెయ్యేళ్లైనా చెక్కుచెదరని నిర్మాణం: ఎల్‌అండ్‌టీ**

శ్రీ రామ మందిరాన్ని వెయ్యేళ్లైనా చెక్కు చెదరనంత పటిష్టంగా నిర్మించామని దిగ్గజ నిర్మాణ సంస్థ లార్సన్‌ అండ్‌ టూబ్రో సీఎండీ ఎస్‌ఎన్‌ సుబ్రహ్మణ్యన్‌ తెలిపారు. ఈ విషయంలో కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్‌ రాష్ట్ర ప్రభుత్వం, శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు తదితర వర్గాలు అందించిన తోడ్పాటుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదొక ఆలయంగా మాత్రమే కాకుండా ఇంజినీరింగ్‌ అద్భుతంగా కూడా నిల్చిపోతుందని కంపెనీ హోల్‌ టైమ్‌ డైరెక్టర్‌ ఎంవీ సతీష్‌ పేర్కొన్నారు.




**మరిన్ని విశేషాలు..**

- ఐటీసీలో భాగమైన మంగళదీప్‌ అగరబత్తీ బ్రాండ్‌ ఆరు నెలల పాటు ధూపాన్ని విరాళంగా అందించింది. అలాగే 'రామ్‌ కీ ఫేడీ' వద్ద రెండు అగరబత్తీ స్టాండ్లను ఏర్పాటు చేసింది. నదీ ఘాట్‌లలో పూజా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి పూజారులకు వేదికలను, మార్కెట్లో నీడకు గొడుగులు మొదలైనవి నెలకొల్పింది. భారీ భక్త సందోహాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రధాన ఆలయం దగ్గర 300 బ్యారికేడ్లు, ఆలయ ముఖ ద్వారం దగ్గర 100 పైచిలుకు బాకేడ్లను కూడా ఐటీసీ అందిస్తోంది.
- అయోధ్యలో ఎలక్ట్రిక్‌ ఆటోల సర్వీసులను ప్రవేశపెట్టినట్లు ట్యాక్సీ సేవల సంస్థ ఉబెర్‌ తెలిపింది. త్వరలో ఉబెర్‌గో, ఇంటర్‌సిటీ ఉబెర్‌ సేవలను కూడా అందుబాటులోకి తేనున్నట్లు వివరించింది.
- రామ మందిరంలో లైటింగ్‌ ఉత్పత్తుల సరఫరా, ఇన్‌స్టాలేషన్‌ పనులను నిర్వహించడం తమకు గర్వకారణమని హ్యావెల్స్‌ తెలిపింది.
- తాము భారత్‌లో ఎన్నో ప్రాజెక్టులు చేసినప్పటికీ రామ మందిరం వాటన్నింటిలోకెల్లా విశిష్టమైనదని యూఏఈకి చెందిన ఆర్‌ఏకే సెరామిక్స్‌ అభివర్ణించింది.

**కొత్త ఆభరణాల కలెక్షన్లు..**

సెన్కో గోల్డ్‌ అండ్‌ డైమండ్స్‌ సంస్థ 'సియారామ్‌' పేరిట, కల్యాణ్‌ జ్యుయలర్స్‌ 'నిమహ్‌' పేరిట హెరిటేజ్‌ జ్యుయలరీ కలెక్షన్‌ను ఆవిష్కరించాయి. మందిర వైభవాన్ని, సీతారాముల పట్టాభిషేక ఘట్టాన్ని ఆవిష్కృతం చేసేలా డిజైన్లను తీర్చిదిద్దినట్లు సెన్కో గోల్డ్‌ ఎండీ సేన్‌ తెలిపారు. సుసంపన్న వారసత్వాన్ని ప్రతిబింబించేలా డిజైన్స్‌తో నిమహ్‌ కలెక్షన్‌ను రూపొందించినట్లు కల్యాణ్‌ జ్యుయలర్స్‌ ఈడీ రమేష్‌ కల్యాణరామన్‌ పేర్కొన్నారు.

## స్టాక్స్‌ వ్యూ

**ఐజీ పెట్రోకెమికల్స్‌ | కీనోట్‌ క్యాపిటల్స్‌ | కొనొచ్చు**



**ప్రస్తుత ధర: రూ. 503 టార్గెట్‌: రూ. 819**

**ఎందుకంటే:** దనుకా గ్రూప్‌లో ఐజీ పెట్రోకెమికల్స్‌ లిమిటెడ్‌(ఐజీపీఎల్‌) ప్రధాన కంపెనీగా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. దేశీయంగా పెతాలిక్‌ ఎన్‌హైడ్రైడ్‌(పాన్‌) తయారీలో అతిపెద్ద కంపెనీగా నిలుస్తోంది. అంతర్జాతీయస్థాయిలో అత్యంత చౌకగా పాన్‌ను తయారు చేస్తోంది. ఫండమెంటల్‌ పెట్రోకెమికల్‌.. ఆర్థోగ్జిలీన్‌(ఓఎక్స్‌) నుంచి డౌన్‌స్ట్రీమ్‌ ప్రొడక్ట్‌గా పాన్‌ను ఉత్పత్తి చేస్తారు. ఆర్గానిక్‌ కెమిస్ట్రీలో మార్పులకు అనుగుణమైన(వెర్సటైల్‌) ఇంటర్మీడియెట్‌గా పాన్‌ను వినియోగిస్తారు. ప్రధానంగా ప్లాస్టిసైజర్స్‌, అన్‌శాచ్యురేటెడ్‌ పాలియస్టర్‌ రెజిన్స్‌, ఆల్కిల్‌ రెజిన్స్‌, పాలియోల్స్‌ తయారీలో పాన్‌ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం పాన్‌, ఓఎక్స్‌ మధ్య ధరల వ్యత్యాసం తగ్గుతోంది. దశాబ్దకాలపు సగటును పరిగణిస్తే ఒక్కో ఎంటీకి ధరల వ్యత్యాసం 150–200 డాలర్ల నుంచి 90 డాలర్లకు దిగివచ్చింది. ఈ వ్యత్యాసం సాధారణ స్థితికి చేరుకునే అవకాశమున్నట్లు భావిస్తున్నాం. దీంతో స్థూల లాభాల్లో భారీ వృద్ధి పటిష్టం కానుంది. కంపెనీ అమ్మకాలు మరింత పెంచుకునే బాటలో కంపెనీ పాన్‌ తయారీ సామర్థ్యాలను 24 శాతంమేర విస్తరిస్తోంది. వార్షికంగా 222, 110 మిలియన్‌ టన్నుల(ఎంటీపీఏ) నుంచి 275, 110 ఎంటీపీఏకు పెంచుకుంటోంది. ప్రస్తుతం కంపెనీ సామర్థ్యాన్ని 90% మేర వినియోగించుకుంటోంది.

**దాల్మియా భారత్‌ | మోతీలాల్‌ ఓస్వాల్‌ | కొనొచ్చు**



**ప్రస్తుత ధర: రూ. 2,205 టార్గెట్‌: రూ. 2,800**

**ఎందుకంటే:** ప్రయివేట్‌ రంగ సిమెంట్‌ కంపెనీ దాల్మియా భారత్‌ లిమిటెడ్‌ మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్‌ సెన్సెక్స్‌(బీఎస్‌ఈ)తో పోలిస్తే అంత గొప్ప పనితీరును ప్రదర్శించలేకపోయింది. కొన్ని కారణాలవల్ల గత ఆరు నెలల్లో మేము పలు సిమెంట్‌ రంగ స్టాక్స్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. 2022 డిసెంబర్‌లో ప్రకటించినప్పటికీ జైప్రకాశ్‌ అసోసియేట్స్‌(జేపీఏ) సిమెంట్‌ ఆస్తుల కొనుగోలులో ఆలస్యం, దేశీయంగా తూర్పు ప్రాంతంలో సిమెంటుకు డిమాండ్‌ మందగించడం వంటి అంశాలు ఇందుకు ప్రభావం చూపాయి. అయితే కంపెనీ దీర్ఘకాలిక ఔట్‌లుక్‌(భవిష్యత్‌)పై ఆశావహంగా ఉన్నాం. వార్షిక ప్రాతిపదికన 2031కల్లా సిమెంట్‌ తయారీ సామర్థ్యాన్ని సగటున 14–17 శాతం చొప్పున పెంచుకునే ప్రణాళికల్లో ఉంది. వెరసి వార్షికంగా 110–130 మిలియన్‌ టన్నుల(ఎంటీపీఏ) సామర్థ్యాన్ని అందుకునేందుకు అడుగులు వేయనుంది. నిలకడైన వృద్ధిని కొనసాగించేందుకు వివిధ వ్యూహాలు అమలు చేస్తోంది. అధిక బ్లెండెడ్‌ సిమెంట్‌ తయారీ, హరిత ఇంధనాలకు ప్రాధాన్యత, పటిష్ట బ్యాలన్స్‌షీట్‌తోపాటు.. నికర రుణాలు–నిర్వహణ లాభం(ఇబిటా) నిష్పత్తిని 2 కంటే దిగువనే కొనసాగించే లక్ష్యాలు కంపెనీకి ప్రోత్సాహాన్నివ్వనున్నాయి. మూడేళ్ల కాలం(2023–26)లో వార్షికంగా కన్సాలిడేటెడ్‌ ఆదాయం 11 శాతం, ఇబిటా 24%, నికర లాభం 34% వృద్ధి చెందొచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో పేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్‌ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

## క్లుప్తంగా...



పెద్దపల్లిలో ఓ యువకుడు తన చేతిపై శ్రీరాముడి చిత్రాన్ని టాటూలా వేయించుకుంటున్న దృశ్యం

### నేడు ఎస్వీబీసీలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం

**తిరుమల:** అయోధ్య శ్రీరామమందిరంలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనుంది. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర భక్తి చానల్ తమిళం, కన్నడ, హిందీ చానళ్లలో, అదేవిధంగా ఎస్వీబీసీ తెలుగు యూట్యూబ్ చానల్ ద్వారా అయోధ్యలో జరిగే వైదిక, ఆధ్యాత్మిక క్రతువులను నిరంతరాయంగా ప్రత్యక్షప్రసారం చేయనుంది.

### రిపబ్లిక్ డే వేడుకలకు గిరిజన విద్యార్థులకు ఆహ్వానం

**24న ప్రధానితో భేటీ,**
**25న చారిత్రక ప్రదేశాల సందర్శన**

**సాక్షి, హైదరాబాద్:** ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 30 మంది గిరిజన విద్యార్థులకు ఆహ్వానం అందింది. ఆశ్రమ పాఠశాలల్లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చదువులో, ఆటల్లో, సాహిత్య పోటీల్లో, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్‌ఫెయిర్ తదితర కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 15 మంది బాలురు, 15 మంది బాలికలకు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఈ అరుదైన అవకాశం కల్పించింది. ఈమేరకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆయా విద్యార్థులకు ఆహ్వానం పంపింది. ఎంపికైన విద్యార్థులను ఢిల్లీకి తీసుకెళ్లేందుకు ముగ్గురు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చందన సర్పే, స్పోర్ట్స్ ఆఫీసర్ బెల్లంకొండ జ్యోతి, బానోత్ లాలూలను లైజన్ అధికారులుగా ప్రభుత్వం నియమించింది. ఈ విద్యార్థులు ఈనెల 24న ప్రధానమంత్రి కార్యాలయాన్ని సందర్శిస్తారు. ఆ తర్వాత ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. 25న ఢిల్లీలోని చారిత్రక ప్రాంతాల సందర్శన తర్వాత 26న గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

### హెచ్‌సీయూ విద్యార్థికి రాజనీతిశాస్త్రంలో డాక్టరేట్



**సాక్షి, హైదరాబాద్:** జగిత్యాల జిల్లా పరిధిలోని చందోలుకు చెందిన అఖిల్ కుమార్‌కు ''ప్రచ్ఛన్న యుద్ధానంతర ప్రపంచంలో భారత్ ఇజ్రాయెల్ సంబంధాలు''అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఆయనకు హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. అఖిల్ కుమార్ తన ఎం.ఫిల్‌లో భాగంగా ''పాకిస్తాన్, సౌదీ సంబంధాలలో బాహ్యశక్తుల పాత్ర''అంశంపై చేసిన పరిశోధనకు పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి 2017లో బంగారు పతకం అందుకున్నారు.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

**శంషాబాద్:** శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన బాంబు బెదిరింపు కాల్ కలకలం సృష్టించింది. ఇద్దరు వ్యక్తులు బాంబులతో కూడిన రెండు బ్యాగులతో ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించి విమానాశ్రయాన్ని పేల్చివేయనున్నారని ఓ వ్యక్తి శనివారం రాత్రి కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. తన పేరు ప్రశాంత్ అని, హైదరాబాద్‌లోని కాచిగూడ నుంచి ఫోన్ చేస్తున్నానని, ఇద్దరు వ్యక్తులు టీ స్టాల్ వద్ద మాట్లాడుకుంటుడగా తాను ఈ విషయం విన్నట్లుగా అతను చెప్పాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, బాంబు స్క్వాడ్‌లతో అర్ధరాత్రి వరకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి బాంబు లేదని నిర్ధారించుకున్నారు. పోలీసుల దర్యాప్తులో కాల్ చేసిన వ్యక్తి ముంబై నుంచి చేసినట్లు తెలిసింది.

### 'శంషాబాద్'లో రూ.41 కోట్ల హెరాయిన్ పట్టివేత

**శంషాబాద్:** శంషాబాద్ విమానాశ్రయంలో రూ.41 కోట్ల విలువైన హెరాయిన్‌ను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. దక్షిణాఫ్రికాకు చెందిన ఓ మహిళ జాంబియా లుసాకా నుంచి వయా సింగపూర్ మీదుగా శనివారం అర్ధరాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. కస్టమ్స్ అధికారుల సాధారణ తనిఖీల్లో భాగంగా ఆ మహిళ హ్యాండ్‌బ్యాగ్‌ను పరిశీలించగా అందులో ఓ పారలోపలిభాగంలో ఓ డాక్యుమెంట్ ఫోల్డర్ ఉంది. దాన్ని విప్పి చూడగా అందులో తెల్లటి పౌడర్ లభించింది. పరీక్షల నిమిత్తం ఆ పౌడర్‌ను ల్యాబ్‌కు పంపగా..దాన్ని నిషేధిత మాదకద్రవ్యం హెరాయిన్‌గా తేలింది. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.41.4 కోట్లు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. సదరు మహిళను అరెస్టు చేసి కేసు దర్యాప్తు ప్రారంభించారు.

# ప్రపంచ నగరిగా అయోధ్య



**రూపురేఖలు మార్చుకోబోతున్న ఆధ్యాత్మిక నగరం**

- ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేలా మాస్టర్ ప్లాన్–2031
- రూ.85 వేల కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళిక
- సరయూ నదిలోకి చుక్క మురికినీరు చేరకుండా ఎస్టీపీలు
- ప్లాస్టిక్ వ్యర్థాలను ఇంధనంగా మార్చే రీసైక్లింగ్ యూనిట్
- స్టార్ హోటళ్లు సహా విస్తృతంగా వసతి సౌకర్యాలు
- నిత్యం మూడు లక్షల మంది భక్తులు వచ్చినా తట్టుకునేలా చర్యలు

**సాక్షి, హైదరాబాద్:** అయోధ్య.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఈ పేరు మారుమోగుతోంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద హిందూ దేవాలయంగా రూపొందిన భవ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు ఆ ఆధ్యాత్మిక నగరి ముస్తాబైంది. సోమవారం జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పలు దేశాల్లో లైవ్ టెలికాస్ట్ చేస్తున్నారు కూడా. ప్రపంచవ్యాప్తంగా పేరున్న చారిత్రక కూడళ్లలో భారీ తెరలు ఏర్పాటు చేసి మరీ ప్రత్యక్ష ప్రసారం చేయబోతున్నారు. ఈ ఘనత ఇక్కడికే పరిమితం కాకుండా.. అయోధ్యను ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, యూపీ రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ప్రాజెక్టులు చేపడుతున్నాయి.

#### రూ.85 వేల కోట్లతో అభివృద్ధి పనులు

కొత్త రామాలయ నిర్మాణ ప్రారంభానికి ముందు అయోధ్యకు నిత్యం సగటున 2వేల మంది భక్తులు వచ్చేవారు. పనులు ప్రారంభమయ్యాక ఆ సంఖ్య 50 వేలకు చేరింది. జనవరి ఒకటిన 2 లక్షల మంది భక్తులు తరలివచ్చారు. ఆలయంలో దర్శనాలు మొదలయ్యాక నిత్యం లక్ష మంది వరకు వస్తారని.. క్రమంగా 3 లక్షల వరకు పెరగవచ్చని అంచనా. ఇప్పుడు ఇరుకుగా ఉన్న అయోధ్య అంత తాకిడిని తట్టుకోలేదని తేలిన ప్రభుత్వ యంత్రాంగం.. 2031 లక్ష్యంగా ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసింది. ఆర్కిటెక్ట్, అర్బన్ ప్లానర్ దీక్షు కుక్రేజా ఆధ్వర్యంలో దీనిపై విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశారు. ప్రపంచస్థాయి నగరంగా అయోధ్యను రూపొందించటమే తమ లక్ష్యమని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు కూడా.



#### నగరాన్ని భారీగా విస్తరించి..

కొత్త మాస్టర్ ప్లాన్‌లో అయోధ్య పట్టణం, దానికి జంటగా ఉన్న ఫైజాబాద్‌తోపాటు సమీపంలోని దాదాపు 26 గ్రామాలను చేర్చి.. 875 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఆధునిక అయోధ్యను తీర్చిదిద్దబోతున్నారు. ఇందులో భాగంగా 1,200 ఎకరాల్లో రూ.2,200 కోట్ల వ్యయంతో న్యూఅయోధ్య పేరుతో భారీ టౌన్‌షిప్ పనులను ఇప్పటికే మొదలుపెట్టారు. ఇది సరయూ నది కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. అందులో ఇటీవల హోటల్ కోసం ఓ ప్లాట్‌ను వేలం వేయగా చదరపు మీటరుకు రూ.1,09,000 చొప్పున ధర పలకడం గమనార్హం. ఇలాంటి మరికొన్ని టౌన్‌షిప్‌లకూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- అయోధ్య పాత పట్టణంలో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు పనులు ప్రారంభించారు. ప్రధాన రోడ్లను వెడల్పు చేస్తున్నారు. రామాలయానికి దారితీసే మూడు ప్రధాన మార్గాలను ఇప్పటికే విస్తరించారు. రూ.33 కోట్లతో ఓ మల్టీలెవల్ పార్కింగ్‌ను అందుబాటులోకి తెచ్చారు.
- పట్టణంలో డీజిల్ ఆటోలకు బదులు 250 ఎలక్ట్రిక్ ఆటోలు తిప్పుతున్నారు. విమానాశ్రయం నుంచి పట్టణానికి, ఆలయం వద్దకు తిప్పేందుకు 250 ఎలక్ట్రిక్ బస్సులను సిద్ధం చేశారు. వాటి సంఖ్యను 500కు పెంచబోతున్నారు.
- అయోధ్య పట్టణం నుంచి వెలువడే మురికినీరు సరయూ నదిలోకి చేరుతోంది. దాన్ని పూర్తిగా నిరోధించి, మురికి నీటి శుద్ధికోసం ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్టీపీల)ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఒక ఎస్టీపీ అందుబాటులోకి రాగా.. మరో రెండింటి పనులు జరుగుతున్నాయి.

#### సోలార్ సిటీగా అయోధ్య

అయోధ్యలో సౌర విద్యుత్ విస్తృత వినియోగం కోసం ఐదేళ్ల కాలపరిమితితో ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టారు. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, పరిశ్రమల రూఫ్ టాప్‌పై సౌర ఫలకాలను అమరుస్తున్నారు. వీటితో 8.5 మెగావాట్ల విద్యుత్ సమకూరనుంది. ఇక సరయూ నది తీరంలో 40మెగావాట్ల సోలార్ ప్లాంట్‌ను ఎన్టీపీసీ ఏర్పాటు చేస్తోంది. ఇందులో 10 మెగావాట్ల ప్లాంటు ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది.

- → అయోధ్య శివార్లలో సరయూ తీరం వెంట 12.90 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారిపై సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇంత నిడివిలో సోలార్ లైట్లు ఉండటం రికార్డు అని, దీనికి గిన్నిస్‌బుక్‌లో చోటు దక్కనుందని యూపీ ప్రభుత్వ యంత్రాంగం ప్రకటించింది.
- → సౌర ఫలకాలతో కూడిన 'సోలార్ ట్రీ'లను నగరవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నారు. 1 కేవీ సామర్థ్యం ఉన్నవి 40.. 2.5 కేవీ సామర్థ్యం ఉన్నవి 18 సిద్ధమవుతున్నాయి. తాగునీటి కియోస్కులు, మొబైల్‌ఫోన్ చార్జింగ్ పాయింట్లు ఈ విద్యుత్‌తోనే పనిచేయనున్నాయి.
- → సరయూ నదిలో సౌర విద్యుత్‌తో పనిచేసే పవర్ బోట్లను అందుబాటులోకి తెస్తున్నారు.

#### ప్లాస్టిక్ నుంచి ఇంధనం

అయోధ్యలో ప్లాస్టిక్ వ్యర్థాలను వాహనాల ఇంధనంగా మార్చే రీసైక్లింగ్ యూనిట్ త్వరలో అందుబాటులోకి రానుంది. అయోధ్య మున్సిపల్ కార్పొరేషన్‌తో కుదిరిన ఒప్పందం మేరకు బెంగుళూరుకు చెందిన సంస్థ దీన్ని ఏర్పాటు చేస్తోంది. ఇది ఏటా 7,300 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను ఇంధనంగా మార్చగలదు. ఉత్తర భారతంలో ఈ తరహా అతిపెద్ద ప్లాంటు ఇదే కానుంది.

#### విస్తృతంగా వసతి సౌకర్యాలు

అయోధ్యకు భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నందున హోటల్ పరిశ్రమ కూడా విస్తృతమవుతోంది. దేశవ్యాప్తంగా ఫైవ్‌స్టార్ హోటళ్లను నిర్వహిస్తున్న ఓ పెద్ద సంస్థ 120 గదులతో ఒకటి, 100 గదులతో మరోటి చొప్పున రెండు స్టార్ హోటళ్ల నిర్మాణ పనులు ప్రారంభించింది. చిన్న, మధ్యస్థాయి హోటళ్లు, భోజన వసతి ఇళ్లను నిర్వహించే మరో కంపెనీ.. వెయ్యి గదులతో కూడిన 50 హోటళ్లను, భోజన నివాసాలను అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మరికొన్ని సంస్థలు 1,100 గదులతో కూడిన హోటళ్లను నిర్మించనున్నాయి. దేశవ్యాప్తంగా ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్న బడా సంస్థ 51 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,500 కోట్లతో లగ్జరీ విల్లాలు, సాధారణ ఇళ్లు, హోటళ్లను నిర్మించేందుకు ఒప్పందాలు చేసుకుంది.

### అయోధ్యకు లక్ష వెంకన్న లడ్డూలు

**రామ మందిర ట్రస్టుకు అందజేసిన టీటీడీ**



అయోధ్యలో భూమన కరుణాకరరెడ్డి

**తిరుమల:** అయోధ్యలో సోమవారం జరుగనున్న బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు పంపిణీ చేయడానికి తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి ప్రసాదం అయిన లక్ష లడ్డూలను రామ మందిర ట్రస్టు ప్రతినిధులకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం అందజేశారు. తొలుత రామ మందిరానికి చేరుకున్న కరుణాకరరెడ్డికి రామ మందిర ట్రస్టు ప్రతినిధి సాధ్వి రితంబరి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన రామాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తర్వాత ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులతో మాట్లాడారు. కలియుగంలో తిరుమలలో స్వయంభువుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారే త్రేతాయుగంలో శ్రీరామచంద్ర మూర్తి అని చెప్పారు. శ్రీవారి ప్రథమ సేవకుడిగా ఉన్న తనకు రామ మందిర ప్రారంభ మహోత్సవంలో పాల్గొనే అదృష్టం దక్కడం పూర్వజన్మ సుకృతమని ఆనందం వ్యక్తం చేశారు.




### సుందర 'సైకత' రాముడు

అయోధ్యలో జరుగనున్న బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా రంగంపేట గ్రామానికి చెందిన ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ ఆదివారం శ్రీరాముని సైకత శిల్పాన్ని రూపొందించారు. అయోధ్య రాముని ఆగమనం ...అవనికే ఆనందం అంటూ అక్షరాలను తీర్చిదిద్దారు. సుందర రూపంలో 'సైకత' రాముడు అందర్నీ ఆకట్టుకుంటున్నాడు.

–రంగంపేట

# పీజీపై తగ్గుతున్న క్రేజ్



**పోస్టు–గ్రాడ్యుయేషన్ చేసినా పెద్ద ఉద్యోగాలేవి?**

- యువతలో పెరుగుతున్న నైరాశ్యం
- పరిశోధన శక్తి తగ్గుతోందని యూజీసీ ఆందోళన
- పరిశ్రమలతో కలిసి పీజీ మార్పునకు యత్నాలు
- కసరత్తు మొదలు పెట్టిన యూజీసీ
- ఇంకా తగ్గని ఇంజనీరింగ్ మోజు

**సాక్షి, హైదరాబాద్:** సంప్రదాయ పోస్టు–గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు క్రమంగా తగ్గుతున్నాయి. ఉన్న సీట్లలో కనీసం సగం భర్తీ అవ్వడం కూడా కష్టంగా ఉంది. డిగ్రీలో బీకాం వరకూ అత్యధిక ప్రాధాన్యతనిచ్చే విద్యార్థులు ఎంకామ్‌కు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. పీహెచ్‌డీ స్థాయి వరకూ వెళ్దామనుకునే వాళ్లు ఎంఎస్సీ కోర్సును ఎంచుకుంటున్నారు. ఇక బీఏ కోర్సుల్లో చేరే వాళ్లే తక్కువగా ఉంటుంటే, ఎంఏ వరకూ వెళ్దామనుకునే వాళ్లు ఇంకా తక్కువ. గ్రూప్స్, సివిల్స్ రాయాలనుకునే విద్యార్థులు మాత్రమే ఇటువైపు వెళ్తున్నారు. ఈ మూడు ప్రధాన కోర్సులకు కలిపి రాష్ట్రంలో 50 వేల కన్వీనర్ కోటా సీట్లు ఉంటే, గడచిన విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులు కేవలం 20,484 మంది మాత్రమే. అంటే కేవలం 40.96 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

#### ఈ పరిస్థితికి కారణమేంటి?

ఇంటర్ తర్వాత ఎక్కువ శాతం ఇంజనీరింగ్ వైపు వెళ్లాలనే భావిస్తున్నారు. ఇంజనీరింగ్ తర్వాత ఏదైనా ప్రైవేటు కంపెనీల్లో స్థిరపడొచ్చని, లేదా విదేశీ విద్యకు వెళ్లచ్చని ఆలోచిస్తున్నారు. దాదాపు 4 లక్షల మంది ఇంటర్ పాసవుతుంటే, వీరిలో 90 వేల మంది ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారు. మరో 20 వేల మంది ఇతర రాష్ట్రాల్లోని డీమ్డ్ వర్సిటీల్లోకి వెళ్తున్నారు. 40 వేల మంది వరకూ ఇంటర్‌తో విద్య ముగించి ఏదో ఒక వృత్తి, ఉద్యోగంలో స్థిరపడుతున్నారు. ఇక బీఏ, బీకాం, బీఎస్సీ సహా ఇతర డిగ్రీ కోర్సుల్లో చేరే వారి సంఖ్య ఏటా 2.20 లక్షల వరకూ ఉంటోంది. ఇందులోనూ కంప్యూటర్ నేపథ్యం ఉన్న బీకాం, ఆనర్స్ బీఏ వంటి కోర్సులకే ప్రాధాన్యమిస్తున్నారు. డిగ్రీ తర్వాత ఉన్న పరిజ్ఞానంతో ఏదో ఒక ఉద్యోగంలోకి వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. బీఎస్సీ చేసిన విద్యార్థులు కూడా ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాల వైపు చూస్తున్నారు. పోస్టు–గ్రాడ్యుయేట్ చేసినా పెద్దగా ఉద్యోగాలు ఉండవనేది యువతలో ఉన్న అభిప్రాయం. లెక్చరర్‌గా వెళ్లేందుకు మాత్రమే ఇది తోడ్పడుతుందనే భావన ఉంది. దీంతో డిగ్రీ చేసినా పీజీకి వెళ్లడం లేదని ఇటీవల యూజీసీ జరిపిన అధ్యయనంలో వెల్లడైంది.

**పీజీలోని ప్రధాన కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాలు ...**

| 2022 | కోర్సు | 2023 |
|---|---|---|
| 996 | ఎంఏ ఇంగ్లిష్ | 1150 |
| 1063 | ఎంఏ తెలుగు | 1092 |
| 2179 | ఎంకామ్ | 2181 |
| 1045 | ఎమ్మెస్సీ బాటనీ | 1164 |
| 2385 | ఎమ్మెస్సీ కెమిస్ట్రీ | 2188 |
| 1445 | ఎమ్మెస్సీ గణితం | 1326 |
| 1412 | జువాలజీ | 1416 |
| 428 | న్యూట్రిషన్ | 780 |
| 289 | ఫుడ్ టెక్నాలజీ | 231 |
| - | డేటాసైన్స్ | 231 |

#### కొత్త కోర్సులైనా అంతేనా?

పీజీ కోర్సులు నిర్వీర్యం అవ్వడం వల్ల దేశంలో పరిశోధన శక్తి పడిపోతోందని యూజీసీ హెచ్చరిస్తోంది. పీజీ వరకూ విద్యార్థులు వెళ్ళేలా అవసరమైన ప్రోత్సాహం ఇవ్వాలని పేర్కొంటోంది. ఇందులో భాగంగానే ఎంఎస్సీ డేటా సైన్స్, ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ వంటి కోర్సుల్లో మార్పులు చేశారు. సరికొత్త సిలబస్‌ను జోడించారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దుతున్నారు. అయినప్పటికీ పెద్దగా విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. పీజీలో మొత్తం 48 కోర్సులుంటే, వాటిలో జాగ్రఫీ, ఎంపీఎడ్, టూరిజం, లైబ్రరీ సైన్స్, ఇస్లామిక్ స్టడీస్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ కోర్సుల్లో ప్రవేశాలు నామమాత్రంగానే ఉన్నాయి. ఎంకాం, ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ఎన్ని మార్పులు చేసినా ఫలితం ఉండటం లేదు. స్టాటిస్టిక్స్‌లో గత ఏడది 417 సీట్లుంటే, కేవలం 358 మంది చేరారు. ఏంఏ రాజనీతి శాస్త్రంలో 639 మంది చేరారు. ఎమ్మెస్సీ మేథ్స్‌లో 1445కు మించి చేరలేదు. పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరే వాళ్ళల్లో అమ్మాయిలే ఎక్కువ మంది ఉంటున్నారు. దీంతో పరిశ్రమల భాగస్వామ్యంతో పీజీ కోర్సులు నిర్వహించాలని యూజీసీ సూచిస్తోంది. పీజీ తర్వాత పరిశోధన రంగానికి పీజీ విద్యార్థులు వెళ్ళే సరికొత్త విధానంపై కసరత్తు చేయాలని సూచించింది. దీనిపై వచ్చే విద్యా సంవత్సరంలోగా సరికొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని యూజీసీ భావిస్తోంది.

#### ఉపాధి వైపే యువత మొగ్గు

డిగ్రీ లేదా ఇంజనీరింగ్‌తోనే ఏదో ఒక ఉపాధి వైపు వెళ్ళాలని యువత భావిస్తోంది. పీజీ కోర్సుల తర్వాత ఉద్యోగాలు పెద్దగా ఉండవనే భావన కూడా పీజీ ప్రవేశాలు తగ్గడానికి కారణం. పీజీలో అనేక మార్పులకు అడుగులు పడుతున్నాయి. భవిష్యత్‌లో పీజీ అవసరం అన్న భావన విద్యార్థుల్లో తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి (ఉన్నత విద్యా మండలి చైర్మన్)

## అంతా రామమయం



### న్యూస్‌పేపర్.. 'రామమందిరం' సూపర్

**వారంరోజుల్లో నమూనా తయారు చేసిన యువతి**

**చండూరు:** అయోధ్యలోని రామమందిరం నమూనాను న్యూస్‌పేపర్‌తో తయారు చేసి ఓ యువతి భక్తిని చాటుకుంది. నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీకి చెందిన చేనేత కార్మికుడు చెరుపల్లి శ్రీనివాస్ కూతురు విజయలక్ష్మి బీఈడీ చదువుతోంది. ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్న తరుణంలో రామాలయ నమూనాను తయారు చేయాలన్న ఆలోచన కలిగిందని ఆమె తెలిపింది. న్యూస్‌పేపర్, ఫెవికాల్ ఉపయోగించి రామమందిరం నమూనా తయారీకి శ్రీకారం చుట్టింది. బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నాటికి సిద్ధం చేయాలన్న సంకల్పంతో వారంరోజులు కష్టపడి పూర్తి చేసినట్లు విజయలక్ష్మి తెలిపింది.



### పెన్సిల్‌పై 'జై శ్రీరామ్'



సాయి దీక్ష

**పాపన్నపేట(మెదక్):** అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని పెన్సిల్‌పై 'జై శ్రీరామ్'అనే అక్షరాలు లిఖించి సూక్ష్మకళ నైపుణ్యాన్ని చాటుకుంది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం మిన్‌పూర్‌కు చెందిన సాయిదీక్ష గౌడ్, నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ 4వ సంవత్సరం చదువుతోంది. ఆమెకు చిన్నప్పటి నుంచి సూక్ష్మకళ అంటే అభిమానం. ఈ క్రమంలో సోమవారం అయోధ్యలో జరగబోయే బాలరాముని విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా పెన్సిల్‌పై జై శ్రీరామ్ అనే అక్షరాలను అందంగా చెక్కి తన నైపుణ్యాన్ని చాటుకుంది.

### రెండు గ్రాముల 'బంగారు' రామాలయం



శ్రీరామోజు నరేశ్



**నిర్మల్:** అయోధ్యలో బాలరాముడు కొలువుదీరే వేళ రామభక్తులు తమ కళానైపుణ్యాలతో వివిధ రకాల ప్రతిమలను తయారు చేసి భక్తిని చాటుకుంటున్నారు. నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన బీజేపీ నేత శ్రీరామోజు నరేశ్ బంగారంతో అయోధ్య రామాలయాన్ని తయారుచేశారు. రెండు గ్రాముల బంగారంతో రెండు గంటలు శ్రమించి చిన్నసైజులో అయోధ్య రామాలయాన్ని తీర్చిదిద్దారు. ఇందుకుగాను రూ.12,800 ఖర్చు చేసినట్లు చెప్పారు. శ్రీరాముడిపై భక్తితోనే బంగారు ఆలయాన్ని తయారు చేశానని తెలిపారు.

### బిస్కెట్ టెంపుల్



**ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బిస్కెట్లతో రామ మందిరం నిర్మించారు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం బీజేపీ మాజీ కౌన్సిలర్ నాయిని రజని. ఈ గుడి ఎంతో చూడముచ్చటగా ఉండటంతో అందరూ ఆసక్తిగా వీక్షిస్తున్నారు. థర్మకోల్ షీట్‌తో రామమందిర నమూనాను తయారు చేసి, చుట్టూ చిన్న షల్ఫ్ బిస్కెట్లు, మీడియం సైజు బిస్కెట్లను అంటించి తీర్చిదిద్దానని, దీనికి రెండురోజులు పట్టిందని రజని చెప్పారు.

### గజ్వేల్.. నాణేల రామాలయం జిగేల్



**గజ్వేల్ రూరల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు నాణేలతో రామమందిరం నిర్మించారు. గజ్వేల్‌లోని రామకోటి కార్యాలయంలో ఒకటి, రెండు, ఐదు రూపాయల నాణేలు కలిపి 10 అడుగుల పొడవుతో అయోధ్య రామమందిర నమూనా ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. నాణేల మొత్తం విలువ రూ.20 వేలు అని చెప్పారు.

### సుద్దముక్కపై చూడ చక్కగా..





బ్రహ్మచారి

**మనోహరాబాద్ (తూప్రాన్):** మనోహరాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు బ్రహ్మచారి సుద్ద ముక్కపై శ్రీరాముడి రూపాన్ని అద్భుతంగా చెక్కారు. సోమవారం అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని దీనిని రూపొందించానని ఆయన వెల్లడించారు.

### రావి ఆకుపై బాలరాముడు





◀ శ్రీనివాసచారి

**పెద్దశంకరంపేట (మెదక్):** అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల శ్రీనివాసచారి ఆదివారం రావి ఆకుపై బాల రాముడిని చిత్రీకరించాడు. చిత్రాన్ని చూసిన పలువురు అతన్ని అభినందించారు.

### బియ్యపుగింజపై 'పసిడి శ్రీరాం'



**చౌటుప్పల్:** యాదాద్రి జిల్లా చౌటుప్పల్ విద్యానగర్‌కాలనీకి చెందిన శ్రీపూజా జువెల్లరీ దుకాణ యజమాని దాసోజు సంపూర్ణాచారి వినూత్నంగా రామభక్తిని చాటుకున్నారు. అయోధ్య రామమందిరం నుంచి ఇటీవల తన ఇంటికి అక్షింతల రూపంలో వచ్చిన బియ్యపుగింజపై 10 మిల్లీగ్రాముల బంగారాన్ని వినియోగించి శ్రీరాం అనే అక్షరాలను రూపొందించాడు. రాముడి విగ్రహావిష్కరణ సందర్భంగా దీనిని రూపొందించడం ఆనందంగా ఉందని సంపూర్ణాచారి తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.